వాసుల్ గతి సారథుల పై విశ్లేషణ

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

కర్నూలు

: fb.com/vaartha Digital


Published from Kurnool, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

7-5-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 95 పేజీలు: 10+4 వెల: 6.50



మాజీ ఎంపీ పాలకొండ రాయుడు మృతి 2లో

అమెరికానుంచి వెళ్తే వెయ్యి డాలర్లు ఇస్తాం: ట్రంప్ 5లో

## ఓబుళాపురం మైనింగ్ కేసు

# 'గాలి' సోదరులకు ఏడేళ్ల జైలు

### మరో ఇద్దరు, ఓ కంపెనీకి కూడా శిక్ష విధించిన సిబిఐ కోర్టు

### నాటి గనుల మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఐఎఎస్ అధికారి కృపానందం నిర్దోషులుగా తీర్పు

**ఉమ్మడి ఏపిలో తీవ్ర సంచలనం కలిగించిన ఓబుళాపురం మైనింగ్ కేసు**

**హైదరాబాద్, మే 6, ప్రభాతవార్త:** ఉమ్మడి ఏపిలో సంచలనం సృష్టించిన ఓబుళాపురం గనుల అక్రమ మైనింగ్ కేసులో 15 ఏళ్ల సుదీర్ఘ విచారణ తరువాత నాంపల్లి సిబిఐ కోర్టు మంగళవారం నాడు సంచలన తీర్పును వెలువరించింది. ఈ కేసులో ఎ1గా వున్న గాలి శ్రీనివాస్ రెడ్డి, ఎ2గా వున్న అతని సోదరుడు కర్నాటక ఎంఎల్ఏ గాలి జనార్ధన్ రెడ్డి, ఎ3గా వున్న నాటి ఏపి గనుల శాఖ డైరక్టర్ రాజగోపాల్, ఎ4గా వున్న ఓబుళాపురం మైనింగ్ కంపెనీకి, ఎ7గా వున్న మెఫజ్ అలీ ఖానకు సిబిఐ కోర్టు ఏడేళ్ల శిక్షను ఖరారు చేసింది. ఇదే కేసులో ఆరోపణలు ఎదుర్కొన్న నాటి గనుల శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఐఎఎస్ అధికారి కృపానందంలను సిబిఐ కోర్టు నిర్దోషులుగా ప్రకటించింది. ఈ కేసులో ఎ5గా వున్న లింగారెడ్డి మరణించగా ఎ6గా వున్న ఐఎఎస్ అధికారిణి శ్రీలక్ష్మిని కేసు నుంచి తెలంగాణ >>2



## మూడు కేటగిరీల్లో

# నేడు మాక్ డ్రిల్

### మొత్తం 244 జిల్లాల్లో చేయాలని కేంద్రం ఆదేశం

**న్యూఢిల్లీ, మే 6:** యుద్ధ సన్నద్ధతపై కేంద్ర హోంశాఖ కీలక సమీక్ష నిర్వహించింది. హోంశాఖ కార్యదర్శి గోవింద్‌మోహన్ నేతృత్వంలో ఈ సమీక్ష చేసింది. సుమారు 244 జిల్లాల్లో మాక్‌డ్రిల్స్‌కు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులు సమీక్షిస్తున్నారు. ఈ మేరకు సమీక్షకు సివిల్ డిఫెన్స్ డీజీ, ఎన్డీఆర్ఎఫ్ డీజీ సహా పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు. బుధవారం అన్ని రాష్ట్రాల్లో సివిల్ మాక్‌డ్రిల్స్ చేయాలని నిన్న కేంద్రం ఆదేశించింది. కాగా, తాము సన్నద్ధతను సమీక్షించామని సమావేశం అనంతరం >>2

## లిక్కర్ స్కామ్‌లో ఎ-31గా ధనుంజయ్

### కృష్ణమోహన్ రెడ్డి-32


### గోవిందప్ప - 33

**విజయవాడ,మే6,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ మద్యం కుంభకోణం కేసులో సిట్ అధికారులు మెమో వేశారు. లిక్కర్ స్కాం కేసులో ఎ 31గా ధనుంజయ రెడ్డి, ఎ 32 కృష్ణ మోహన్ రెడ్డి, ఎ 33 గోవిందప్ప బాలాజీలను చేర్చారు సిట్ అధికారులు. ఇటీవల అరెస్ట్ అయిన కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, చాణక్య రిమాండ్ రిపోర్ట్‌లో కూడా ఈ ముగ్గురు పేర్లను సిట్ అధికారులు ప్రస్తావించారు. ఈ ముగ్గరి ఆదేశాల మేరకు అప్పట్లో డబ్బులు వసూలు చేశామని, ఈ డబ్బులు వాళ్ల వద్దకు చేరాయని విచారణలో పేర్కొన్నారు నిందితులు. ఈ రిమాండ్ రిపోర్టు ఆధారంగానే వీళ్ల పేర్లు చేర్చినట్లు మెమోలో పేర్కొన్నారు. ఈ క్రమంలో అరెస్ట్ నుంచి రక్షణ కల్పించాలని నిన్న సుప్రీం కోర్టుకు ఈ ముగ్గురు వెళ్లారు. అయితే వీరికి అరెస్ట్ >>2

## దేవాదాయ శాఖలో

# 137 ఉద్యోగాల భర్తీ

### • మరో 16 ఆలయాల్లో నిత్యాన్నదానం • ఆగమశాస్త్రం మేరకే ఆలయాల అభివృద్ధి • మరో 200 మంది వైదిక సిబ్బంది నియామకం • దేవాదాయ శాఖపై సమీక్షలో సిఎం చంద్రబాబు



**విజయవాడ,మే 6,ప్రభాతవార్తప్రతినిధి:** దేవాలయాల పవిత్రతను కాపాడే దిశలో ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు. ఆలయాల్లో భక్తుల మనోభావాలకు ఎటువంటి ఇబ్బంది కలిగినా సహించేది లేదన్నారు. మంగళవారం సచివాలయంలో దేవాదాయ శాఖపై అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష జరిపారు. ఈ సమావేశంలో దేవాదాయ శాఖలో ఎప్పటి నుంచో ఖాళీగా ఉన్న డిప్యూటీ కమిషనర్, గ్రేడ్ 1,3 ఇఒతో సహా భారీగా పోస్టుల భర్తీకి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆమోదం తెలిపారు. మొత్తం 5 విభాగాల్లో 137 పోస్టులను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ విధానంలో భర్తీ చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. డిప్యూటీ కమిషనర్ 6, అసిస్టెంట్ కమిషనర్ 5, గ్రేడ్1 ఈవో 6, గ్రేడ్3 ఈవో 104, 16 జూనియర్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయాలని సూచించారు. ఈ నియామక ప్రక్రియ త్వరగా పూర్తిచేసి ఆలయాలు సమర్ధవంతంగా నిర్వహించేలా చూడాలన్నారు. అలాగే 200 వరకు ఉన్న వైదిక సిబ్బంది ఖాళీలను కూడా అర్హులైన వారితో భర్తీ చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు.

**ప్రతి భక్తుడికు అన్నప్రసాదం**

రాష్ట్రంలోని 23 ప్రధాన ఆలయాలు ఉండగా... వీటిలో శ్రీశైలం, శ్రీకాళహస్తి, కాణిపాకం, బెజవాడ దుర్గమ్మ, అన్నవరం, ద్వారకా తిరుమల, సింహాచలం ఇలా 7 ఆలయాల్లో మాత్రమే నిత్యాన్నదానం జరుగుతోంది. అయితే ముఖ్యమంత్రి... మిగిలిన 16 ఆలయాల్లో కూడా భక్తులకు అన్నదాన పథకం అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. అన్నప్రసాదం రుచి, నాణ్యత, పరిశుభ్రత ఉండేలా భక్తులకు పవిత్ర భావన కలిగేలా అందించాలి. ఇందుకోసం వాలంటరీగా వచ్చేవారి సేవలను వినియోగించుకోవాలి. అన్నప్రసాద కార్యక్రమానికి ఆదాయం సరిపోని దేవాలయాలకు 7 ప్రధాన ఆలయాల నుంచి నిధులు సమకూర్చేలా చూడాలి. తిరుమల వెంగమాంబ అన్నప్రసాదం తరహాలో ప్రమాణాలు పాటించాలి. దేశంలో ఎక్కడా లేనట్టుగా రాష్ట్రంలో అన్నప్రసాద వితరణ జరగాలి. అలాగే ప్రసాదాల నాణ్యతపైనా దృష్టి పెట్టాలి. ఆయా ఆలయాల ప్రసాదాల విశిష్టత కొనసాగేలా చూడాలి. నాణ్యతా పరీక్షలను ఎప్పటికప్పుడు నిర్వహించాలి, అని సీఎం అన్నారు.

బాలాజీ ఆలయ నిర్మాణనిధి ఏర్పాటు చేసి రాష్ట్రంలో ప్రతీ నియోజకవర్గంలో ఒకటి చొప్పున కొత్త ఆలయం నిర్మాణం చేపట్టాలి. ఆలయాలు నిర్మించి, నిర్వహణ విస్మరించొద్దు. దేవాలయాలపై దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకోవాలి. ప్రస్తుతం 50 వేలకు పైగా ఆదాయం ఉన్న ఆలయాల్లో మాత్రమే సిసి కెమేరాలు ఉండగా... 6సీ కేటగిరీ కింద నోటిఫైడ్ అయిన 24,538 ఆలయాల్లోనూ సిసి కెమేరాలు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

**శ్రీశైల క్షేత్రం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి**

రాష్ట్రంలో ద్వాదశ జ్యోతిర్లింగం, అష్టాదశ శక్తిపీఠం రెండూ కొలువైన ఒకే ఒక్క క్షేత్రం శ్రీశైలమని చంద్రబాబు అన్నారు. తిరుమల తిరుపతి స్థాయిలో శ్రీశైల క్షేత్రాన్ని అభివృద్ధి చేసేందుకు ఆస్కారం ఉందని ముఖ్యమంత్రి అన్నారు. శ్రీశైలంలో దేవాదాయ శాఖ భూములు పరిమితంగా ఉన్నందున ప్రణాళికాబద్ధంగా వినియోగించుకోవాలని సూచించారు. ఇకపై ప్రైవేట్ సంస్థలు, >>2

## కేంద్ర కేబినెట్ నేడు అత్యవసర భేటీ

**న్యూఢిల్లీ, మే 6:** పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ పాకిస్తాన్‌మధ్య తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. ఈ క్రమంలోనే భారత్ భద్రతా పరమైన చర్యలకోసం బుధవారం ఉదయం 11 గంటలకు కీలక కేబినెట్ సమావేశం జరుగుతుంది. ప్రధాని నరేంద్రమోడీ అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుంది. పాకిస్థాన్‌పై సైనిక చర్య తీసుకుంటారన్న ప్రచారాలమధ్య ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. ఇప్పటికే త్రివిధ దళాల అధిపతులు, ఎన్ఎస్ఏ అజిత్‌దోవాల్‌తో ప్రధానిమోడీ కీలక సమావేశాలు నిర్వహించారు. ఇప్పటికే త్రివిధ దళాల అధిపతులు, హోంశాఖ, రక్షణ మంత్రిత్వ శాఖలతో వేరువేరుగా సమావేశాలు నిర్వహించిన తర్వాత దేశవ్యాప్తంగా మాక్‌డ్రిల్స్ నిర్వహించాలని నిర్ణయించారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత వరుససమావేశాలతో కేంద్రం బిజీగాఉంది. అన్ని కీలకశాఖలతో సమావేశాలు సమీక్షలు ముగించిన ప్రధానిమోడీ ఇప్పటికే ఉగ్రదాడిపై అత్యంత తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీచేసిన సంగతి తెలిసిందే. ఉగ్రవాదులను ఏరిపారేస్తామని, పహల్గాం ఉగ్రవాదులను వెంటాడి మరీ కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతేకాకుండా వారికి మద్దతిస్తున్నవారిని ప్రోత్సహిస్తున్న సంస్థలను కూడా ఎట్టిపరిస్థితుల్లో ఉపేక్షించబోనని తెగేసి చెప్పారు.

## తొమ్మిది మంది డిప్యూటీ కలెక్టర్లు బదలీ

### దుర్గగుడి ఇఒగా వికె శీనా నాయక్

**విజయవాడ,మే6,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో 9 మంది డిప్యూటీ కలెక్టర్లను బదలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వారిలో విజయవాడ లోని శ్రీదుర్గామల్లేశ్వర స్వామి ఆలయ ఇఒగా వికె శీనా నాయక్‌ను నియమించింది. పులివెందుల ఆర్డీఓగా జి.చిన్నయ్యను నియమించింది. కాకినాడ సెజ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కెవి రామలక్ష్మిని ప్రభుత్వం బదలీ చేసింది. మిగిలిన వారికి ఆయా జిల్లాల్లో మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్లుగా, సమగ్ర శిక్షా అభియాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్లుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

## మళ్లీ బేబీకిట్ల పథకం

### రూ. 1410తో 11 వస్తువుల పంపిణీ

**విజయవాడ,మే6,ప్రభాతవార్తప్రతినిధి:** గతంలో అత్యంత ప్రజాదరణ పొందిన బేబీ కిట్‌ల సరఫరా పథకాన్ని పునరుద్ధరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విషయంలో ఆరోగ్య మంత్రిత్వ శాఖ చేసిన ప్రతిపాదనను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆమోదించారు. 2014-19 కాలంలో అమలైన ఈ పథకాన్ని గత ప్రభుత్వం రద్దు చేసింది. ఈ క్రమంలో బేబీ కిట్‌లను తిరిగి అందుబాటులోకి తీసుకుని వస్తున్న ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్ నుంచే నిధుల ఏర్పాటు చేసింది. గతంలో ఈ పథకానికి జాతీయ ఆరోగ్య మిషన్‌కింద కొంత మేరకు కేంద్ర సాయం అందేది. ఈ సాయాన్ని ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం నిలిపివేసింది. మాతృత్వ వందన యోజన, 15వ ఆర్థిక కమిషన్ నిధుల కింద కూడా ఈ కిట్‌ల సరఫరాకు కేంద్ర ప్రభుత్వ సాయం లభించే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో ఎంతో ప్రజాదరణ పొందిన ఈ పథకానికి అవసరమైన నిధుల్ని రాష్ట్ర ప్రభుత్వ నిధులనుంచే అందజేయాలని వైద్య,ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ చేసిన ప్రతిపాదనను ముఖ్యమంత్రి ఆమోదించారు. నవజాత శిశువుల ఆరోగ్యాన్ని కాపాడటానికి ఉద్దేశించిన 11 వస్తువులతో కూడిన ప్రతి బేబీ కిట్‌కు రూ.1,410లు ఖర్చవతుంది. ఈ పథకం కింద పంపిణీ చేసే వస్తువులు.. దోమ తెరతో కూడిన బేబీ బెడ్, వాటర్ ప్రూఫ్ కాట్ షీట్, బేబీ డ్రెస్, వాషబుల్ నేప్కిన్స్, టవల్, బేబీ పౌడర్, బేబీ షాంపూ, బేబీ ఆయిల్, బేబీ సబ్బు, సోప్ బాక్స్ , బేబీ రాటిల్ టాయ్. రాష్ట్రంలో జరిగి ప్రసవాల్లో సగానికి పైగా ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే జరుగుతున్నాయి.


రాష్ట్ర పండుగగా సత్యసాయి శతజయంతి 2లో


## పెండింగ్ డిజైన్లకు

# అనుమతివ్వండి

### పోలవరం సందర్శించిన విదేశీ ప్రతినిధుల బృందాన్ని కోరిన మంత్రి నిమ్మల



సోమవారం విదేశీ నిపుణుల సమావేశంలో మంత్రి నిమ్మలరామానాయుడు

**విజయవాడ.మే 6,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర అభివృద్ధికి, పోలవరం ప్రాజెక్ట్ పూర్తికి అవినాభావ సంబంధం ఉందని జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. జాతీయస్థాయిలో నదుల అనుసంధానానికి పోలవరం ప్రాజెక్టు పూర్తికి విడదీయలేని పరస్పర ఆధార ప్రాజెక్టులుగా మంత్రి అభివర్ణించారు. పోలవరం ప్రాజెక్ట్ పూర్తికి సాంకేతిక సలహాలు ఇవ్వడానికి వచ్చిన విదేశీ నిపుణుల బృందాన్ని మంత్రి నిమ్మల రామానాయుడు మంగళవారం కలిశారు. వారితో ఆయన మాట్లాడుతూ పోలవరం రాష్ట్రానికి జీవనాడన్నారు. అందుకే ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా పోలవరం పై ప్రత్యేక దృష్టి నిలిపారని మంత్రి వివరించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాల్సిన ఆవశ్యకతను, అవసరాన్ని నిపుణుల బృందానికి తెలియజెప్పారు. ముందు నిర్దేశించుకున్న లక్ష్యం ప్రకారం 2027 కల్లా పోలవరం ప్రాజెక్ట్ పూర్తి చేయాల్సి ఉంది. అందువల్ల మీరంతా సహకరించి లక్ష్యాన్ని ముందుగా పూర్తయ్యేటట్లు ప్రయత్నించాలని కోరారు. ఎగువ కాఫర్ డ్యామ్ బలోపేతం చేసేలా నిర్మిస్తున్న బట్రస్ డ్యామ్, గ్యాప్2 డి వాల్ పనులను మంత్రి నిమ్మల పరిశీలించారు.

ప్యానల్ అఫ్ ఎక్స్పర్ట్స్ టీం తో మాట్లాడి సాంకేతిక వివరాలు తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పోలవరం ప్రాజెక్ట్‌కు మొదటి ప్రాధాన్యత ఇస్తున్న అంశాన్ని మంత్రి వారి దృష్టికి తీసుకువచ్చారు. ప్రమాణస్వీకారం చేసిన వెంటనే పోలవరం ప్రాజెక్ట్‌ను సందర్శించిన విషయాన్ని వారికి గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన ఈ పది నెలల కాలంలో మూడుసార్లు పోలవరం >>2

## నేడు, రేపు భారీ వర్షాలు

**విజయవాడ,మే6,ప్రభాతవార్తప్రతినిధి:** ద్రోణి,వాతావరణ అనిశ్చితి ప్రభావంతో బుధ, గురువారాల్లో రాష్ట్రం లోని పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు నుండి భారీ వర్షాలకు అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. మంగళవారం రాష్ట్రంలో వాతావరణం కొంత మేరకు సాధారణ స్థితిలో ఉంది.కొన్ని ప్రాంతాల్లో గరిష్టంగా ఉష్ణోగ్రతలు 38 డిగ్రీలు సగటు నమోదైనట్లు సమాచారం.

శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం,అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, పల్నాడు,ప్రకాశం జిల్లాల్లో ఓ మోస్తరు నుండి భారీ వానలు కురుస్తాయని అంచనా వేసింది. పిడుగులు పడటంతో పాటు గంటకు 50 నుండి 60 కి.మీల వేగంతో ఈదురు గాలులూ వీయొచ్చని పేర్కొంది. విశాఖపట్నం, కాకినాడ, డా.బిఆర్ అంబేద్కర్ కోనసీమ,తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, >>2

# వడివడిగా అమరావతి నిర్మాణాలు

### నిర్దిష్ట కాలవ్యవధిలో రాజధానికి సమగ్ర రూపం: సిఎం చంద్రబాబు

### 'లా' వర్సిటీకి 55 క్వాంటం వ్యాలీకి 50, బసవతారకం ఆసుపత్రికి అదనంగా 6 ఎకరాలు కేటాయింపు

**విజయవాడ,మే6,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని నిర్మాణంలో ప్రతి విషయంలో గుణాత్మకంగా ఉండాలని సిఎం చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. సంపదను సృష్టించుకుంటూ ప్రతిష్టాత్మకంగా నిర్మించుకుంటున్న ఈ నగరం భవిష్యత్తు చరిత్ర పుటల్లో శాశ్వతంగా ఉండాలన్నారు. నిర్మాణం కోసం మనం తీసుకుంటున్న నిర్ణయాలు కచ్చితంగా అమలులో ఉండాలన్నారు. నిర్దేశిత వ్యవధిలో నిర్మాణపనులు శరవేగంగా సాగాలన్నారు. సిఆర్‌డిఏ ఈ విషయంలో ప్రతి అంశంలో దృష్టి పెట్టాలన్నారు. పురపాలక శాఖా మంత్రి పి,నారాయణ అధ్యక్షతన జరిగిన సిఆర్‌డిఏ 47వ అథారిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అనేకంశాలను పురపాలక శాఖా మంత్రి పి,నారాయణ, సిఆర్‌డిఏ అధికారులు ఆయన దృష్టికి తీసుకుని వచ్చారు. అంతకు ముందుగా జీవోఎం కూడా సమావేశమై రాజధానిలో భూ కేటాయింపులపై నిర్ణయం తీసుకుంది. రూ.514 కోట్లతో గెజిటెడ్ అధికారుల నివాస భవనాల నిర్మాణం చేపట్టనుంది. అలాగే అక్కడ అదనపు మౌలిక సదుపాయాలు కల్పన కోసం 194 కోట్లకు సిఆర్‌డిఏ అథారిటీ అనుమతి ఇచ్చింది. 9 టవర్‌ల నాన్ గెజిటెడ్ అధికారుల నివాసాలు, మౌలిక సదుపాయాలకు 517 కోట్లతో టెండర్‌లకు అనుమతి ఇచ్చింది. మొత్తంగా 1732.31 కోట్లకు అనుమతి ఇచ్చారు.

15 ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం కోసం అనుమతి ఇచ్చారు. 494 కోట్లతో పనులు చేపట్టేందుకు సిఆర్‌డిఏ అనుమతి ఇచ్చింది. 3.5 కిలోమీటర్ల ని3 ఎలివేటెడ్ రోడ్డుకు, 15 రహదారులను జాతీయ రహదారికి అనుసంధానం కోసం 70 కోట్ల రూపాయలు కేటాయించారు. 13 రహదారులను జాతీయ రహదారికి అనుసంధానం కోసం 387 కోట్ల రూపాయలతో పనులు చేపట్టేం దుకు అనుమతి ఇచ్చింది. జీవోఎంలోనూ వివిధ సంస్థలకు భూ కేటాయింపులు చేస్తూ నిర్ణయించింది. లా యూనివర్సిటీకి 55 ఎకరాలు, క్వాంటం వ్యాలీకి 50 ఎకరాలు, బసవతారకం ఆస్పత్రికి అదనంగా 6 ఎకరాలు కేటాయించింది. గతంలో ఈ సంస్థకు 15 ఎకరాలు కేటాయింపు చేసింది. ఆదాయపు పన్ను శాఖకు 0.78 ఎకరాలు, రెడ్ క్రాస్ సొసైటీకి 0.78, కోస్టల్ బ్యాంకుకు 0.40 ఎకరాల కేటాయించారు. ఐఆర్‌సిటిసికి ఎకరా భూమి కేటాయిస్తూ నిర్ణయించారు. ఇవాళ 7 సంస్థలకు భూ కేటాయింపులు చేస్తూ మంత్రుల కమిటీ నిర్ణయం తీసుకుంది. గతంలో 64 సంస్థలకు భూ కేటాయింపులు జరిగాయి. ఇప్పటి వరకూ 1050 ఎకరాల మేర భూ కేటాయింపులు రాజధాని ప్రాంతంలో జరిగా >>2

## వల్లభనేని రిమాండ్ పొడిగింపు

**విజయవాడ,మే6,ప్రభాతవార్తప్రతినిధి:** గన్నవరం టిడిపి కార్యాలయంపై దాడి కేసులో ఫిర్యాదు దారుడు సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్సీ నేత వల్లభనేని వంశీ రిమాండ్‌ను పొడిగిస్తూ విజయవాడ ఎస్సీ ఎస్టీ ప్రత్యేక కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసుకు సంబంధించి వంశీ రిమాండ్ ముగియడంతో ఈరోజు (మంగళవారం) ఉదయం జిల్లా జైలు నుంచి వంశీని ఎసిబి కోర్టుకు తీసుకొచ్చారు పోలీసులు. వంశీని కోర్టులో హాజరుపర్చారు. ఈ సందర్భంగా వంశీకి ఈనెల 13వ వరకు రిమాండ్‌ను న్యాయస్థానం పొడిగించింది. మరోవైపు వంశీకి కుటుంబసభ్యులతో మాట్లాడేందుకు ఎస్సీ, ఎస్టీ కేసుల ప్రత్యేక న్యాయస్థానం గంటపాటు అనుమతి ఇచ్చింది. తనకు శ్వాస సమస్య >>2

# 'గాలి' సోదరులకు ఏడేళ్ల జైలు

>> హైకోర్టు ఇదివరకే డిశ్చార్జి చేసింది. అయితే నాటి గనుల శాఖ డైరక్టర్ ఎ3 నిందితుడు రాజగోపాల్‌కు అవినీతి నిరోధక చట్టం కింద మరో నాలుగేళ్ల శిక్ష అదనంగా పడింది.

ఉమ్మడి ఏపిలో ఓబుళాపురం మైనింగ్ వ్యవహారం తీవ్ర సంచలనం రేపడం తెలిసిందే. ఏపిలోని అనంతపురంలో గనులను లీజుకు తీసుకుని మరోచోట అ క్రమంగా మైనింగ్ చేసినట్లు అభియోగాలు వచ్చాయి. 2007 జూన్ 18వ తేదీన ఓఎంసికి లీజులు కేటాయిస్తూ అప్పటి వైఎస్ సర్కారు ఆదేశాలు జారీ చేసింది. ఇందులో క్యాప్టివ్ అనే పదాన్ని తొలగించారంటూ వచ్చిన ఆరోపణలపై 2009 డిసెంబర్ ఏడవ తేదీన సిబిఐ కేసు నమోదు చేసింది. ఓబుళాపురం మైనింగ్ వ్య వహారంలో సిబిఐ అధికారులు ఐపిసి 120 (బి), రెడ్‌విత్ 420, 409, 468, 471లతో పాటు సెక్షన్ 13 (2), రెడ్‌విత్ 13 (1) డి కింద కేసులు నమోదు చేశారు. ఈ కేసును నాటి సిబిఐ జాయింట్ డైరక్టర్ వివి లక్ష్మీనారాయణ విచారించారు. ఆయన నేతృత్వంలోని సిబిఐ బృందం హైదరాబాద్ నుంచి బళ్లారికి వెళ్లి రెండు రోజుల పాటు కాపుకాసి గాలి జనార్ధన్ రెడ్డి సహా ఇతర నిందితులను అరెస్టు చేయడం, వీరందరిని భారీ బందోబస్తు మధ్య రోడ్డు మార్గాన హైదరాబాద్‌కు తీసుకురావడం అప్పట్లో సంచలనం రేపింది. అనంతరం వీరిని చంచల్‌గూడ జైల్లో నిర్బంధించారు. చంచల్‌గూడ జైల్లో గాలి జనార్ధన్ రెడ్డి సహా ఇతర నింది తులు ఏడాదిన్నరకు పైగా వున్నారు. కాగా ఇదే కేసులో గాలి జనార్ధన్ రెడ్డికి నాటి సిబిఐ కోర్టు న్యాయమూర్తి పట్టాభి రామారావు అక్రమంగా బెయిల్ ఇచ్చినందుకు అరెస్టయి జైలు పాలవడం మరో సంచలనం రేపింది.. ఈ కేసులో పట్టాభి రామారావుకు గాలి జనార్ధన్ రెడ్డి వంద కోట్ల రూపాయల లంచం ఇచ్చినట్లు అభియోగాలు వచ్చాయి. ఇలా ఓబుళాపురం కేసులో మొదటి నుంచి అన్ని అంశాలు సంచలనం రేపాయి. ఈ కేసులో తెలంగాణ హైకోర్టులో స్టే రావడం, డివిజన్ బెంచ్ దీనిని ఎత్తేయడం, పలురకాల పిటిషన్ల కారణంగా దాదాపు 15 ఏళ్ల పాట విచారణ సాగింది. ఈ క్రమంలోనే కేసు విచారణ కు ఐదేళ్ల సమయం పట్టింది. 2009 నుంచి 2014 వరకు ఓబుళాపురం మైనింగ్ కేసులో సిబిఐ నాలుగు ఛార్జిషీట్లను దాఖలు చేసింది. ఇందులో 2011లో మొదటి చార్జిషీట్ దాఖలు చేయగా 2014లో చివరి ఛార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో 219 మంది సాక్షులను విచారిం చగా ప్రత్యక్షంగా పరోక్షంగా పలు సాక్ష్యాలు, ఆధారాలను సిబిఐ సేకరించి కోర్టుకు సమర్పించింది. ఓబుళాపురం గనుల కేటాయింపు, తవ్వకాలకు సంబం ధించి అత్యాధునిక పరికరాలతో సిబిఐ ఆధారాలను సేకరించింది. అక్రమ ంగా తవ్వకాలు చేయడం, రవాణా, ఎగుమతులు, విక్రయాలలో భారీగా అవకతవ కలు జరిగినట్లు సిబిఐ గుర్తించింది. ఏపి, కర్నాటకలో పెద్ద ఎత్తున అక్రమంగా ఇనుప ఖనిజం తవ్వకాలు చేసినట్లు సిబిఐ గుర్తించింది. ఓబుళాపురం గనుల నుంచి విదేశాలకు అక్రమంగా 60 మెట్రిక్ టన్నుల ఇనుప ఖనిజం ఎగుమతి అయి నట్లు సిబిఐ గుర్తించింది, ఇదంతా అక్రమ, బినామీ లావాదేవీల వల్ల జరిగాయని సిబిఐ విచారణలో తేలింది. ఈ కేసు విచారణలో భాగంగా 3337 డాక్యుమెం ట్లను సిబిఐ అధికారులు పరిశీలించారు. ఓబుళాపురం గనుల తవ్వకాలలో సర్కారు కేటాయించిన 68 హెక్టార్లలో కాకుండా ఇతరచోట్ల భారీగా అక్రమంగా మైని ంగ్ చేసినట్లు సిబిఐ గుర్తించింది. దీని ద్వారా ప్రభుత్వ ఖజానాకు 844 కోట్ల రూపాయల నష్టం వాటిల్లిందని పేర్కొన్న సిబిఐ ఇదే అంశాన్ని ఛార్జిషీట్‌లో పొందుపరిచింది. ఈ కేసు విచారణలో భాగంగా 219 సాక్షులను న్యాయస్థానం ఎదుట సిబిఐ హాజరు పరిచి వారి వాంగ్మూలాన్ని కోర్టులో పొందు పరిచింది. దీని ఆధారంగా చాలా విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ కేసులో నాటి గనుల శాఖ మంత్రిగా వున్న సబిత ఇంద్రారెడ్డి మినహా మిగతా నిందితులంతా అరెస్ట యి జైలుకు వెళ్లారు. ఈ కేసులో తన పాత్ర లేదని సబిత ఇంద్రారెడ్డి డిశ్చార్జి పిటిషన్ వేసినా కోర్టు దానిని పరిగణలోకి తీసుకోలేదు. ఈ కేసు విచారణ సుదీర్ఘ ంగా సాగింది. దీనిపై మంగళవారం తుది తీర్పు రానుందని ముందుగానే తెలియడంతో నాంపల్లి కోర్టుల ప్రాంగణం వద్ద భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. తీర్పు నేపథ్యంలో గాలి జనార్ధన్ రెడ్డి, సబిత రెడ్డి సహా పలువురు కోర్టుకు హాజరయ్యారు. చివరకు దీనిపై సిబిఐ కోర్టు తుది తీర్పులో ఎ1 గా వున్న గా లి శ్రీనివాస్ రెడ్డి, ఎ2గా వున్న గాలి జనార్ధన్ రెడ్డి, ఎ3గా వున్న విడి రాజగోపాల్, ఎ4గా వున్న ఓబుళాపురం మైనింగ్ కంపెనీకి, ఎ7గా వున్న అలీ ఖాన్‌తో పాటు ఓఎంసి కంపెనీకి సిబిఐ కోర్టు ఏడేళ్ల శిక్షను. పది వేల రూపాయల జరిమానాను విధించింది. కోర్టు తీర్పు వెలు వరించే సమయంలో కోర్టు హాల్‌లోనే వు న్న గాలి జనార్ధన్ రెడ్డి తనకు శిక్షను తగ్గించాలని వేడు కున్నారు. తాను ఇప్పటికే నాలుగేళ్ల పాటు జైల్లో వున్నానని, ప్రస్తుతం ఎంఎల్‌ఎగా వున్నానని, ప్రజా జీవితంలో వుండాల్సి వుండడంతో శిక్షను తగ్గించాలని కోరగా దీనికి న్యాయమూర్తి మండిపడ్డారు. మీరు యావజ్జీవ శిక్షకు అర్హులని తెలిపారు. మీకు పదేళ శిక్ష ఎందుకు విధించ కూడదని ప్రశ్నించారు. ఇదే కేసులో ఆరోపణలు ఎదుర్కొన్న నాటి గనుల శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఐఎఎస్ అధికారి కృపానందంల ను సిబిఐ కోర్టు నిర్దోషులుగా ప్రకటించింది. వీరిద్దరిపై ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లేవని కోర్టు పేర్కొంది. కాగా ఈ కేసులో నాటి గనుల శాఖ డైరక్టర్ విడి రాజగోపాల్‌కు అదనంగా మరో నాలుగేళ్ల జైలు శిక్షను సిబిఐ కోర్టు విధించింది. అప్పట్లో ఆయన భూగర్భ గనుల శాఖ డైరక్టర్‌గా వున్న ందున అవినీతి నిరోధక చట్టం కింద ఆయనకు అదనపు శిక్షను కోర్టు విధించింది. ప్రభుత్వ అధికారిగా వుంటే అక్రమాలకు పాల్పడినందుకు రాజగోపాల్‌కు మొ త్తం మీద 11 ఏళ్ల జైలు శిక్ష పడింది.

## భారీ వర్షాలు

>> శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్య సాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో తేలికపాటి వర్షాలకు అవకాశముందని చెప్పింది.

మరోవైపు సోమవారం నంద్యాల జిల్లా పసుపులలో 42.5,వైఎస్సార్ జిల్లా జమ్మల మడుగులో 42.4, పల్నాడు జిల్లా రావి పాడులో 42.1 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని వెల్లడించింది.

## ధనుంజయ్

>> నుంచి రక్షణ కల్పించేందుకు సుప్రీం కోర్టు నిరాకరించింది. ఏపి హైకోర్టులోనే ఈ కేసును చేర్చుకోవాలని స్పష్టం చేసింది. ఏపి హైకోర్టులో ఈ కేసుకు సంబంధించి తమకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డితో పాటు గోవిందప్ప పిటిషన్ దాఖలు చేశారు. ఈ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై కౌంటర్ వేసేందుకు సమయం కావాలని ప్రభుత్వం తరపు న్యాయవాది రెండు రోజుల క్రితం కోరారు.

అప్పటి వరకు కూడా అరెస్ట్ నుంచి రక్షణ కల్పించాలని ఈ ముగ్గురు హైకోర్టును అభ్య ర్థించారు. కానీ హైకోర్టు అందుకు నిరాకరించింది. దీంతో ముగ్గురు సుప్రీం కోర్టును ఆశ్రయించగా.. అక్కడ కూడా వీరికి నిరాశే ఎదురైంది. అరెస్ట్ నుంచి రక్షణ కల్పించేందుకు నిరాకరించడంతో పాటు ఈ కేసులో జోక్యం చేసుకుంద కూడా నిరాకరించింది సుప్రీం ధర్మాసనం. దీంతో ఈ ముగ్గురు పేర్లను ఈ కేసులో చేర్చుతూ సిట్ మెమో దాఖలు చేసింది. ఈ మెమోను కోర్టు పరిగణలోకి తీసుకోవాల్సి ఉంది. కోర్టు ఈ మెమోను పరిగణలోకి తీసుకుంటే ఈ ముగ్గురిని ఏపీ లిక్కర్ స్కాంలో నిందితులుగా చేర్చినట్టు అవుతుంది.

## రాష్ట్ర పండుగగా సత్యసాయి శతజయంతి



**శ్రీసత్యసాయి జిల్లా, మే 6, ప్రభాతవార్త ప్రతినిధి:** భగాన్ సత్యసాయి శతజయంతి ఉత్సవా లను రాష్ట్ర పండుగగా జరుపుకుందామని ప్రిన్సిపల్ సెక్రెటరీ ముఖేష్‌కుమార్ మీనా మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ యేడాది నవంబర్ 23న సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలను రాష్ట్ర పండుగగా జరుపుకోవడానికి అధికారులందరూ తగిన ఏర్పాట్లు పూర్తిచేయాలనిఆదేశించారు. శ్రీసత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ ఈ జయంతి ఉత్సవా లను అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని ఇప్పటి నుండే సన్నాహాలు చేస్తోందన్నారు. ఈ జయంతిఉత్సవాలకు దాదాపు 11 లక్షల మంది భక్తులు, పర్యాటకులు విచ్చేయను న్నట్లు సమాచారం.

# 'గాలి'ని వెంటాడిన ఓబుళాపురం మైనింగ్ కేసు

### ఎమ్మెల్యేగా గెలిచినా ఫలించని ఎత్తులు

### కెఆర్‌సిపిని బిజెపిలో విలీనం చేసిన జనార్ధన్ రెడ్డి

**అనంతపురం, మే 6 ప్రభాతవార్త బ్యూరో :** అనంతపురం జిల్లా డి హీరేహాల్ మండలంలో ఓబుళాపురం మైనింగ్ గనులను దోచుకున్నాడన్న కారణంతో ఓబుళాపురం మైనింగ్ అధినేత, గంగావతి శాసనసభ్యుడు గాలి జనార్ధన్‌రెడ్డికి ఏడేళ్లపాటు నాంపల్లి సిబిఐ స్పెషల్ కోర్టు శిక్ష విధించడం చర్చనీయాంశంగా మారింది. ఓబుళాపురం మైనింగ్ కేసులో డివి.శ్రీనివాసరెడ్డి, గాలి జనార్ధన్‌రెడ్డి, మైనింగ్ శాఖ రిటైర్డ్ అధికారి రాజగోపాల్, పిఏ అలీ, లింగారెడ్డి (చనిపోయాడు)లపై సిబిఐ కోర్టు ఏడేళ్లపాటు శిక్ష విధిస్తూ తెలంగాణ మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఐఎఎస్ అధికారి కృపానందన్‌లను నిర్దోషులుగా ప్రకటిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. 2011 సెప్టెంబర్ 5వ తేదిన ఓబుళాపురం మైనింగ్ కేసులో సిబిఐ అధికారులు గాలి జనార్ధన్‌రెడ్డిని బళ్లారిలో అరెస్టు చేశారు. ఈ కేసులో మూడున్నరేళ్లు పాటు హైదరాబాద్‌లోని చెర్లపల్లి జైలులో గాలి జనార్ధన్‌రెడ్డి శిక్ష అనుభవించారు. 2015 జనవరిలో సుప్రీం కోర్టు గాలి జనార్ధన్‌రెడ్డికి బెయిల్ ఇచ్చింది. ఆ బెయిల్‌లో షరతులు విధించింది. బళ్లారి, అనంతపురం, వైఎస్‌ఆర్ కడప జిల్లాలకు వెళ్లరాదని అప్పట్లో గాలి జనార్ధన్‌రెడ్డికి సుప్రీం కోర్టు ఆంక్షలు విధించింది. ఒక ఏడాది క్రితం ఆ మూడు జిల్లాలకు కూడా గాలి జనార్ధన్‌రెడ్డి వెళ్లేందుకు అనుమతిచ్చింది. దాదాపు 15 ఏళ్లుగా నాంపల్లిలోని సిబిఐ స్పెషల్ కోర్టు ఈ కేసును విచారించింది. ఎట్టకేలకు మంగళవారం సిబిఐ స్పెషల్ కోర్టు మాజీ మంత్రి ఓబుళాపురం గనుల అధినేత గాలి జనార్ధన్‌రెడ్డి తదితరులపై శిక్ష విధిస్తూ నిర్ణయం తీసుకోవడం హాట్ టాపిక్‌గా మారింది.

**ఫలించని గాలి రాజకీయ ఎత్తులు :**

కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా చుట్టు పక్కల జిల్లాల్లో ఒక హవా కొనసాగించిన గాలి జనార్ధన్‌రెడ్డిని రాజకీయంగా ప్రయత్నాలు ముందుకు సాగలేదు. సుష్మస్వరాజ్ కేంద్ర మంత్రిగాఉన్నప్పుడు బళ్లారి చుట్టుపక్కల జిల్లాల్లో గాలి జనార్ధన్‌రెడ్డి హవా కొనసాగింది. ఓబుళాపురం గనులను అడ్డం పెట్టుకుని ఆర్థికంగా లబ్ది పొందడంతోపాటు రాజకీయంగా కూడా ముందుకు అడుగులు వేశారు. అప్పట్లో ఒకవైపు కర్ణాటకలో బిజెపి అండదండలు కొనసాగాయి. అదే సమయంలో రాష్ట్రంలో దివంగత నేత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి సిఎంగా ఉన్నపుపడు ఆయన అండదండలు కూడా పుష్కలంగా గాలి జనార్ధన్‌రెడ్డికి లభించాయని బలంగా ఆరోపణలు వినిపించాయి. ఈ నేపథ్యంలో ఓబుళాపురం గనుల కేసు నడుస్తూ వచ్చింది. ఓబుళాపురం గనుల విషయంలో టిడిపి రాష్ట్ర నాయకులు కూడా గట్టి పోరాటాలే చేశారు. టిడిపి తరపున ఎమ్మెల్యేల బృందమే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్నప్పుడు ఓబుళాపురం గనులను పరిశీలించేందుకు వచ్చారంటే అప్పట్లో పరిస్థితి ఎలా ఉండేదో అర్థం చేసుకోవచ్చు. బళ్లారి జిల్లా రాజకీయాల్లో తనదైన శైలిలో గాలి జనార్ధన్‌రెడ్డి చక్రం తిప్పిన చరిత్ర ఉంది. బళ్లారి బిజెపి కీలక నేత శ్రీరాములు ఒకప్పుడు గాలి జనార్ధన్‌రెడ్డికి కొండంత అండగా నిలబడుతూ వచ్చారు. అయితే బళ్లారి జిల్లా రాజకీయాలు మారుతూ వచ్చాయి, మిత్రులు శత్రువులు అయ్యారు. గాలి జనార్ధన్‌రెడ్డి శ్రీరాములు మధ్య విభేదాలు రేగాయి, మూడేళ్ల క్రిందట ఓబుళాపురం గనుల కేసులో బెయిల్ మీద ఉన్న గాలి జనార్ధన్‌రెడ్డి కళ్యాణ రాజ్య ప్రగతి ప్రకాశ (కెఆర్‌పిపి) అనే కొత్త పార్టీని ఏర్పాటు చేశారు. ఆ పార్టీ తరపున 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బళ్లారి, కొప్పలు తదితర జిల్లాల్లో అభ్యర్థులను బరిలో దింపారు. బళ్లారి సిటీ నియోజకవర్గం నుంచి గాలి జనార్ధన్ నుంచి లక్ష్మి అరుణను బరిలో దింపగా, కొప్పల జిల్లా గంగావతి నుంచి గాలి జనార్ధన్‌రెడ్డి బరిలో దిగారు. ఆ ఎన్నికల్లో గాలి జనార్ధన్‌రెడ్డి సోదరులు బిజెపి తరుపున పోటీ చేశారు. కొప్పల్ జిల్లా గంగావతి నుంచి కెఆర్‌పిపి తరుపున గాలి జనార్ధన్‌రెడ్డి ఒక్కరే గెలిచి అసెంబ్లీలో అడుగు పెట్టారు. ఆ ఎన్నికల్లో గాలి తప్ప కెఆర్‌పిపి అభ్యర్థులు ఎవరూ గెలవలేదు. ఆ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం, ఎన్నికలు జరిగిన ఆరు నెలలకే కెఆర్‌పిపిని బిజెపిలోకి విలీనం చేయడం జరిగిపోయింది. ఈ నేపథ్యంలో రాజకీయంగా ఏదో ప్రయత్నం చేయాలని ఎమ్మెల్యే గాలి జనార్ధన్‌రెడ్డి చేసిన ప్రయత్నాలు కూడా ఫలించ లేదనిచెప్పవచ్చు.

## మాజీ ఎంపీ పాలకొండ రాయుడు మృతి



**కడప బ్యూరో మే 6 ప్రభాతవార్త:** రాజంపేట మాజీ శాసనసభ్యులు సుగవాసి పాలకొండ రాయుడు (80) మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారు. అనారోగ్యం కారణంగా బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఉదయం ఐదు గంటలకు తుది శ్వాస విడిచారు. 1978లో రాయచోటి అసెంబ్లీ స్థానం నుంచి జనతా పార్టీ టిక్కెట్‌పై ఎమ్మెల్యేగా గెలుపొందారు 1983లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాయచోటి నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించి రికార్డు సృష్టించారు.1984లో రాయచోటి లోకసభ స్థానం నుంచి పోటీ చేసి ఎంపీగా విజయం సాధించారు 1999, 2004 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచారు మొదటి నుంచి టిడిపిలోనే కొనసాగుతూ వచ్చారు రాయచోటి రాజకీయాల్లో పాలకొండ రాయుడుకు ప్రత్యేక స్థానం. ఈయన 1946లో రాయచోటిలోని మాసాపేటలో జన్మించారు. ఈయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు సుగవాసి బాలసుబ్రమణ్యం కడప ఇన్చార్జ్ జడ్పీ ఛైర్మన్‌గా పని చేశారు, చిన్న కుమారుడు ప్రసాద్ బాబు టిటిడి బోర్డు సభ్యుడిగా పని చేశారు. ఈయన మృతి చెందడంతో రాయచోటి టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు. గురువారం పాలకొండ రాయుడు అంత్యక్రియలు రాయచోటిలో నిర్వహిస్తారని కుటుంబ సభ్యులు తెలిపారు.

## ఉద్యోగాల భర్తీ

>> వ్యక్తులకు భూకేటాయింపుల విషయంలో ఆచితూచి వ్యవహరించాలని స్పష్టం చేశారు. శ్రీశైలంలో వసతి గృహాలు ప్రభుత్వమే నిర్మించేలా చూడాలని చెప్పారు.

**ఏడాదికి రూ.1,300 కోట్లకు పైగా ఆదాయం**

రాష్ట్రంలో మొత్తం నోటిఫైడ్ ఆలయాలకు ఏడాదికి రూ.1,300 కోట్లకుపైగా ఆదాయం వస్తోంది. అందులో రూ.850 కోట్లు టాప్ 7 ఆలయాల నుంచి సమకూరుతోంది. రూ.5 లక్షలు కన్నా ఎక్కువ ఆదాయం వచ్చే ఆలయాల నుంచి 9 శాతం మొత్తాన్ని కామన్ గుడ్ ఫండ్ (సీజీఎఫ్) కింద జమచేస్తున్నారు. 2024-25లో సిజిఎఫ్‌కు రూ.149 కోట్లు రాగా... రాష్ట్రంలో వివిధ ఆలయాల్లో రూ.111 కోట్లతో 48 పనులు జరుగుతున్నాయి. మొత్తం నోటిఫైడ్ ఆలయాలు 25,028 కాగా, వీటిలో ప్రస్తుతం రూ.50 లక్షల పైన ఆదాయం వచ్చే 6ఏ కేటగిరి ఆలయాలు 169, రూ.15 లక్షల నుంచి రూ.50 లక్షలు వరకు ఆదాయం ఆర్జిస్తున్న 6బీ కేటగిరీ ఆలయాలు321, రూ.15 లక్షలు కన్నా తక్కువ ఆదాయం వచ్చే 6సీ కేటగిరీ ఆలయాలు24,538 ఉన్నాయి. దేవాదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఈ సమీక్షలో పాల్గొన్నారు.

## పొడిగింపు

>> తీవ్రంగా ఉందని ఈ సందర్భంగా వంశీకి కోర్టుకు తెలియజేశారు ఈ కేసులో వంశీతో పాటు మరో ఐదుగురు నిందితులకు నేటితో రిమాండ్ గడువు ముగియనుంది. దీంతో వారందరినీ విజయవాడ ప్రత్యేక కోర్టులో హాజరుపర్చారు. విచారణ జరిపిన న్యాయస్థానం రిమాండ్ పొడి గిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ప్రస్తుతం నిందితు లంతా విజయవాడ జిల్లా జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో కీలక నిందితులు వంశీతో పాటు వెలినేని శివరామకృష్ణ ప్రసాద్, గంటా వీర్రాజు, నిమ్మ చల పతి, వేల్పూరు వంశీబాబు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

కిడ్నాప్‌కు సంబంధించి ఇప్పటికే వంశీని కస్టడీలోకి తీసుకున్న పోలీసులు కీలక సమాచారాన్ని రాబట్టినట్లు తెలుస్తోంది. అయితే ఈకేసులో మరికొంత మంది నిందితులు పరారీలో ఉన్నారు. వారి పట్టుకునేందుకు ప్రత్యేక బృందాల గాలింపుచర్యలు కొనసాగుతున్నాయి. సత్యవర్ధన్‌ను ఎందుకు కిడ్నాప్ చేశారు, ఎవరి ఆదేశాల మేరకు చేశారనే విషయాన్ని రాబట్టాల్సి ఉంది. మధ్యవర్తు లుగా కొంతమంది కీలకంగా వ్యవహరించినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో వారిని కూడా పట్టు కోవాల్సి ఉంది. వారిని పట్టుకు నేందుకు పోలీసుల ప్రయత్నాలు చేస్తున్నారు.

## అనుమతివ్వండి

>> ప్రాజెక్టుని ఆయన సందర్శించారన్నారు. అంతేకాకుండా పనుల షెడ్యూల్‌ని నిర్ణయించి ప్రతి 15 రోజులకు ఓసారి సచివాలయంలో సమీక్షిస్తు న్నారన్నారు. అందువల్లనే పోలవరం ప్రాజెక్టు పనులు పరుగులు పెడుతున్నాయని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి, పోలవరం ప్రాజెక్ట్ పైనే ఆధారపడి ఉందన్న అంశాన్ని మంత్రి వారికి విశదీకరించారు. ఇప్పటికే గ్యాప్2 లో డి వాల్ నిర్మాణం పనులు, ఎగువకాఫర్ డ్యామ్‌బలోపేతం చేయడానికి వీలుగా నిర్మిస్తున్న బట్రస్ డ్యామ్ పనులు వేగంగా జరుగు తున్నాయన్నారు.

గ్యాప్ 1,గ్యాప్ 2,తో పాటు మిగిలిన పనులకు సంబందించిన డిజైన్స్‌కు, త్వరితగతిన అనుమతులుఇస్తే,అనుకున్న సమయా నికి ప్రాజెక్ట్ పనులు పూర్తి చేయగలుగుతాం అని నిపుణులను మంత్రి నిమ్మల కోరారు. ప్యానల్ ఆఫ్ ఎక్స్పర్ట్స్ కమిటీ, సిడబ్ల్యూసి, పిపిఏ, ఆఫ్రి, మరియు ఏజెన్సీ లు సమన్వయం తో పని చేస్తూ లక్ష్యానికి ముందే పోలవరం ప్రాజెక్ట్ పూర్తి చేయాలని మంత్రి రామానాయుడు అన్నారు.





మంగళవారం శ్రీనగర్‌లోని డాల్ లేక్‌లో మాక్ డ్రిల్ నిర్వహించిన ఎస్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది

# నేడు మాక్ డ్రిల్

>> జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ సభ్యులు ఒకరు చెప్పారు. ఈ నేపథ్యంలో సరిదిద్దాల్సిన అంశాలను గుర్తించామని తెలిపారు. బుధవారం మాక్‌డ్రిల్స్ నిర్వహించే ప్రాంతాలను 3 కేటగిరీలుగా విభజించారు. మొదటి కేటగిరీలో దిల్లీ, ముంబయి, సూరత్, వడోదర, కక్రాపూర్, తారాపూర్, తాల్చేర్, కోట, రావత్, చెన్నై, కల్పక్కం, నరోరా జిల్లాలు ఉన్నాయి. రెండో జాబితాలో హైదరాబాద్, విశాఖపట్నం సహా 201 జిల్లాలు ఉన్నాయి. మూడో జాబితాలో 45 జిల్లాలు ఉన్నాయి. ఇక పాకిస్థాన్‌తో సరిహద్దు ఉన్న రాష్ట్రాలు గుజరాత్, పంజాబ్, హరియాణా, జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక సూచనలు జారీ చేసింది కేంద్ర ప్రభుత్వం. పాకిస్థాన్‌పై భారత్ ప్రతీకార దాడులు చేయవచ్చనే అంచనాలు నెలకొన్న తరుణంలో కేంద్ర హోంశాఖ రాష్ట్రాలకు కీలక ఆదేశాలు జారీ చేసింది. పాక్ కూడా ప్రతిదాడికి దిగితే అందుకు ముందుగానే రాష్ట్రాలను సిద్ధం చేస్తోంది. సమాచార మంత్రిత్వ శాఖ వివరాల ప్రకారం, ఎయిర్‌రెయిడ్ హెచ్చరిక సైరెన్ల గురించి, ప్రతికూల పరిస్థితుల్లో పౌరులకు వారిని వారు ఎలా కాపాడుకోవాలో ట్రైనింగ్ ఇవ్వడం, బంకర్లు ట్రెంచ్‌లను శుభ్రం చేసుకునే సన్నద్ధతపై మాక్ డ్రిల్స్ ఉంటాయి. అంతేకాకుండా క్రాష్ బ్లాకౌట్స్, కీలకమైన ప్లాంట్లు, ఇన్‌స్టాలేషన్ల వద్ద ముందస్తుగా శత్రువులకు దొరకకుండా జాగ్రత్త పడటం, అత్యవసర సమయంలో మనుషులను తరలించే ప్రణాళికలు గురించి ఈ డ్రిల్స్ ఉంటాయి. ఇప్పటికే పంజాబ్, హర్యానా, గుజరాత్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలు మాక్‌డ్రిల్స్‌కు కీలక ప్రదేశాలను ఎంపికచేసాయి. మహారాష్ట్ర ప్రభుత్వం అయితే 19 చోట్ల ఈడ్రిల్స్ ఏకకాలంలో నిర్వహించేందుకు నిర్ణయించింది. అలాగే సముద్రజలాలున్న ప్రాంతాల్లోకూడా ఈ మాక్‌డ్రిల్స్‌కు ఏర్పాట్లుజరిగాయి.

# అమరావతి నిర్మాణాలు

>> యని పురపాలకశాఖా మంత్రి పి,నారాయణ సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకుని వచ్చారు. అమరావతి కోర్ క్యాపిటల్ ఏరియాలో గజిటెడ్ నాన్ గజిటెడ్ ఉద్యోగుల నివాసానికై నాలుగు ప్యాకేజీల్లో టవర్ల నిర్మాణానానికై రూ.1,732.31 కోట్ల విలువైన పనుల టెండర్లకు సిఆర్‌డిఎ ఆమోదం తెల్పింది. తెలిపారు. ఈ సమావేశంలో రాజధాని అమరావతి అభివృద్ధి పనులకు సంబంధించిన పలు టెండర్లను ఆమోదించారు. 2014-19 మధ్య కాలంలో చేపట్టిన గజిటెడ్ అధికారుల టవర్ల నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు రూ.514.41 కోట్ల విలువైన టెండర్లకు, బాహ్య మౌలిక సదుపాయాల కల్పనకు రూ.194.73 కోట్ల విలువైన టెండర్లకు సిఆర్‌డిఎ సమావేశంలో ఆమోదం తెల్పడం జరిగిందన్నారు. నాన్ గజిటెడ్ ఉద్యోగుల నివాసానికై తొమ్మిది టవర్ల నిర్మాణానికై రూ.506.67 కోట్ల విలువైన టెండర్లకు మరియు మరో 12 టవర్ల నిర్మాణానికి, మౌలిక వసతుల కల్పనకు రూ.517.10 కోట్ల విలువైన టెండర్లకు ఈ సమావేశంలో ఆమోదం తెలిపింది.. 190లీటర్లసామర్థంగల వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ నిర్మాణానికి, ఐదేళ్ల పాటు ఆపరేషన్. నిర్వహణకై రూ.560.57 కోట్ల విలువైన టెండర్లకు మరియు ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణానికి రూ.494.86 కోట్ల విలువైన టెండర్లకు ఆమోదం తెలిందీ. జాతీయ రహదారికి అనుసంధానం అయ్యే ఇ3, ఇ13 మరియు ఇ15 రోడ్ల నిర్మాణానికై అవసరమైన టెండర్లను పిలిచేందుకు కూడా ఈ సమావేశంలో ఆమోదం తెలిపింది. ఇ3 సీడ్‌యాక్సిస్ రోడ్డులో 1.5 కి.మి. మేర ఎలివేటెడ్ రోడ్ల నిర్మాణానికి మరియు 4.10 కి.మి. ఇ13 రోడ్డును రూ.384.78 కోట్లుతో పొడిగించేందుకు 3.98 కి.మి. ఇ15 రోడ్డును రూ.70 కోట్లతో పొడిగించేందుకు ఆమోదం తెలిపింది.ఈ సమావేశంలో అనేక కీలకంశాలపై చంద్రబాబు విశ్లేషణాత్మకంగా ఆయా ప్రాజెక్టులపై మాట్లాడారు.ప్రతి అంశంలోను కార్యచరణతో ఉండాలని సూచించారు.

## 4 రాష్ట్రాల జలవనరుల మంత్రుల భేటీ నేడు!

### -వాయిదా కోరిన ఏపి

**విజయవాడ,మే 6,ప్రభాతవార్త ప్రతినిధి:** బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ అవార్డు నోటిఫై చేయడంతో పాటు అమలు చేయాలంటూ కర్ణాటక ప్రభుత్వ అభ్యర్ధనపై భాగస్వామ్య రాష్ట్రాల జలవనరుల మంత్రులతో కేంద్రం సమావేశాన్ని ఏర్పాటు చేసింది. కేంద్ర జల్‌శక్తి మంత్రి పాటిల్ మే 7న సమావేశం ఏర్పాటు చేసి నాలుగు రాష్ట్రాల మంత్రులకు ఈ మేరకు ఆహ్వానం పంపారు. నాలుగు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాలు పంచుతూ బ్రిజేష్ ట్రిబ్యునల్ తన తుది నిర్ణయాన్ని 2013 నవంబరులో వెలువరించింది. ఈ నిర్ణయంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్‌ను దాఖలు చేసి అమలుపై స్టే పొందింది. రాష్ట్ర విభజన తర్వాత రెండు తెలుగు రాష్ట్రాల మధ్య నీటి పంపకాలకు సంబంధించి బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌కే అందను అంశాలుఅప్పగించి పరిష్కరించాలని కేంద్రం నోటిఫికేషన్ ఇచ్చింది. తెలుగు రాష్ట్రాలమధ్య పంపకాల అంశం ఎలాగూ ట్రిబ్యునల్ పరిధిలో ఉన్నందున బ్రిజేష్ ట్రిబ్యునల్ అవార్డుపై నోటిఫికేషన్ ఇవ్వాలని కేంద్రానికి కర్ణాటక విన్నవించింది. ఈ విన్నపంపై తాజా సమావేశం ఏర్పాటయ్యింది. భేటీని రెండు వారాల పాటు వాయిదా వేయాలని ఆంధ్రప్రదేశ్ కోరింది.

## వారం - వర్జ్యం

తేది : 07-05-2025, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
వైశాఖ మాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, శుక్ల పక్షం
దశమి ఉ.10.21
పూర్వఫల్గుణి సా.6.19
వర్జ్యం రా.2.22-తె.4.09
దు.ఉ.11.40-మ.12.31
శుభసమయం:ఉ.9.15-9.50
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం :** విలువైన విషయాలు తెలుసు కుంటారు. మీలోని ప్రతిభాపాటవాలు వెలుగులోకి వస్తుంది. వాహనసౌఖ్యం.

**వృషభం :** వ్యవహారాలలో విజయం సాధిస్తారు. దూరప్రాంతాల నుండి విలువైన సమాచారం అందుకుంటారు.

**మిథునం:** బంధువుల నుండి శుభవార్తలు అందుకుంటారు. వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. వస్తు సేకరణ.

**కర్కాటకం:** ఉద్యోగాలలో మరింత ఉత్సాహంగా సాగుతారు. సన్నిహితులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించు కుంటారు.

**సింహం:** ఆర్థిక లావాదేవీలు నిరుత్సాహ పరుస్తాయి. పనులలో జాప్యం జరిగినా విదానంగా పూర్తి చేస్తారు.

**కన్య :** ఆకస్మిక ప్రయాణాలలో తొందరపాటు వద్దు. వృత్తి, వ్యాపారాలలో చికాకులు ఎదురైన అధిగమిస్తారు.

**తుల :** ఉద్యోగాలలో కొద్దిపాటి చికాకులు ఎదురైన అధిగమించి ముందుకు సాగుతారు. ఆలయ దర్శనాలు.

**వృశ్చికం:** ప్రయాణాలలో మార్పులు వుంటాయి. ముఖ్యమైన పనులలో జాప్యం జరిగినా నిదానంగా పూర్తి చేస్తారు.

**ధనుస్సు:** సోదరులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. ఆరోగ్యంపట్ల మెలుకువ అవసరం.

**మకరం:** గృహ నిర్మాణ ఆలోచనలు నిదానంగా కార్యరూపం దాలుస్తాయి. వృత్తివ్యాపారాలలో స్వల్ప లాభాలు.

**కుంభం:** ఉద్యోగాలలో ఒత్తిడులు పెరిగినా అధిగమిస్తారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది.

**మీనం :** కొత్త పనులకు శ్రీకారం చుట్టి సకాలంలో పూర్తి చేస్తారు. విందు, వినోదాలలో పాల్గొంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



మంగళవారం ముర్షిదాబాద్ ప్రాంతంలో బాధితులను పరామర్శిస్తున్న బెంగాల్ సిఎం మమతా బెనర్జీ

# అమరావతిలో ఇప్పటి వరకూ 71 సంస్థలకు 1,050 ఎకరాలు కేటాయింపు

### - పురపాలకశాఖా మంత్రి పి.నారాయణ

**విజయవాడ,మే6,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర రాజదాని అమరావతి కోర్ క్యాపిటల్ ఏరియాలో పలు సంస్థలకు భూముల కేటాయింపుకు సంబంధించి మంత్రుల బృందం సమావేశం నేడు జరిగిందని, ఈ సమావేశంలో ఏడు సంస్థలకు భూములను కేటాయించడం జరిగిందని మంత్రి తెలిపారు. ఆయన మంగళవారం సాయంత్రం మీడియాతో మాట్లాడుతూ మంత్రి వర్గ ఉపసంఘంలో తీసుకున్న నిర్ణయాలపై సీఆర్డీఏ సమావేశంలోను చర్చించామన్నారు. న్యాయ విశ్వ విద్యాలయాలనికి 55 ఎకరాలు, క్వాంటమ్ వేలీకి 50 ఎకరాలు, ఆదాయ పన్ను శాఖకు 0.78 ఎకరాలు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీకి 0.78 ఎకరాలు, కోస్టల్ బ్యాంక్ హెడ్ ఆఫీసుకి 0.40 ఎకరాలు మరియు ఐఆర్సిటిసి హోటల్స్ కి ఒక ఎకరం కేటాయించడం జరిగిందని మంత్రి తెలిపారు.

రూ.506.67 కోట్ల విలువైన టెండర్లకు మరియు మరో 12 టవర్ల నిర్మాణానికి, మోలిక వసతుల కల్పనకు రూ.517.10 కోట్ల విలువైన టెండర్లకు ఈ సమావేశంలో ఆమోదం తెల్పడం జరిగిందని మంత్రి తెలిపారు. 190 ఎంఎల్‌డి సామర్థంగల వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ నిర్మాణానికి, ఐదేళ్ల పాటు ఆపరేషన్ మరియు నిర్వహణకై రూ.560.57 కోట్ల విలువైన టెండర్లకు మరియు ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణానికి రూ.494.86 కోట్ల విలువైన టెండర్లకు ఆమోదం తెల్పడం జరిగిందన్నారు. జాతీయ రహదారికి అనుసంధానం అయ్యే ఇ3, ఇ13 మరియు ఇ15 రోడ్ల నిర్మాణానికై అవసరమైన టెండర్లను పిలిచేందుకు కూడా ఈ సమావేశంలో ఆమోదం తెల్పడం జరిగిందన్నారు. ఇ3 సీడ్ యాక్సిస్ రోడ్డులో 1.5 కి.మి. మేర ఎలివేటెడ్ రోడ్ల నిర్మాణానికి మరియు 4.10 కి.మి. ఇ13 రోడ్డును రూ.384.78 కోట్లుతో పొడిగించేందుకు మరియు 3.98 కి.మి. ఇ15 రోడ్డును రూ.70 కోట్లతో పొడిగించేందుకు ఆమోదం తెల్పడం జరిగిందన్నారు. బసవతారకం క్యాన్సర్ ఇన్స్టిట్యూకు గతంలో 15 ఎకరాలు ఇవ్వడం జరిగిందనీ, వైద్య కళాశాల నిర్మాణానికి ఇప్పుడు మరో 6 ఎకరాలను కేటాయించడం జరిగిందన్నారు. గతంలో 64 సంస్థలకు భూములను కేటాయించడం జరిగిందన్నారు. ఈ విధంగా ఇప్పటి వరకూ మొత్తం 71 సంస్థలకు 1,050 ఎకరాలను కేటాయించడం జరిగిందని మంత్రి తెలిపారు.

# ముంతాజ్ హోటల్‌కు మళ్లీ 20 ఎకరాల స్థలం కేటాయింపు !



- తిరుపతి నుండి శ్రీవారిమెట్టుకు ఉచిత రవాణా సౌకర్యం
- అలిపిరి వద్ద ఎపిఎస్‌పి చెక్‌పోస్టు ఏర్పాటు
- నేడు టిటిడి బోర్డు అత్యవసర సమావేశం

**తిరుమల,మే 6ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి అలిపిరి సమీపంలో గతంలో ముంతాజ్‌హోటల్‌కు పూర్వ టిటిడి ధర్మకర్తలమండలి కేటాయించిన స్థలాన్ని రద్దుచేసిన ప్రభుత్వం అందుకు ప్రత్యామ్నాయంగా మళ్ళీ ఆ హోటల్‌కు మరోచోట స్థలం కేటాయించేందుకు సిద్దమైంది. అలిపిరి-చెర్లోపల్లి మార్గంలో ప్రధాన రహదారికి అటువైపు ఉన్న 20 ఎకరాల స్థలాన్ని కేటాయించేందుకు రాష్ట్రప్రభుత్వం సుముఖత చూపుతోంది. ఈ నేపథ్యంలో చెర్లోపల్లి సమీపంలో ముంతాజ్‌హోటల్‌కు. పర్యాటకశాఖకు స్థలం కేటాయింపుపై ప్రధాన అజెండాగా టిటిడి ధర్మకర్తలమండలి నిర్ణయించింది. పవిత్రమైన ఏడుకొండలు ఆనుకుని శ్రీవేంకటేశ్వరస్వామి పాదాలచెంత తిరుపతి అలిపిరిలో ఎలాంటి వ్యాపారభవనాలుగానీ, నిర్మాణాలు గానీచేపట్టరాదని స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గతంలో ప్రకటించారు. అయితే ఆ సంస్థ ,పర్యాటకశాఖ ఆధ్వర్యంలో హోటల్ నిర్మాణాల వల్ల ఉపాధి అవకాశాలేగాక ఆదాయవనరులు లభిస్తాయి. దీంతో మళ్ళీ స్థలం కేటాయించేలా బుధవారం ఉదయం తిరుమలలో అత్యవసరంగా ధర్మకర్తలమండలి సమావేశంలో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి,సభ్యులు ఆమోదం తెలపనున్నారు. వేసవిసెలవుల్లో భక్తుల రద్దీని ,కాలినడకమార్గాల్లో అలిపిరి, శ్రీవారిమెట్టుమార్గంలో భక్తులు పెద్దసంఖ్యలో తిరుమలకు చేరుకుంటున్నందున ప్రైవేట్ ట్యాక్సీలు,ఆటోలు అదికధరల దోపిడీచేస్తున్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా భక్తులను తిరుపతి ఆర్టీసి బస్టాండు, రైల్వేస్టేషన్, విష్ణు నివాసం, శ్రీనివాసం వసతి సముదాయాల వద్ద నుండి ఉచితంగా చేర్చేందుకు ఉచిత ఎలక్ట్రికల్ బస్సులు 20 ఏర్పాటుచేయాలని ,ఇదీ పూర్తిగా దాతల సహకారం తీసుకోవాలని భావిస్తున్నారు. ఈ విషయంపై కూడా బోర్డులో చర్చించి ఆమోదించనున్నారు.ఇప్పటికే ఉచిత ధర్మరథాల బస్సులు నడుస్తున్నా భక్తుల రద్దీకి సరిపోవడం లేదు. ఇక ప్రపంచ ప్రసిద్దిగాంచిన హిందూ పుణ్యక్షేత్రం తిరుమల ఆలయం భద్రత, భక్తుల రక్షణ దృష్టిలో ఉంచుకుని కేంద్ర నిఘావర్గాల హెచ్చరికలు, ఆదేశాలతో తిరుమలపై నిఘా మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు. ఇందుకు అలిపిరి సప్తగిరి తనిఖీ కేంద్రంలో అత్యాధునిక పరికరాలు తీసుకురావడంతోబాటు అలిపిరి వద్ద ఏపిఎస్‌పి బెటాలియన్ ఆధ్వర్యంలో ప్రత్యేక చెక్‌పోస్టు ఏర్పాటుకు సుముఖత చూపుతున్నారు. టిటిడి విజిలెన్స్ విభాగంలో తీవ్రంగా కొరతగా ఉన్న సెక్యూరిటీ గార్డుల నియామకంపై, రానున్న ఆరునెలల కాలానికి మార్కెటింగ్ కొనుగోళ్ళు,లడ్డూలకు పర్యావరణ హిత ప్లాస్టిక్‌సంచులు తీసుకురావడం, తిరుమల ఘాట్‌రోడ్ల అభివృద్ధిలో భాగంగా మొదటిఘాట్‌రోడ్డులో మరమ్మతు పనులకు 10.75కోట్లరూపాయలుపైగా పనులు చేపట్టేందుకు టెండర్లు పిలిచే విషయంపై చర్చించనున్నారు. ఇంకా తిరుమల,తిరుమల ఘాట్‌రోడ్లపై సిసికెమెరాలు అమర్చేందుకు అవసరమైన వాటిని కొనుగోలు చేసే విషయంగా కూడా చర్చించనున్నారు. ఈనెల 8వతేదీ రాష్ట్రమంత్రివర్గ సమావేశం జరగనున్నందున టిటిడిలో కొన్ని నిర్ణయాలు తీసుకుని చర్చించి ఆమోదించి ఆ తరువాత ప్రభుత్వం ఆమోదానికి పంపాలని ప్రధాన ఉద్దేశ్యం. ఇప్పటికే మంగళవారం మధ్యాహ్నానికి అందుబాటులో ఉన్న టిటిడి ధర్మకర్తలమండలి సభ్యులకు ఆహ్వానాలు వెళ్ళాయి. సమావేశానికి ప్రత్యక్షంగా హాజరుకాలేని సభ్యులు వర్చువల్‌గా అందుబాటులో ఉండాలని కూడా పేర్కొన్నారు. నేటి ఉదయం 11గంటలకు తిరుమల అన్నమయ్యభవనంలో జరిగే టిటిడి బోర్డుసమావేశంలో అంశాలపై అందరూ నిర్ణయం తీసుకోనున్నారు.

# విద్యుత్‌షాక్‌తో ఇద్దరు యువకులు మృతి

- కళ్యాణ మండపంలో వివాహా వేడుకకు షామియానా వేస్తుండగా ఘటన..

**కౌతాళం, మే06, ప్రభాతవార్త:** కర్నూలు జిల్లా మండలంలోని ఉరుకుంద గ్రామంలో మంగళవారం ఇద్దరు యువకులు విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందిన విషాదకరమైన ఘటన చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం గ్రామంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో జరుగుతున్న పెళ్లి వేడుకకు షామియానా వేస్తుండగా విద్యుత్ తీగలు తగిలి ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతిచెందారు. మృతులను ఉరుకుంద గ్రామానికి చెందిన ఈరమ్మ, విజయ్ దంపతుల కుమారుడు సునీల్(30), నాగమ్మ కుమారుడు మహేంద్ర(22)గా గుర్తించారు. సునీల్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ప్రమాదం పట్ల మృతుల కుటుంబ సభ్యులు బోరున విలపించారు. కళ్యాణ మండపం వద్ద ఉన్న విద్యుత్ వైర్ల కారణంగానే ఈ దుర్ఘటన జరిగిందని బంధువులు ఆరోపిస్తున్నారు. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్న సునీల్ కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. విద్యుత్‌షాక్‌కు గురై ఇద్దరు యువకులు మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుని తండ్రి విజయకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నరసయ్యశెట్టి, విశ్వనాథశెట్టి, ఏఈ నరసన్న, లైన్‌మెన్ బద్రిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్‌కుమార్ విలేకరులకు తెలిపారు. ఈ విషయంపై ఆర్యవైశ్య సంఘం మేనేజ్‌మెంట్‌ను వివరణ కోరగా, ఉరుకుంద గ్రామానికి చెందిన వీరేష్ అనే వ్యక్తికి రెండు సంవత్సరాల లీజుకు ఇవ్వడం జరిగిందని, మేనేజ్‌మెంట్‌కు ఎటువంటి సంబంధం లేదని తెలిపారు. మేనేజ్‌మెంట్‌కు సంబంధించిన వ్యక్తి కూడా అనారోగ్య కారణాల వల్ల చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లో ఉన్నాడని, త్వరలోనే గ్రామానికి వస్తారని, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తారని చెప్పారు. బాధితా కుటుంబ సభ్యలకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నట్లు చెప్పారు.

# ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలి

- సొంతంగా ఉక్కు గనులు కేటాయించాలి
- దీక్ష చేపట్టిన పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల




**గాజువాక,మే 6,ప్రభాతవార్త** త్యాగాల ఫలంగా ఏర్పడ్డ విశాఖ ఉక్కును ప్రైవేటికరణనుంచి తప్పించాలని, సొంతంగా ఉక్కు గనులు కేటాయించి ఉక్కుకు పూర్వవైభవం తేవాలని కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలను ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేసారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చేస్తున్న దీక్షలు 1545 వ రోజుకి చేరుకుంది. మంగళవారం దీక్ష శిబిరాన్ని సందర్శించిన ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నాలుగు గంటల పాటు దీక్షలో పాల్గొని సంఘీభావం తెలిపారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు దీక్షను విరమించారు. ఈ సందర్భంగా షర్మిల మీడియాతో మాట్లాడుతూ ఎన్నో పోరాటాల ఫలితంగా ఏర్పడిన స్టీల్ ప్లాంట్ ను కార్పోరేట్ సంస్థలకు కట్టబెట్టాలనే ఉద్దేశ్యంతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రయివేటీకరణ అంశాన్ని తెరపైకి తెచ్చిందని ఆరోపించారు. ద్వంద్వ అర్థాలతో ప్రస్తుత పాలకులు ప్రకటనలు చేస్తూ కార్మికులను మోసం చేస్తున్నారని విమర్శిం చారు. ప్లాంట్ కు ప్యాకేజీ ప్రకటించామని చెబుతూనే మరోవైపు చేయాల్సి ందంతా చేస్తున్నారని మండిపడ్డారు. గత ఆరు నెలల కాలంలో పెద్ద సంఖ్యలో కాంట్రాక్టు కార్మికులను తొలగించారని,విఆర్ఎస్ పేరుతో చాలామందిని ఇంటికి పంపుతున్నారని ఆరోపించారు. ప్లాంట్ ను కాపాడి తీరుతానని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన చంద్రబాబు ఇప్పుడెందుకు మాట తప్పారని ప్రశ్నించారు. ప్రైవేటు స్టీల్ ప్లాంట్ లకు అనుమతిలిస్తున్న చంద్రబాబు విశాఖ ఉక్కును ఎందుకు కాపాడలేకపోతున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. నాడు స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి పూనుకున్న కాంగ్రెస్ పార్టీయే మళ్లీ ప్లాంట్ ను కాపాడుతుందన్నారు. ఈనెల 20 వ తేదీ లోపు తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని లేకుంటే 21 వ తేదీ నుండి ఇదే శిబిరంలో ఆమరణ దీక్ష చేస్తానని స్పష్టం చేసారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలు ఆదినారాయణ, అయోధ్యరామ్, నీరుకొండ రామచంద్రరావు, ఉక్కు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# మట్టిమిద్దె కూలి ఇద్దరు కూలీల మృతి

**ఉయ్యాలవాడ, మే 6, ప్రభాతవార్త:** నంద్యాల జిల్లా ఉయ్యాలవాడ మండల పరిధిలోని ఆర్ పాంపల్లె గ్రామంలో మంగళవారం ఉదయం 9 గంటల సమయంలో ఇద్దరు కూలీలు యోనా (45) నారాయణ (44) ఇద్దరు మృతిచెందినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ పాంపల్లె గ్రామానికి గంప తిరుపాల్ అనేవ్యక్తికి సంబబధించి మట్టిమిద్దెలో ఉన్న దంతెలు కుళ్లిపోవడంతో మార్చడానికి ఆళ్లగడ్డకు సంబందించినటువంటి ఎస్ లింగందిన్నెలో ఉన్న 7 మంది బేల్‌దారులు ఆర్ పాంపల్లెకు రావడం జరిగింది. అక్కడ ప్రమాదవశాత్తు దంతెలు మారుస్తుండగా మిద్దె మొత్తం కూలి ఇద్దరు కూలీలపై మట్టిమొత్తం పడి అక్కడికక్కడే చనిపోయారు. మిగతా ఐదుమంది సురక్షితంగా బయటికి చేరినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

# భక్తుల సౌకర్యార్థం శ్రీవారిమెట్టు మరింత అభివృద్ధి

## అదనపు కౌంటర్లతో దర్శన టోకెన్ల జారీ :టిటిడి ఇఒ జె.శ్యామలరావు



**చంద్రగిరి, మే 6 ప్రభాతవార్త:** భక్తుల సౌకర్యార్థం శ్రీవారిమెట్టు మార్గంలో మరింత అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు టిటిడి ఈఓ జె.శ్యామలరావు తెలిపారు. చంద్రగిరి మండలం, శ్రీనివాస మంగాపురం సమీపంలోని శ్రీవారిమెట్టు మార్గం తిరుమల శ్రీవారి దర్శనానికి అత్యంత చేరువైనది కావడంతో భక్తులు వేలాదిగా ఇక్కడికి చేరుకుంటున్నారు. అయితే ఇదే అదనుగా భావించిన ఆటో డ్రైవర్లు తిరుపతి రైల్వే స్టేషన్, బస్టాండ్ నుండి భక్తులను శ్రీవారిమెట్టు వద్దకు తరలించడంలో పెద్ద ఎత్తున మోసాలకు పాల్పడుతున్నట్లు సమాచారం అందుకున్న ఈఓ మంగళవారం అదనపు ఈఓ చిదంబరం వెంకయ్య చౌదరి, జెఈఓ వి.వీరబ్రహ్మంతో కలసి ఈ మార్గంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ముఖ్యంగా ఉచిత బస్సుల సేవల విషయంలో అధికార దుర్వినియోగంపై అవగాహన చేసుకున్నారు. అదేవిధంగా టోకెన్ల జారీ విషయంలో భక్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై గమనించి టోకెన్ల జారీ కొరకు కౌంటర్ల సంఖ్యను పెంచనున్నట్లు తెలిపారు. అదేవిధంగా భక్తుల రవాణాకు ఆటో డ్రైవర్ల మోసాలకు ఆయన శాశ్వతంగా చెక్ పెట్టేందుకు నిర్ణయించారు. ఇందు కోసం తిరుపతి నుండి ఉచిత బస్సుల సంఖ్యను పెంచనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఈ మార్గంలో అందుబాటులో గల సౌకర్యాలపై అధ్యయనం చేసి మరిన్ని మెరుగైన చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. శ్రీవారి భక్తులను అభిప్రాయ సేకరటన గావించి ఈ కార్యక్రమంలో సిఈ సత్యనారాయణ, ఎస్ఈలు వెంకటేశ్వర్లు, మనోహరం, డిప్యూటీ ఈఓ లోకనాథం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# సీనియర్ అకౌంటెంట్ పోస్టు నియామకానికి అర్హత గల అభ్యర్థుల నుండి దరఖాస్తులు

**విజయవాడ, మే6,ప్రభాతవార్తప్రతినిధి:** గుంటూరు లో గల ఆంధ్రప్రదేశ్ గొర్రెల, మేకల అభివృద్ధి సహకార సమాఖ్య లిమిటెడ్‌లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఒక సీనియర్ అకౌంటెంట్ పోస్టు నియామకానికి అర్హత గల అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుచున్నామని మేనేజింగ్ డైరెక్టర్ డా. పి. సత్య కుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంట్రాక్ట్ పద్ధతిలో సీనియర్ అకౌంటెంట్ పోస్టుకు అర్హత గల అభ్యర్థులు ఈ నెల 03052025 నుండి ఆన్ లైన్ ద్వారా ధరఖాస్తు చేసుకోవడానికి అనుమతించడమైనదన్నారు. ఈ నెల 13 వ తేదీ లోగా అభ్యర్థులు ఆన్ లైన్ ద్వారా ధరఖాస్తు చేసుకోవచ్చునని లేదా స్వయంగా ధరఖాస్తులను అందించే అభ్యర్థులు మే 13 వ తేదీ సాయంత్రం 4 గంటల లోగా తమ ధరఖాస్తులను మేనేజింగ్ డైరెక్టర్, ఆంధ్రప్రదేశ్ గొర్రెల మరియు మేకల అభివృద్ధి సహకార సమాఖ్య లిమిటెడ్, వెటరనరీ క్లినిక్ క్యాంపస్, కొత్త పేట, గుంటూరుకు అందజేయవచ్చునన్నారు. ఈ పోస్టుకు బీ కామ్ డిగ్రీ లేదా ఎం కామ్ పీజీ విద్యార్హత కలిగి ఉండాలని, వయస్సు 25 సంవత్సరాల నుండి 42 సంవత్సరాల లోపు కలిగి ఉండాలని, వయోపరిమితిలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 5 సంవత్సరాలు, బీసీ అభ్యర్థులకు 3 సంవత్సరాలు సడలింపు కలదన్నారు. ఈ పోస్టుకు రూ. 21,000 గా నెలకు జీతంగా అందించనున్నా రన్నారు. ఏదైనా సంస్థలో 2 లేదా 3 సంవత్సరాల పాటు పనిచేసిన అనుభవం ఉండాలని, ధరఖాస్తు రుసుం గా రూ. 50 చెల్లించాలన్నారు. పూర్తి వివరాలకు ఈ వెబ్ సైట్ ద్వారా గాని, మేనేజింగ్ డైరెక్టర్, ఆంధ్రప్రదేశ్ గొర్రెల మరియు మేకల అభివృద్ధి సహకార సమాఖ్య లిమిటెడ్, వెటరనరీ క్లినిక్ క్యాంపస్, కొత్త పేట, గుంటూరుకు 522001, గాని వారి కార్యాలయ పనివేళల్లో సంప్రదించవచ్చునన్నారు. ఈ ఫోన్ నెంబర్లకు 0863 2223356, 7288828773 కు ఫోన్ చేసి పూర్తి వివరాలు తెలుసుకోవచ్చును.

# అగ్రగామి జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- అభివృద్ధి సమీక్షా సమావేశంలో ఇంఛార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

**చిత్తూరు రూరల్, మే 6 ప్రభాతవార్త:** ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో చిత్తూరు జిల్లాను అగ్రగామి జిల్లాగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరు కంకణం కట్టుకుని విధులు నిర్వర్తించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో మంగళవారం జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్‌నాయుడు, డాక్టర్ కలికిరి మురళీమోహన్‌లు, జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, జిల్లా అటవీశాఖ అధికారి ధరణి తదితరులు హాజరయ్యారు. ఈ సమావేశంలో ఇన్‌ఛార్జ్ మంత్రి మాట్లాడుతూ జిల్లాలో భూగర్భ జలాల పెంపుకు ఉద్యమ స్థాయిలో చర్యలు చేపట్టాలని, జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దడానికి సిఎం నారా చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని, మామిడి రైతుల సమస్యలను పరిష్కరించడానికి చర్యలు చేపడుతున్నారని, మామిడి పంటకు గిట్టుబాటు ధర కల్పించేలా జిల్లా అధికార యంత్రాంగంతో కలిసి కృషి చేస్తున్నామన్నారు. ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు మాట్లాడుతూ నిరుపేద పిల్లలకు మానసిక వికాసం, పౌష్టికాహారం అందించడంలో అంగన్‌వాడీ కేంద్రాలు ప్రధాన పాత్ర పోషిస్తాయని, ఉపాధి, ఎంపి ల్యాడ్స్ నిధులతో అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌళిక వసతుల కల్పనపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. భూగర్భ జల మట్టం పెంపుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, వర్షాకాలం ప్రారంభానికి ముందే చెరువులు, సప్లయ్ ఛానళ్ళలో మరమ్మత్తులు, పూడిక తీసే పనులు చేపట్టి పూర్తి చేయాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖలో నేషనల్ హెల్త్ మిషన్ కింద విడుదలైన నిధులతో సకాలంలో ఖర్చు చేసి పనులు పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో జడ్పీ సిఇఓ రవికుమార్‌నాయుడు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధారాణి, డిసిహెచ్ఎస్ డాక్టర్ పద్మాంజలి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ విజయకుమార్, డ్వామా పిడి రవికుమార్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 2012లో రోగి మృతికి కారణమైన ఘటనపై మంత్రి సత్యకుమార్ ఆగ్రహం..

## వైద్యుల నిర్వాకంపై విచారణకు ఆదేశం

**విజయవాడ,మే6,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వ ఆసుపత్రిలో విధుల నిర్వహించాల్సిన సమయంలో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో సర్జరీ చేసి రోగి మృతికి కారణమైన ఇద్దరు ప్రభుత్వ వైద్యులపై సమగ్ర విచారణ చేపట్టాలని వైద్య,ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు. 2022లో జరిగిన ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన మంత్రి ఇద్దరు డాక్టర్లపై క్రమశిక్షణా చర్యల్ని చేపట్టాలని ఆదేశించారు. జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ డాక్టర్ ఎం.చక్రధర్. సివిల్ అసిస్టెంట్ సర్జన్ (అనస్థీషియా) డాక్టర్ ఎస్. రాకేష్ ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేయాల్సిన సమయంలో ప్రైవేట్ ఆసుపత్రిలో ఒక రోగికి శస్త్రచికిత్స చేశారు.

## రాయలసీమజిల్లాలకే విశిష్టం తిరుపతి గంగమ్మ జాతర

**తిరుపతి,మే 6ప్రభాతవార్తప్రతినిధి:** రాయలసీమ జిల్లాల్లోనే ఎంతో ప్రతిష్టాత్మకమైన తిరుపతి తాతయ్యగుంటగంగమ్మ జాతర వారంరోజుల వేడుకలు మంగళవారం అర్ధరాత్రి చాటింపుతో ఆరంభయయ్యాయి. దక్షిణభారతదేశంలోనే అమ్మవారి జాతరలు మూడురోజులు మాత్రమే జరుపుకోగా తిరుపతి తాతయ్యగుంటగంగమ్మ జాతర వేడుకలు వారంరోజులు నిర్వహిస్తారు. ఇప్పటికే రాష్ట్రపండుగగా గత వైసిపి ప్రభుత్వం ప్రకటించింది. జాతరవేడుకల్లో భాగంగా చాటింపుకు ముందు మంగళవారం ఉదయం ఆలయంప్రాంగణంలోని అమ్మవారి విశ్వరూప స్థూపానికి ఆలయ అర్చకులు మంత్రోచ్చరణలతో విశేష అభిషేకాలు జరిపించారు.ఒడిబాలు కట్టారు. అర్ధరాత్రి తిరుపతి రూరల్ శివార్లలోని అవిలాల గంగమ్మపుట్టింటి నుండి సారెను తీసుకువచ్చి చాటింపుతో జాతర సందడి మొదలైంది. వారంరోజులపాటు తిరుపతి వాసులు గ్రామపొలిమేరలు కూడా దాటరు. ఉదయం గంగమ్మకు ప్రారంభ అభిషేకం చేశారు. రాయలసీమజిల్లాలనుండేగాక తమిళ నాడు, కర్నాటక, నెల్లూరు జిల్లాల ప్రజలు కూడా భారీగా వస్తారు.


# లిక్కర్ స్కాం కేసు కస్టడీలో సిట్ అధికారులకు సహకరించని నిందితుడు రాజ్ కసిరెడ్డి

-విచారణలో పొంతనలేని సమాధానాలు

**విజయవాడ,మే6,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో సంచలనంగా మారిన లిక్కర్ స్కాం కేసులో సిట్ విచారణలో నిందితులు సిట్ అధికారులకు ఏ మాత్రం సహకరించడం లేదంటున్నారు..కస్టడీలో సిట్ అధికారులకు లిక్కర్ స్కాం కేసు నిందితులు రాజ్ కసిరెడ్డి,చాణక్య పొంతనలేని సమాధానాలు చెబుతున్నట్లుగా తెలుస్తోంది.గత నాలుగు రోజులుగా నిందితులను సిట్ అధికారులు విచారిస్తున్నారు.నెలకి ఒక సిమ్ కార్డు నిందితులు వినియోగించినట్లు సిట్ గుర్తించింది.సిమ్ కార్డులు ఎవరిచ్చారని అడగటంతో తాము కొత్త సిమ్‌లు వాడలేదని నిందితులు చెప్పారంటున్నారు..తాను ఐటీ అడ్వైజర్‌ను అని తనకు లిక్కర్ పాలసీతో సంబంధం లేదని రాజ్ కసిరెడ్డి సమాధానం ఇచ్చారంటున్నారు. ఇక ఎంపీ మిథున్‌రెడ్డి ఇతరులతో విజయసాయిరెడ్డి ఇంట్లో మీటింగ్ ఎందుకు ఎట్టారని సిట్ ప్రశ్నించగా...తామంతా పార్టీ నేతలం కాబట్టి పార్టీ ఎదుగుదల గురించి పార్టీ నేతలతో చర్చకు సమావేశమైనట్లు రాజ్ కసిరెడ్డి సమాధానం ఇచ్చారంటున్నారు..తనకు హైదరాబాద్‌లో టీ గ్రిల్స్ రెస్టారెంట్ ఉందని అక్కడికి రాజ్ కసిరెడ్డి వచ్చేవారని...అక్కడ తమకు పరిచయమని మరో నిందితుడు చాణక్య వివరించారంటున్నారు.రాజ్ కసిరెడ్డితో కేవలం పరిచయం మాత్రమే ఉందని,.ఎటువంటి లావాదేవీలు చేయలేదని చాణక్య చెప్పాడంటున్నారు..డిస్టలరీస్ నుండి వసూలు చేసిన ముడుపులు ఎవరికి ఇచ్చారని అడగ్గా,అసలు కేసుతో సంబంధం లేనప్పుడు...?డబ్బులు ఎక్కడికి,ఎవరికి ఇస్తారు అని సిట్ అధికారులకు రాజ్ కసిరెడ్డి చెప్పినట్లు సమాచారం. వైకాంగ్రెస్ ప్రభుత్వం మంచి లిక్కర్ పాలసీ తీసుకురావాలని భావిస్తున్నట్లు మాత్రమే తనకు తెలుసని...మిగతా విషయాలు తనకు తెలియదని సిట్ అధికారులకు రాజ్ కసిరెడ్డి.చెప్పారంటున్నారు.ఈ.కేసులో లోతుగా విషయాలపై ఆరా తీద్దామనుకున్న సిట్ అధికారులకు పూర్తి స్థాయి సమాచారం ఇవ్వకుండా నిందితులు ఇబ్బందులు పెడుతున్నారంటున్నారు.

# పర్యాటక రంగంలో 20శాతం వృద్ధి :మంత్రి కందుల దుర్గేష్

**విజయవాడ,మే6,ప్రభాతవార్తప్రతినిధి:** ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దిశానిర్దేశం మేరకు రాష్ట్ర పర్యాటక రంగంలో 20 వృద్ధి సాధించేందుకు అహర్నిశలు శ్రమిస్తామని మంత్రి కందుల దుర్గేష్ మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు.సీఎం అధ్యక్షతన సచివాలయంలో జరిగిన పర్యాటక రంగ సమీక్షా సమావేశంలో పర్యాటక రంగం మరింత అభివృద్ధి చెందేలా, అందరినీ ఆకర్షించేలా ఏడాది పొడవునా కార్యక్రమాలు నిర్వహించాలన్న సీఎం సలహాలు సూచనల మేరకు వార్షిక, త్రైమాసిక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి సమర్థవంతంగా అమలు చేస్తామన్నారు. ప్రత్యేకించి టూరిజం ఫెస్టివల్ క్యాలెండర్, నైట్ సఫారీ, డాల్ఫిన్ షోలు, 150 అరకు కాఫీ స్టాల్స్, ఎక్స్ పీరియన్స్ సెంటర్స్ ఏర్పాటు వంటి పలు ప్రణాళికలు రూపొందించేందుకు చర్యలు ప్రారంభించామన్నారు. రాష్ట్రంలోని అన్ని పర్యాటక ప్రదేశాల్లోనూ ఆయా ప్రాంతాల ప్రాముఖ్యతను బట్టి కార్యక్రమాలు చేపడతామన్నారు. ప్రతి నెలా పర్యాటక ప్రగతికి సంబంధించిన నివేదికను ముఖ్యమంత్రికి అందిస్తామని పేర్కొన్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేల ప్రతిపాదనల మేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యాటక కేంద్రాలను సమగ్రంగా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ విషయమై ఆయా జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.



సచివాలయం దగ్గర వైబ్రాంట్స్ ఆఫ్ కలాం సంస్థ ఏర్పాటు చేస్తున్న అబ్దుల్ కలాంవిగ్రహ ఆకృతులను ఆవిష్కరించిన సిఎం చంద్రబాబు

# రాష్ట్రంలో 13 ఉమ్మడి జిల్లాల్లో అబ్దుల్ కలాం విగ్రహాలు

- వైబ్రాంట్స్ ఆఫ్ కలాం సంస్థ ఏర్పాటు చేస్తున్న విగ్రహ ఆకృతులను ఆవిష్కరించిన సిఎం చంద్రబాబు

**విజయవాడ మే 6,ప్రభాతవార్తప్రతినిధి:** వైబ్రాంట్స్ ఆఫ్ కలాం అనే సంస్థ రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల్లో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం విగ్రహాలు ఏర్పాటు చేస్తోంది. తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మంకు చెందిన వైబ్రాంట్స్ ఆఫ్ కలాం సంస్థ వ్యవస్థాపకులు విజయ్ కలాం నేతృత్వంలో ఈ విగ్రహాలు ఏర్పాటు అవుతున్నాయి. రాష్ట్రంలో ఏర్పాటు చేసే ఈ విగ్రహాలను ముఖ్యమంత్రి చంద్రబాబుకు చూపించేందుకు సచివాలయానికి తీసుకుచ్చారు. ఈ సందర్భంగా అబ్దుల్ కలాం విగ్రహ ఆకృతిని సీఎం చంద్రబాబు నాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విజయ్ కలాం మాట్లాడుతూ...పదేళ్లుగా దేశ వ్యాప్తంగా అబ్దుల్ కలాం పేరు మీద వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. అబ్దుల్ కలాం స్ఫూర్తితో తాను సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో 25 చోట్ల "గ్రేట్ ఇండియన్ స్టాట్యూస్ పేరుతో 20 అడుగుల ఎత్తుతో విగ్రహాలు ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా విజయ్ కలాంను సీఎం చంద్రబాబు అభినందించారు. భారతదేశ క్షిపణి పితామహుడు అబ్దుల్ కలాం అని, రాష్ట్రపతిగా దేశానికి అత్యున్నత సేవలు అందించారని కొనియాడారు. అబ్దుల్ కలాంతో తనకున్న అనుబంధాన్ని సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్ధన్, సంస్థ సభ్యులు శివ, భాస్కర్, శ్రీను, రంజిత్, శ్రీహరిలు పాల్గొన్నారు.


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రోడ్లు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన
నిట్ నం.1 to 5/EE/(R&B)/NDL/2025-26, తేది: 02.05.2025
నంద్యాల జిల్లాలో 5 రోడ్ పనుల కొరకు అంచనా విలువ రూ.16.88 లక్షలు, ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం క్రింద ఆన్‌లైన్ టెండర్‌లు కోరబడుతున్నవి. టెండర్ డాక్యుమెంట్‌ల జారీ కొరకు చివరి తేది: 23.05.2025 మ.3.00 గం. వరకు. తదుపరి వివరాలు ఇ-మార్కెట్ ప్లేస్ అనగా www.eprocurement.gov.in వద్ద చూడవచ్చును.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, (R&B) డివిజన్, నంద్యాల
DIPR.No.16294/CL/Advt/1/1/2022-23, తేది: 06.05.2025

హీరో హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
HeroHousing Finance
సంప్రదించు చిరునామా: A-6, మూడవ అంతస్తు, సెక్టార్-4, నొయిడా-201301
రిజిస్టర్డ్ ఆఫీస్: 09, కమ్యూనిటీ సెంటర్, బసంత్ లోక్, వసంత్ విహార్, న్యూఢిల్లీ-110057
ఫోన్: 011 49267000, టోల్ ఫ్రీ నం: 1800 212 8800, ఇ-మెయిల్: customer.care@herohfl.com
వెబ్‌సైట్ : www.herohousingfinance.com | CIN: U65192DL2016PLC30148
డిమాండ్ నోటీస్
సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ చట్టం, 2002 ("చట్టం") సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002 ("నిబంధనలు") యొక్క నిబంధన 3తో చదువబడే దాని యొక్క 13(2) సెక్షన్ క్రింద
ఇది ఇలా ఉండగా హీరో హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (HHFL) యొక్క అధీకృత అధికారి అయినందున దిగువ సంతకందారు చట్టం క్రింద మరియు నిబంధనల యొక్క నిబంధన 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించబడిన అధికారాలను వినియోగిస్తూ చట్టం యొక్క 13(2) సెక్షన్ క్రింద, క్రింద తేదీగల సవివరమైన డిమాండ్ నోటీస్‌లు రుణగ్రహీత(లు), సహ-రుణగ్రహీత(లు), గ్యారెంటర్(లు) (అందరూ ఒకటిగా లేదా కలిసి "అబ్లిగార్‌లు"గా రిఫర్ చేయబడుదురు) చట్టవారసుడు(లు) చట్టప్రతినిధి(లు) ఈ క్రింది జాబితాలోని వారికి, సంబంధిత డిమాండ్ నోటీస్/లు పేర్కొనబడిన సొమ్ములను సంబంధిత నోటీస్/లు యొక్క తేదీ నుండి 60 రోజులలోపుగా క్రింద ఇవ్వబడిన వివరాల ప్రకారం చెల్లించవలసినదిగా సవివర డిమాండ్ నోటీస్‌లు ఇప్పటికే జారీ చేసారు. సదరు నోటీస్‌ల యొక్క కాపీలు రిజిస్టర్డ్ పోస్ట్ A.D. చే అందచేయబడినవి మరియు దిగువ సంతకందారుని వద్ద అందుబాటులో ఉన్నవి మరియు సదరు అబ్లిగార్(లు)/చట్టవారసు(లు)/చట్టప్రతినిధి(లు) వారికి కోరిక కలిగి ఉంటే దిగువ సంతకందారుని నుండి సాధారణ కార్యాలయ వేళలలో ఏ పని రోజునైనా సంబంధిత కాపీని సేకరించుకోవచ్చును. పై విషయానికి సంబంధించి, సదరు అబ్లిగార్(లు)/చట్టవారసు(లు)/చట్టప్రతినిధి(లు)కు మళ్లీ ఒకసారి ఇందుమూలముగా సదరు అబ్లిగార్(లు)చే ఎగ్జిక్యూట్ చేయబడిన ఏవైనా ఇతర డాక్యుమెంట్‌లు/రాతపత్రాలు మరియు రుణ ఒప్పందంతో చదువబడేవి, చెల్లింపు యొక్క తేదీ మరియు/లేదా రియలైజేషన్ వరకు కాలమ్ (d)లో క్రింద పేర్కొనబడిన సంబంధిత తేదీల నుండి క్రింద వివరించబడిన విధంగా తదుపరి వడ్డీతో కలిపి సంబంధిత పేర్ల వారి ఎదురుగా క్రింద ఇందులో సూచించబడిన సొమ్ము మొత్తాలను సంబంధిత నోటీస్/లు యొక్క తేదీ నుండి 60 రోజులలోపుగా HHFLకు చెల్లించవలసినదిగా ఇందుమూలముగా నోటీస్ మళ్లీ ఒకసారి ఇవ్వబడింది. రుణ బకాయి యొక్క తిరిగి చెల్లింపుకు సెక్యూరిటీగా, ఈ క్రింద పేర్కొనబడిన సెక్యూర్డ్ ఆస్తి(లు) సంబంధిత సదరు అబ్లిగార్(లు)చే HHFLకు తనఖా పెట్టబడినవి.

| రుణ ఖాతా నం. | అబ్లిగార్(లు)/చట్టవారసుడు(లు) చట్టప్రతినిధి(లు) యొక్క పేరు | క్రింది తేదీల నాటికి మొత్తం బకాయి రూ. | డిమాండ్ నోటీస్ తేది | NPA తేది |
|---|---|---|---|---|
| HHFKROLAP 23000044015 | Lt. S ఖాజా బాషా, షమీనా బాను షేక్ యొక్క చట్టవారసులు | రూ.6,95,972/- 02.05.2025 నాటికి | 05.05.2025 | 08.04.2025 |

సెక్యూర్డ్ ఆస్తులు/స్థిరాస్తులు/తనఖాపెట్టబడిన ఆస్తుల యొక్క వివరణ:- ఆంధ్రప్రదేశ్-518360, రిజిస్ట్రేషన్ జిల్లా కర్నూలు మరియు ఎమ్మిగనూరు ఉప-రిజిస్ట్రేషన్ క్రింద ఎమ్మిగనూరు మునిసిపాలిటీ యొక్క వార్డ్ నం.16 పరిధిలో ఎమ్మిగనూరు పట్టణం & మండలం యొక్క సర్వే నం.115c-2-2-2 మరియు 181-a1-aలో ఉన్న 1232 చ.అ. ప్లింత్ ఏరియా కలిగిన 145 చ.గజాల యొక్క విస్తీర్ణం ప్లాట్ నం.33లో నిర్మించబడిన ఇ.నం.16/449-1-a-3తో నివాసిత ఇల్లు యొక్క మొత్తం భాగం. సరిహద్దులు: తూర్పు: ప్లాట్ నం.32, పడమర: ప్లాట్ నం.34, ఉత్తరం: ప్లాట్ నం.28, దక్షిణం: 30 అడుగుల రోడ్.
*సదరు సంబంధిత పైన పేర్కొన్న తేదీగల డిమాండ్ నోటీస్‌లో ప్రత్యేకంగా పేర్కొనబడిన విధంగా ఆ రేట్ వద్ద తదుపరి వడ్డీ, అదనపు వడ్డీతోసహా, ఇన్సిడెంటల్ ఖర్చులు, ధరలు, ఛార్జీలు, వగైరా రియలైజేషన్ లేదా/మరియు చెల్లింపు యొక్క తేదీ వరకు అయినవి. సదరు అబ్లిగార్(లు) ముందు పేర్కొనబడిన విధంగా HHFLకు చెల్లింపు చేయడంలో విఫలమైతే, HHFL సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద, పై సెక్యూర్డ్ ఆస్తి(లు)/స్థిరాస్తి(లు) వ్యతిరేకంగా చర్యకు ఉపక్రమిస్తుందని ఇందుమూలముగా తెలియజేయడమైనది. మరియు వర్తించే నిబంధనలు అన్నీ సదరు అబ్లిగార్(లు)/చట్టవారసు(లు)/చట్టప్రతినిధి(లు) ధరలు మరియు పరిణామాలన్నింటినీ మొత్తం రిస్క్‌పై భరించవలసి ఉంటుందని తెలియజేయడమైనది. సదరు అబ్లిగార్(లు)/చట్టవారసు(లు)/చట్టప్రతినిధి(లు) సదరు చట్టప్రకారం పైన పేర్కొనబడిన సెక్యూర్డ్ ఆస్తి(లు) స్థిరాస్తి బదిలీ చేయడం/విక్రయం, లీజు లేదా ఏ విధంగానైనా, HHFL రాతపూర్వకంగా ముందస్తు అనుమతి లేకుండా చేయడానికి నిషేధించబడినారు. ఏవ్యక్తి అయినా దీనికి విరుద్ధంగా వ్యవహరించినా లేదా చట్టం లేదా దానిలోని నిబంధనల ఏర్పాట్లను ఉల్లంఘించినా, ప్రోత్సహించినా చట్టం క్రింద ఏర్పాటు చేయబడిన విధంగా జైలు శిక్ష మరియు/లేదా పెనాల్టీ పొందడానికి బాధ్యులవుతారని తెలియజేయడమైనది.
తేది : 07.05.2025, సం/- అధీకృత అధికారి
ప్రదేశం : కర్నూలు హీరో హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ తరఫున

వార్త

మానవుడి కష్టాలన్నింటికి కారణం అతని అజ్ఞానం, క్రమశిక్షణారాహిత్యం.

-కౌటిల్యుడు


# ప్రకృతి కన్నెర్ర!

ఏటా వర్షాకాలంలోనూ అడపా దడపా వినవచ్చే పిడుగులు, మెరుపుల శబ్దాలు, ఇప్పుడు తరచూ వినవస్తున్నాయి. వడగళ్ల వాన పరిస్థితీ అంతే. గతంలో కొన్ని ప్రాంతాల్లో కొన్నిసార్లే వడగళ్లు పడతాయని ప్రతీతి. ఇప్పుడలా కాదు. రోజూ ఎక్కడో అక్కడ వడగళ్ళు పడ్డాయని, భారీ వడగళ్లవానలు కురుస్తున్నాయనీ, వింటున్నాం.ముందు వడగళ్ల వానలు, వెను వెంబడి తీక్షణ ఉష్ణోగ్రతలు. మళ్ళీ వానలు ...ఇలా వరుసబెట్టి ఎడా పెడా ప్రకృతి కన్నెర్ర చేస్తూ రైతును ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఏ విధంగానూ ఉపశమనం దక్కే పరిస్థితి లేక ఆవేదనతో రైతాంగం కుమిలిపోతున్నారు. అకాల వర్ష బీభత్సాలు రైతన్నకు అపార నష్టాలు తెచ్చి పెడుతున్నాయి. వాన రాకడ, పోకడ ఎవరికీ తెలియదు. కానీ వాతావరణ శాఖ తనకున్న సాంకేతిక నైపుణ్యంతో వానలు, ఎండలు వంటి అంశాలపై ఎన్నో ముందస్తు జాగ్రత్తలు అందిస్తోంది. ఆ మేరకు రైతన్న ఎంతో కొంత మేలు పొందుతూనే ఉన్నా పరిస్థితులు కలిసిరావడం లేదు. వర్షాలు అధికమని తెలిసినా పనల మీద ఉన్న పంటను ఇంటికి తెచ్చుకోవడానికి సాధ్యంకావడం లేదు. మొన్నటి వరకు ఎండకు ఎండిన ధాన్యం ఇప్పుడు వర్షానికి తడుస్తోంది. అలా తడిసిన ధాన్యం కొనుగోలుకు వెళ్తే ఐదు కిలోల తరుగు రాస్తున్నారనీ రైతాంగ ఆవేదన.చేతికి అంది వచ్చిన కూడు నోటికి అందని పరిస్థితులున్నాయి. ఇలా రైతాంగాన్ని ప్రకృతి పరీక్షిస్తోంది. గాలి వాన బీభత్సానికి చేతికందిన పంట నీటిపాల వుతున్నది. ఉభయ తెలుగు రాష్ట్రాలలో కలిపి లక్షఎకరాల కన్నా పైనే పంటలు నష్టపోయాయి. ఈదురు గాలులు, వడగండ్లతో కురుస్తున్న వర్షాల వల్ల పొలాల్లో పంటలే కాకుండావాణిజ్య పంటలు మామిడి, బొప్పాయి, అరటి తోటలకు ఎక్కువగా నష్టం జరిగింది. తెలంగాణాలో పిడుగులు కారణంగా గొర్రెలు చనిపోయాయి.పిడుగుపాటుకు దాదాపు 15 మంది చనిపోయారు. ఎండలు, అకాల వర్షాల దాగుడు మూతలు నిరంతరంగా కొనసాగుతూనే ఉన్నాయి. మొదటి విడత వానలకు పొలాల్లో ఉన్న పంట నష్టమైతే ఇప్పుడు ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల కల్లాలు, మార్కెట్ యార్డుల్లో ధాన్యం నీటగలిసి పోతున్నది. కొనుగోలు ప్రక్రియ నత్తనడకన సాగుతుండటమే అందుకు కారణం. రక రకాల కొర్రీలతో కొనుగోళ్ల జాప్యం అవుతుండటంతో ధాన్యం వర్షార్పణం అవుతోంది. తీరా మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాల వద్ద ఆకస్మికంగా వర్షం వస్తే ఆరుబయట ధాన్యం బస్తాల మీద కప్పుకునేందుకు టార్పాలిన్‌లు కానీ ధాన్యం ఎత్తుకునే గొనె సంచులు కానీ అందుబాటులో లేవని రైతులు గగ్గోలు పెట్టినా తెలంగాణ ప్రభుత్వం ఇంతవరకు వాటిని సమకూర్చలేదు. దీంతో రైతులు నిస్సహాయంగా చూస్తుండాల్సిన పరిస్థితి. ప్రకృతి ప్రకోపానికి రైతు బలికాకుండా వారి అవసరాలను తీర్చాల్సిన బాధ్యతను ప్రభుత్వాలు తీసుకోవాలి. తాజాగా దేశంలోని 26 రాష్ట్రాల్లో భారీ వర్షాలు, పిడుగులు, వడగళ్లుపడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండి) వెల్లడించింది. మే 8 వరకు ఈ భారీ వర్షాల మోతే. ఇప్పటికే పశ్చిమ రాజస్థాన్లోని కొన్ని ప్రాంతాలకు ఆరెంజ్ అలర్ట్, తూర్పు రాజస్థాన్‌కు యెల్లో అలర్ట్ జారీ చేసింది. ఇలా దేశంలో దాదాపు అన్ని ప్రాంతాలకూ వర్ష సూచనలున్నాయి. ఒకప్పటిలాగా కాక వాతావరణ శాఖ పసికట్టిన సమయానికి వర్షాలు కురుస్తుండటం విశేషం. ఏయే రాష్ట్రాల్లో ఎలాంటి వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయో ముందస్తు హెచ్చరికలు కూడా చేసింది. రాజస్థాన్, గుజరాత్, ఛత్తీస్ ఘడ్, కర్ణాటక, కేరళ మహారాష్ట్రలలో భారీ వర్షం, ఈదురు గాలులు, వడగళ్ల వానలకు అవకాశం ఉంది. మహారాష్ట్ర,గుజరాత్, ఈశాన్య రాష్ట్రాల్లో అధిక ఉష్ణోగ్రతలు, మరోవైపు ఒడిశాలో భారీ వర్షాలు, వడగళ్లు పడే అవకాశం. ఉరుములు, మెరుపులతో పాటు గాలులు వీచే అవకాశం. బెంగాల్, బిహార్ నుంచి అసోం, ఈశాన్య రాష్ట్రాల్లో పిడుగులతో కూడిన వర్షం. ఇలా ప్రకృతి ఎన్ని విధాలుగా కన్నెర్ర చేయగలదో అన్ని విధాలుగా మనతో ఆడుకుంటోందని, కొన్ని ప్రాంతాల్లో హిమపాతం కూడా సంభవించే ప్రమాదం ఉందని తెలిపింది. ఈ క్రమంలోనే అలాంటి ప్రాంతాల పర్యాటకాన్ని వాయిదా వేసుకోవాలి. కొన్ని కొండ ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడడం, వరదలు, పిడుగులు పడే అవకాశం ఉన్నందున బహిరంగప్రదేశాల్లో తిరగకూడదు. గాలులు, వడగళ్ల నుంచి తప్పించుకోవడానికి ఇంట్లోనే ఉండాలి. రైతులు సైతం పంట రక్షణ కోసం ముందస్తు చర్యలు తీసుకోవాలని సలహా ఇచ్చింది. ఎన్డీఆర్ఎఫ్‌ప పాటు విపత్తు నిర్వహణ బృందాలు అప్రమత్తంగా ఉండాలని ఐఎండి ఆదేశించింది. దక్షిణాది రాష్ట్రాలైన తమిళనాడు, కేరళ, తెలంగాణ, కోస్తాంధ్రకు కూడా మళ్లీమళ్లీ వర్ష ప్రభావ హెచ్చరిక. ఇంత స్పష్టంగా వాతావరణ విశ్లేషణలున్నా రైతాంగానికి మేలు చేకూరలేని, చేకూర్చలేని పరిస్థితులు కనపడుతున్నాయి. మరో ప్రకృతి బీభత్సం ప్రకంపనలు కూడా ఈప్రాంతాన్ని వదిలిపెట్ట లేదు. ఉత్తర తెలంగాణలో సోమవారం సాయంత్రం స్వల్పంగా భూమి కంపించింది. రిక్టర్ స్కేల్‌పై భూకంప తీవ్రత 3.8గా నమోదైంది. ఎక్కడా ప్రాణ,ఆస్తులు నష్టం కలిగించకపోవడం విశేషం.ప్రకృతిని ఎదురించలేం. ఏమీ చేయలేం.కాగా ఈదశలో రైతు పంట నష్టాలను నిజాయతీగా, స్పష్టమైన విధానాలతో గణించి అంచనా వేసి పరిహారాన్ని అందివ్వడమొక్కటే ప్రభుత్వాల మీదున్న బాధ్యత. విపత్తుల నిర్వహణలో రాష్ట్రాలన్నీ ముందస్తు ప్రణాళికతో అప్రమత్తమవ్వాల్సిన అవసరముంది.



చెడ్డవారి దురాగతాల కంటే మంచివారి మౌనమే అత్యంత విషాదకరం.

మార్టిన్ లూథర్ కింగ్



నీ తప్పును, నీ తెలివితక్కువ పనులను నీ ముందు నివేదించువాడే నిజమైన నీ స్నేహితుడు.

షేక్‌స్పియర్

## ప్రజావాక్కు



### ఎండిపోతున్న పల్లె ప్రకృతి వనాలు

**రాష్ట్ర వ్యాప్తంగా** గత ప్రభుత్వం ప్రతీ గ్రామంలో పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేసి వివిధ రకాల మొక్కలను నాటడం జరిగింది.అన్ని రకాలమొక్కలు, పండ్ల మొక్కలు నాటి వాని రక్షణ గ్రామ పంచాయతీలకు అప్పగించారు. ప్రస్తుతం అనేక గ్రామాలలో పల్లె ప్రకృతి వనాలు నీరు పోసేవారు లేకఎండిపోయి మందు బాబులకు,అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. గతంలో గ్రామంలో వున్న యువత,వృద్దులు స్వచ్ఛమయిన గాలి కోసం పల్లె ప్రకృతి వనాలుకు వెళ్ళేవారు.అంతటఎండి కళా విహీనంగా మారాయి. అధికారులు స్పందించి పల్లె ప్రకృతి వనాలకు పూర్వ వైభవం తేవాలని, ప్రతీ రోజూ వానికి నీరు పోసి ఏపుగా మొక్కలు ఎదిగేలా చర్యలు తీసుకోవాలి.

- ఎస్. సతీష్ , వరంగల్ జిల్లా

### ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించాలి

**ఇరవైమూడు** మార్చి 2000సంవత్సరం రోజున ప్రారంభమైన కరోనావైరస్ కన్నముందు నడిచిన ప్యాసింజర్ రైళ్లను తిరిగి పునఃప్రారంభించాలి. రైలు కొన్ని రోజులు నిలుపుదల చేసి తిరిగిప్రారంభించడం జరిగింది. కానీఎక్కువగా ప్యాసింజర్ రైళ్ల అప్పటిలాగా తిరిగి ప్రారంభించలేదు. కొన్ని ఎక్స్‌ప్రెస్‌రైలు కూడా ప్రతి రైల్వే స్టేషన్లలో వచ్చేటప్పుడు పోయేటప్పుడు తప్పనిసరిగా ఆగాలి. గతంలో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేవు. కొన్ని రైళ్ల నడవకపోవడంతో పేద ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. కరోనా వైరస్ కన్నా ముందు గతంలో ప్రతి రైల్వే స్టేషన్లలో ఆగిన ప్రతి రైలు ఇప్పుడు కూడా నడిచే విధంగా రైల్వే ఉన్నత అధికారులు ప్రజాప్రతినిధులు కృషి చేయాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ, వరంగల్ జిల్లా

### ఎర్రకోట సరిపోతుందా!

**ఎర్రకోటను** తనకు అప్పగించాలని మొఘల్ చక్రవర్తుల వారసురాలు సుల్తానా బేగం ఢిల్లీ హైకోర్టులోను, సుప్రీం కోర్టులోను పిటిషన్ వేసినట్టు, కోర్టులు కొట్టివేసినట్టు, ఎర్రకోట ఒక్కటే ఎందుకు? ఫతేపూర్ సిక్రీ, తాజ్‌మహల్‌ను ఎందుకు కోరటం లేదని ప్రశ్నించినట్టు వార్తా పత్రికల ద్వారా తెలుస్తున్నది. మొఘల్ చక్రవర్తులు చేసిన దురాగతాల బాధ్యతను కూడా ఆమె వహిస్తుందేమో కనుక్కొని ఆమెకు ముందు తగిన శిక్షణు విధించాలి.

-రాచమడుగు శ్రీనివాసులు, అనంతపురం

### లిఫ్ట్ ఎస్కలేటర్ ఏర్పాటు చేయాలి

**కాలానుగుణ** పరిస్థితులకు తోడ్పాటుగా రోడ్డు రవాణా రద్దీని నివారించుటకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతోమెట్రో రైలు అందుబాటులోనికి తీసుకొని రాబడినది. దీనివలన కాలుష్య రహిత వేగవంతమైన మెరుగైన రవాణా సౌకర్యాలు కలుగుచున్నవి. హైదరాబాద్ మెట్రో రైల్వే జేబిఎస్ పరేడ్ గ్రౌండ్ స్టేషన్ నుండి జేబిఎస్ వెళ్లుటకు మహాత్మా గాంధీ బస్‌స్టేషన్‌లో ఉన్న విధంగా సరాసరి వెళ్లుటకు లిఫ్టు ఎస్కలేటర్ సౌకర్యాలు కల్పించబడలేదు. ఫలితంగా ఉత్తర తెలంగాణ జిల్లాల నుండి జేబిఎస్‌ద్వారా మెట్రోరైలులో ప్రయాణించుటకు ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ బస్‌స్టేషన్ నుండి మహారాష్ట్ర ప్రజలు కూడా రాకపోకలు సాగిస్తుంటారు. ఇంతేకాక పరేడ్ గ్రౌండ్ స్టేషన్‌లో ఎస్కలేటర్ లిఫ్ట్ సౌకర్యాలు కల్పించబడలేదు. కావున ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఈ స్టేషన్ లో కూడా లిఫ్టు ఎస్కలేటర్ ఏర్పాటు చేయాలి.

- దండంరాజు రాంచందర్ రావు, పాత బోయినపల్లి

### అకాల వర్షాలతో అన్నదాత ఆగ మాగం

రాష్ట్రంలో కురుస్తున్న అకాల వర్షాలతో అన్న దాతలు ఆగం అవుతూ వున్నారు బహుళ సమస్యలతో సతమతం అవుతున్న రైతన్నలను చెడ గొట్టు వానలు నిండా ముంచుతూ వున్నాయి వారం రోజులనుండి వివిధజిల్లాలలో గాలివాన అలజడి చేస్తుంది ఈదురు గాలులు వడ గండ్ల తో కురుస్తున్న వర్షాల వల్ల పొలాల్లో పంటలేకాక తోటలకు నష్టం కలుగుతూవుంది. విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. మామిడి, మునగ బొప్పాయి తోటలు నష్టం కలుగుతూ వుంది. పిడుగు పాటుకు జీవాలు మరణిస్తూ వున్నాయి. అకాల వర్షాలవల్ల నష్ట పోయిన వారిని ఆదుకోవాలి. సర్వేచేసి వారికి పంట నష్టం అందచేయాలి.

-కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

### పెన్షన్ ఫండ్ చెల్లించాలి

**కోల్ ఇండియా,** సింగరేణి బొగ్గు గని అధికారులకు కార్మికులకు కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ద్వారా దాదాపు ఐదులక్షల మందికి పింఛన్ చెల్లిస్తున్నారు. అధికారులు, కార్మికుల వద్ద బేసిక్ నుంచి ఏడు శాతం వసూలు చేసి యాజమాన్యాలు ఏడుశాతం కలిపి పెన్షన్‌ఫండ్‌కు జమచేస్తున్నారు. పదవి విరమణ తర్వాత వారి బేసిక్, మారేడు కరువు భత్యంపై ఇరవై శాతం పెన్షన్ చెల్లిస్తున్నారు.పెన్షన్ ఫండ్‌కు వచ్చిన మొత్తం కంటే తక్కువ జమ కావడంతో చెల్లింపుల మధ్య అంతర్యం పెరుగుతుంది.

-ఎన్.నాగరాజు, నల్గొండజిల్లా

మన విమ ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# విలువల పెంపులో విఫలమవుతున్న విద్య

***సాధ్యమైనంతవరకు మొబైల్‌కు దూరంగా ఉంచి మంచి పుస్తకాలకు వారిని దగ్గర చేయాలి. పాఠ్యాంశాలు నిజ జీవితాన్ని ప్రతిబింబించాలి. వాస్తవికతకు దగ్గరలో ఉండాలి. నీతి నిజాయితీలకు, మానవ విలువలకు అద్దం పట్టాలి. భాషపట్ల గౌరవం సాహిత్యాభిలాషి పట్లఆసక్తి పెంపొందే పాఠ్యాంశాలు ఎంపిక చేయాలి. వీటన్నింటినీ పరీక్షలలో భాగం చేయాలి అంటే విద్యార్థి ఆడే ఆటలు పాల్గొనే సాంస్కృతికపరమైన కార్యక్రమాలు చదివే పుస్తకాలు (సిలబసితర) అతని వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతాయి కాబట్టి ఇవన్నీ అతడి ఉత్తీర్ణతలో లేదా ఫలితాల్లో కీలకపాత్ర పోషించాలి. లేదంటే విద్యార్థి ఉత్తీర్ణుడవుతాడు. విద్య అతడిని మనిషిగా తీర్చిదిద్దటంలో విఫలమవుతుంది. పుస్తక రచయితలు ఈ దిశగా ఆలోచించి మరింత ప్రభావవంతమైన పాఠ్యాంశాలు ఎంపికచేసి విద్యార్థుల వ్యక్తిత్వాన్నివిలువలను పెంపొందించే దిశలో ఆ పుస్తకాలు తయారు చేయాలి.***

శ్రీ శ్రీ కుమార్

పుట్టిన ప్రతి మానవజీవికి అవసరమైనది విద్య. మానవుడు జన్మించినది మొదలు ఏదో ఒకటి ప్రయత్న పూర్వకంగా లేదా అప్రయత్నంగా కానీ నేర్చుకుంటూనే ఉంటాడు. కొన్నింటిని పొరపాట్ల ద్వారా కూడా నేర్చుకుంటాడు అంటే అనుభవం ద్వారా నేర్చుకోవడం జరుగుతుంది. అనుకరణ ద్వారానే ఇతరులను చూడటం ద్వారానే కొన్ని కొత్త విషయాలు నేర్చుకుంటాడు. తల్లిదండ్రులు ప్రథమ గురువులు, వారి నుండి పిల్లవాడు నేర్చుకునేది జీవితంలో చాలాకాలం నిలిచి ఉంటుంది. ఉపయోగపడుతుంది, సమకాలీకుల నుండి నేర్చుకోవడం కూడా ప్రభావవంతమైనది. సమాజం నుండి అనుక్షణం కొన్ని విషయాలు తెలుసుకుంటూ జీవనం సాగిస్తాడు. పరిపూర్ణ మానవుడిగాపరిణమించే క్రమంలో పాఠశాల విద్య అతన్ని బాగా తీర్చిదిద్దుతుంది. అది సంస్కారాన్ని నేర్పుతుంది. పాఠశాల స్థాయిలో బోధించిన గురువులే విద్యార్థులకు క్రమశిక్షణ, నీతి నియమాలు, నడవడిక, ప్రవర్తన, కర్తవ్యబోధన, ఇంకా దేశభక్తి నేర్పుతారు. భాషా బోధకులకు ఈ బాధ్యత ఒకింత ఎక్కువ ఉంటుంది. ఈ లక్షణాలు పసి మనసులపై ముద్ర వేస్తాయి. ఆ స్థాయిలో బోధించే గురువులు కూడా ఉత్తమ గుణగణాలు, సమయపాలన, మంచి అలవాట్లతో విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలి. వారే విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట వేయడంలో కీలకమైన పాత్ర పోషిస్తారు. పాఠశాల స్థాయికి మించి అంటే కళాశాల స్థాయిలో చెప్పే గురువులు కేవలం కొద్ది మంది మాత్రమే విద్యార్థుల మనసులపై తమ దైనశైలితో విషయపరిజ్ఞానంతో ఆకట్టుకుని వారి జీవితాలకు ఒక గమ్యం చూపెట్టే వారుంటారు. విద్యార్థులు పెరుగుతున్న దశలో వారిలో చాలా గుణాత్మకమైన మార్పులు మనం చూడవచ్చు. పాఠశాల స్థాయిలో వారిలో ఉన్న మానసిక వికాసానికి కేవలం వారి గురువులను చూసి నేర్చుకున్నదే కాక వారికి నిర్దేశించిన పాఠ్యాంశాలు కూడా కారణమవుతాయి. భారతరత్న డాక్టర్ అబ్దుల్ కలాం తన చిన్న నాటి గురువులను గురించి తన పుస్తకం 'ఇగ్నైటెడ్ మైండ్స్'లో ఎంతో గొప్పగా వర్ణిస్తారు. కళలు సాహిత్యం వంటివి వారి అభిరుచిని బట్టి వారి వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయి. అదే కళాశాలస్థాయిలో విద్యార్థి స్వతహాగా పెంపొందించుకోవాల్సిందే కానీ పాఠ్యాంశాల్లోనూ తరగతి గదుల్లోనూ వారు నేర్చుకునే విలువలు చాలాతక్కువ. గురు శిష్యబంధంకూడా అంత బాగా దృఢంగా ఉండదని చెప్పవచ్చు. అది క్రమంగా బలహీనపడుతుంది.తద్వారా విద్యార్థి అనైతికతకు క్రమశిక్షణ రాహిత్యానికి పాల్పడే అవకాశాలు మెండు. మనఅధికారులు కూడా నైతిక విలువల పెంపుపై ఏవిధమైన కృషి చేయక పోగా అలాంటి విద్యఅమలులో దాన్ని మరింత అపహాస్యం చేశారు. ఇంటర్మీ డియట్ విద్యలో ఎథిక్స్ హ్యూమన్ వాల్యూస్ అనే ఒక పేపర్ ప్రథమ సంవత్సరంలో తప్పని పరిస్థితుల్లో ప్రవేశ పెట్టింది మన బోర్డు. ఆ పేపర్‌కు కేటాయించిన మార్కులు విద్యార్థి ఉత్తీర్ణతను నిర్ణయించలేవు. అంటే కేవలం పరీక్షకు హాజరైతే సరిపోతుంది. ఆ పరీక్షను ఎంత మొక్కుబడిగా నిర్వహిస్తున్నారు అనేది దీన్ని బట్టి తెలుస్తుంది. అంటే విలువలు పెంచాలనే ప్రయత్నంలో ఏమాత్రం చిత్తశుద్ధిలేదు అనడంలో సందేహం లేదు. మానవీయ విలువల పట్ల అధికారులు ఎంత అమానవీయంగా ప్రవర్తిస్తున్నారనేది ఇక్కడ స్పష్టంగా తెలుస్తుంది. అలాంటి విద్యార్థి రేపుభవిష్యత్తులో సమాజంలో ఇతరుల పట్ల,పెద్దల పట్ల మానవీయంగా ప్రవర్తించాలనుకోవడం అత్యాశ అవుతుంది. విద్యవిజ్ఞాన సంపాదన మాత్రమేకాదు. అది వినయం వివేకం విజ్ఞానం విలువల సమ్మేళనం.సంస్కారం తో మాత్రమే విద్యగుబాళిస్తుంది రాణిస్తుంది. అది నేటి విద్యార్థి లోకంలో మృగ్యమైంది. సమాజంలోనే కాదు. తల్లిదండ్రుల



పట్ల సోదరుల పట్ల కూడా నేటితరం ప్రవర్తన బాధ్యతారాహితంగానే కాదు అభ్యంతరకరంగానూ ఉంది. విద్య ప్రైవేటీకరణ కార్పొరేటీకరణకు మనప్రభుత్వాలు ద్వారాలు తెరిచినప్పటి నుండి అది వెర్రితలలు వేయడం ప్రారంభించింది. కేవలం మార్కుల సంపాదన విద్యను విద్యార్థిస్థాయిని నిర్ణయించడం మొదలైంది. గుణముల (మార్కులు) సంపాదనతో విద్యార్థి గుణగణాలు నిర్ణయించడం సముచితం కాదు. మార్కుల వేటలో ముందు నిలిచినవాడే ఉత్తమ విద్యార్థిగా నిర్ణయించడం సరికాదు. కర్తవ్యపాలన సమయపాలన క్రమశిక్షణ విధి నిర్వహణ సామాజిక బాధ్యతలు కూడా విద్యలో భాగమై అవి కూడా అతడి శ్రేణిని ఉత్తీర్ణతను నిర్ణయించాలి. మంచి మార్కులతో పాసై ఉన్నత చదువులు చదువుతూ గంజాయి స్మగ్లింగ్ మాదక ద్రవ్యాలకు అలవాటు పడుతున్న వ్యక్తులను మనం పేపర్లలో చదువుతున్నాం. అమెరికాలో లాగా మనదేశంలోనూ 'తుపాకీ సంస్కృతి' నెమ్మదిగా మొదలై అది విషసంస్కృతిగా పరిణమించే ప్రమాదముంది. ఇక ఇంజనీరింగ్ కళాశాలలో దమ్ముకొట్టని విద్యార్థులను భూతద్దంలో వెతకాలి. అలాంటివారు విద్యలో రాణిస్తున్నారు. మార్కుల ప్రకారం ఉద్యోగాలు సంపాదిస్తున్నారు. కానీ జీవితంలో ఫెయిల్ అవుతున్నారు. స్త్రీలపట్ల గౌరవం మర్యాద లేకుండా ప్రవర్తించడం వయసు, వావివరసలు లేకుండా ఇష్టం వచ్చినరీతిలో సభ్యసమాజం సిగ్గుతో తలవంచుకునేలాగా ప్రవర్తించడం మామూలు అయిపోయింది. గ్రామీణ ప్రాంతాల్లోని నిరక్షరాస్యులు కూడా ఇంతనీచంగా ప్రవర్తించడం లేదు. అంటే విద్య అవివేకులను కుసంస్కారులను తయారు చేస్తుందా అనేది నిజంగా చర్చనీయాంశమే. 'విద్య లేనివాడు వింత పశువు' అన్న నానుడిని అబద్ధం చేస్తున్న రోజులివి. విద్య ఉన్నవాడు కూడా వింత పశువులాగా ప్రవర్తించడం శోచనీయం. ఈ మధ్య విజయనగరం జిల్లాలో జరిగిన ఒక సంఘటన మన సమాజం తీరుతెన్నులను ప్రశ్నిస్తోంది. అధ్యాపకురాలు వారించినప్పటికీ విద్యార్థిని మొబైల్ వాడుతుండగా సదరు అధ్యాపకురాలు ఆ విద్యార్థిని చేతినుండి మొబైల్ లాక్కున్నది. అందుకు అవమానంగా భావించిన ఆ విద్యార్థిని కోపోద్రిక్తురాలై అధ్యాపకురాలిని చెప్పుతో కొట్టడం నిజంగా సభ్య సమాజానికి తలవంపులు తెచ్చే సంఘటన. మొబైల్ వాడవద్దు అనడం లేదా గుంజుకోవడమే ఆధ్యాపకురాలు నేరమా? అందుకు విద్యార్థినికి అధ్యాపకురాలిని శిక్షించే అర్హత ఉన్నదా? విచక్షణ మరిచి అవివేకంతో గురువును చెప్పుతో కొట్టడం ఏ రకమైన సంస్కారం అవుతుంది? ఇదే ధోరణి అందరి లోనూ ప్రబలితే ఇక చదువులకు పరీక్షలకు స్వస్తిచెప్పడమే పరిష్కారం.ఇంటిలోనూ,విద్యాసంస్థలోనూ బయట సమాజంలోనూ విద్యార్థుల నడవడికపై కన్నేయాలి. కనిపెట్టిఉండాలి. వారి కదలికలపై దృష్టిసారించాలి.వారి పెడధోరణిని మార్చకపోతే భవిష్యత్తులో సంఘవ్యతిరేకశక్తులు గానూలేదా దౌర్జన్యకారులుగాను మారే ప్రమాదంఉంది. విద్య మాత్రమే మనిషిని సరియైన దారిలో నడిపిస్తుంది. వివేకవంతుడిని చేస్తుంది. అందుకు మన పాఠ్యాంశాలు మాత్రమే సరిపోవు,ఉపాధ్యాయుల తల్లిదండ్రుల నడవడిక విద్యార్థులను ఒక క్రమపద్ధతిలో తీర్చిదిద్దుతుంది. కౌమార దశవరకు ఉపాధ్యాయులు తల్లిదండ్రులే విద్యార్థికి ఆదర్శం. మహానేతల జీవిత చరిత్రలు సిలబస్లో భాగం కావాలి. వారికంటూ ఒక ఆదర్శ పురుషుడు ఆదర్శ నేతను ఎంచుకొని ఆ మార్గంలో నడిచే విధంగా పాఠశాల ఇల్లు లాంటి వాతావరణం కల్పించాలి. సాధ్యమైనంతవరకు మొబైల్‌కు దూరంగా ఉంచి మంచి పుస్తకాలకు వారిని దగ్గర చేయాలి. పాఠ్యాంశాలు నిజ జీవితాన్ని ప్రతిబింబించాలి. వాస్తవికతకు దగ్గరలో ఉండాలి. నీతినిజాయితీలకు, మానవ విలువలకు అద్దం పట్టాలి. భాషపట్ల గౌరవం సాహిత్యాభిలాషి పట్లఆసక్తి పెంపొందే పాఠ్యాంశాలు ఎంపిక చేయాలి. వీటన్నింటినీ పరీక్షలలో భాగం చేయాలి అంటే విద్యార్థి ఆడే ఆటలు పాల్గొనే సాంస్కృతికపరమైన కార్యక్రమాలు చదివే పుస్తకాలు (సిలబసితర) అతని వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతాయి కాబట్టి ఇవన్నీ అతడిఉత్తీర్ణతలో లేదా ఫలితాల్లో కీలకపాత్ర పోషించాలి. లేదంటే విద్యార్థి ఉత్తీర్ణుడవుతాడు. విద్య అతడిని మనిషిగా తీర్చిదిద్దటంలో విఫలమవుతుంది. పుస్తక రచయితలు ఈ దిశగా ఆలోచించి మరింతప్రభావవంతమైన పాఠ్యాంశాలు ఎంపికచేసి విద్యార్థుల వ్యక్తిత్వాన్నివిలువలను పెంపొందించే దిశలో ఆ పుస్తకాలు తయారు చేయాలి. ●

# అథ్లెటిక్స్‌తో అనంత ప్రయోజనాలు!

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి

జ్ఞాపకశక్తిని పెంచుకుని మెదడు చురుకుగా పని చేయడానికి శారీరక ఆరోగ్యమే పునాది. శారీరక ఆరోగ్య సిద్ధికి ఏకైక మార్గం మైదాన క్రీడలు లేదా అథ్లెటిక్స్ క్రీడలు మాత్రమే అని తెలుసుకోవాలి.అందువల్లనే 'సౌండ్ మైండ్ ఇన్ సౌండ్ బాడీ' అనే నినాదం వింటున్నాం. పాఠశాల స్థాయి నుండి విశ్వవిద్యాలయ స్థాయి వరకు విద్యార్థినీ విద్యార్థులు,యువత దృష్టిని క్రీడల వైపు ఆకర్షించడంతో పాటు అత్యున్నత ప్రతిభ కనబర్చిన అథ్లెట్లను సన్మానించడం, అథ్లెటిక్ పోటీలు నిర్వహించడం, అవగాహన పర్చడం లాంటి కార్యక్రమాల నిర్వహణకు ప్రతి ఏటా 07మే రోజున ప్రపంచ అథ్లెటిక్స్ దినోత్సవం" నిర్వహించడం ఆనవాయితీగా మారింది. 1996లో ఇంటర్నేషనల్ అమాచూర్ అథ్లెటిక్ ఫెడరేషన్ ప్రారంభించిన ప్రపంచ అథ్లెటిక్స్ దినం వేదికగా పిల్లలు, యువతను క్రీడామైదానాల వైపు ఆకర్షించడమే ప్రధాన ధ్యేయంగా నేటికీ కొనసాగుతున్నది. చురుకైన మెదడుతో విద్యలో ఉన్నతి, మైదాన క్రీడలతో శారీరక ఆరోగ్యం కలుగుతుందని తెలుసుకొని నేటి పిల్లలు, యువత విద్య,అథ్లెటిక్స్‌ను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగితే పరిపూర్ణ వ్యక్తిత్వం కలిగిన రేపటి పౌరులుగా నిలబడతారు. అథ్లెటిక్స్ క్రీడల్లో పరుగు, నడక, ఎగరడం, దూకడం, విసరడం, ఈదడం ఆధారిత పలు క్రీడలు వస్తాయి. అథ్లెటిక్స్‌లో పాల్గొనే పిల్లలు, యువ క్రీడాకారులకు దేహదారుఢ్యం, శారీరక చురుకుదనం, శరీర అవయవాల సమన్వయం, జట్టు స్ఫూర్తి, టీమ్ స్పిరిట్, గెలుపోటములను సమానంగా తీసుకునే తత్వం, సోదరభావం, వ్యక్తిత్వ వికాసం, సామాజిక గుర్తింపు,సోషల్ స్కిల్స్, ఉద్యోగ ఉపాధుల కల్పన, ఆత్మవిశ్వాసంపెరగడం, ధైర్యంగా జీవితాన్ని విజయం వైపు నడవడం లాంటి అనేక ప్రయోజనాలు కలుగుతాయి. క్రీడలకు దేశ సరిహద్దులు, భాషాబేధాలు, జాతి, మత, లింగ వివక్షలు లాంటివి



ఉండవు. అథ్లెటిక్స్ ఓ విశ్వభాష. ఇవి సరిహద్దులను చెరిపేస్తాయి. అందరినీ ఏకంచేస్తాయి. ప్రపంచ శాంతికి ఊతం ఇస్తాయి. పోటీతత్వాన్ని పెంచుతాయి. నిజాయితీగా ప్రవర్తించడం, ఓటమిని నవ్వుతూ ఒప్పుకోవడం, రేపటి గెలుపుకు పట్టుదల పెంచుకోవడం క్రీడాకారులకే సొంతం. క్రీడల ద్వారా క్రమశిక్షణ, పట్టుదల, విపరీత పరిస్థితులను తట్టుకునే సామర్థ్యం లాంటి అతి ముఖ్యమైన వ్యక్తిగత ఎదుగుదలకు సంబంధించిన ప్రయోజనాలు కలుగుతాయని తల్లితండ్రులు గమనించాలి. 2025 ప్రపంచ అథ్లెటిక్స్ దినోత్సవ శుభవేళ తల్లితండ్రులు, విద్యాలయ యాజమాన్యాలు కొన్ని కఠిన నిర్ణయాలను తీసుకొని అమలుకు నడుం బిగించాలి. నేటి అత్యాధునిక డిజిటల్ ఏఐ యుగపు పిల్లలు, యువత అంతా కలిసి ఐక్యతతో మార్కులు, ర్యాంకులు, వీడియో గేమ్స్,స్మార్ట్‌ఫోన్ మాధ్యమాల వెంట పరుగెత్తుతూనే ఉన్నారు. అమ్మనాన్నలతోనే మాట్లాడే కాసింత సమయం దొరకనంత బిజీగా ఉన్న పిల్లలకు మైదానక్రీడలగూర్చి ఆలోచించే క్షణం తీరిక దొరకడం లేదు. ప్రేమగా అయ్యవ్వ వడ్డించిన భోజనాన్ని కడుపు నిండా తినడం, ఫ్యాన్ల కింద కాలం గడపడం, శారీరక కదలికలకు ఆస్కారం ఇవ్వకపోవడం, స్థూలకాయులుగా కుటుంబాలకు, దేశానికి భారం కావడం జరుగుతోంది. మన పిల్లలు మైదాన క్రీడల్లో పాల్గొనే విధంగా వారిని ప్రోత్సహించాలి. విద్యాలయాల్లో క్రీడా మైదానాలు పిల్లలతో కలకలలాడాలి. సరైన మైదానాలు లేని పాఠశాలలకు అనుమతులు ఇవ్వకూడదు. పాఠ్యప్రణాళికలో క్రీడలకు ప్రాధాన్యం పెంచాలి. తూతూ మంత్రంగా కొన్ని యాజమాన్యాలు పిఈటిలను నియమించి చేతులు దులుపుకుంటూ, వారిని ఇతర విధులకు వాడుకోవడంఆక్షేపణీయం. ప్రపంచ అథ్లెటిక్స్ దినం వేదికగా క్రీడా పోటీలు, అథ్లెట్లను సన్మానించడం, మారథాన్స్, ర్యాలీలు, ట్రాక్ అండ్ ఫీల్డ్ పోటీలు, అవగాహన కార్యక్రమాలు, సామాజిక మాధ్యమ ప్రచారాలు లాంటి పలు కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతోంది. శరీర కదలికలే రేపటి ఆరోగ్య గుళికలు. క్రీడలకు దూరమైంతే బరువెక్కి దేశానికే భారం అవుతాం. ●

# పాక్‌పై భారత్ వ్యూహాత్మక ముందడుగులు

యేచన్ చంద్ర శేఖర్

కాశ్మీర్ అందాలను తిలకించడానికి, పర్వతాలను సందర్శించడానికి దేశంలోని వివిధ రాష్ట్రాల పర్యాటకులు వస్తుంటారు. దురదృష్టవశాత్తూ 22 ఏప్రిల్ 2025న అమాయకుల ప్రాణాలే లక్ష్యంగా రెచ్చిపోయిన ముష్కరులు అత్యంత హేయమైన రీతిలో 28 మంది పర్యాటకులను, ప్రత్యేకించి పురుషులను వెతికి,మతంపేరు అడిగి, ముస్లిమేతరులని నిర్ధారణ చేసుకుని కాల్పులు జరిపి పొట్టనబెట్టుకున్నారు. ఈ అమానవీయ ఘటనలో పలువురు తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్నారు. ఈ హింసోన్మాద చర్య మన దేశంతో పాటు ప్రపంచ దేశాలను నివ్వెరపోయేలా చేశాయి. ఈ ఘటనానంతరం, ఇటీవలి ఒకఇంటర్వ్యూలో,స్వయంగా పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ తన దేశం దశాబ్దాలుగా ఉగ్రవాదానికి మద్దతు ఇస్తోందని అంగీకరించిన విషయాన్ని ఉటంకిస్తూ ఐక్యరాజ్యసమితికి భారతదేశ డిప్యూటీ శాశ్వత ప్రతినిధి ఒక కఠినమైన ప్రకటనలో పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తోందని పాకిస్థాన్‌ను ఒక మోసపూరిత దేశంగా అభివర్ణించారు. ఈ కిరాతక చర్య పట్ల స్పందిస్తూ భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ, 28మంది అమాయక పర్యాటకుల ప్రాణాలను బలిగొన్న పహల్గామ్ ఉగ్రవాద దాడికి బాధ్యులను ప్రపంచంలోని ఏ మూలాన దాక్కున్నా, గుర్తించి, వారు కనీసం ఊహించలేని రీతిలో కఠినాతికఠినంగా శిక్షిస్తామని ఆగ్రహాన్ని వ్యక్తంచేసారు.అందుకు కొనసాగింపుగానే చర్యలకు ఉపక్రమించారు. ఉగ్రవాదుల ఏరివేతే లక్ష్యంగా, భారతదేశం ఇప్పటికే సింధూ నదీ జలాల ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేయడం, దేశంలో ఉన్న పాకిస్థాన్ రాయబార సిబ్బందిని, అక్రమ వలసదారులను, వైద్యావసరాలను మినహాయించి స్వల్పకాలిక వీసాదారులను తక్షణమే దేశం వదిలి వెళ్లాలని పలు కీలక ఆదేశాలు జారీచేయడంతోపాటు వివిధరాష్ట్రాలలో ఉన్న పాకిస్థానీలను గుర్తించి వారు దేశం వదిలి వెళ్ళేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాల్సిందిగా కోరింది. పాకిస్థాన్ తన గగనతలాన్ని భారతీయ విమానయాన సంస్థలకు మూసివేయాలని తీసుకున్న నిర్ణయం నేపథ్యంలో భారతదేశం కూడా పాకిస్థాన్‌లో నమోదు చేసుకున్నా లేదా పాకిస్థాన్ సంస్థలు నిర్వహించే పౌర, సైనిక విమానాలకు తన గగనతలాన్ని ఏప్రిల్ 30, 2025 నుండి మే23, 2025వరకు మూసివేసింది. పాకిస్థాన్ ఈ నిర్ణయంతో ఇంధన ఖర్చులు ప్రయాణ సమయం పెరగడంతోపాటు భారతీయ విమానయాన సంస్థలకు ప్రతి



నెలా రూ.307కోట్లు నష్టం వాటిల్లుతుందని భావిస్తున్నారు. ఈ చర్య భారతదేశాన్ని ఇబ్బందిపెట్టడానికి ఉద్దేశించినప్పటికీ, దీనివల్ల వాస్తవానికి పాకిస్థాన్ గణనీయంగా ఆదాయాన్ని కోల్పోయే ప్రమాదం ఉంది. భారతదేశం నుండి పశ్చిమ దిశగా ప్రయాణించే ఎయిర్ ఇండియా, ఇండిగో వంటి భారతీయ విమానయాన సంస్థలు పాకిస్థాన్‌కు భారీ రుసుమును చెల్లిస్తాయి. ఈ చర్యతో పాకిస్థాన్ తన ఓవర్‌ఫ్లైట్ ఆదాయాన్ని భారీగా కోల్పోనుంది. గతంలో పుల్వామా ఉగ్రవాదదాడి తర్వాత తన గగనతలాన్ని మూసివేసిన సందర్భంలో దాదాపు 100 మిలియన్ డాలర్లు నష్టపోయిందని హిందూస్తాన్ టైమ్స్ నివేదించింది. పాకిస్థాన్ గగనతలం గుండా ప్రయాణించేబోయింగ్ 737 విమానాలు దాదాపు 580 డాలర్లు, పెద్ద విమానాలు ఇంకా ఎక్కువ ఓవర్‌ఫ్లైట్ రుసుము చెల్లించాల్సి ఉంటుంది. కాగా, గగనతలం మూసివేత నిర్ణయంతో పాకిస్తాన్ ప్రతిరోజూ దాదాపు 232,000 డాలర్లతో పాటు ల్యాండింగ్, పార్కింగ్ వంటి ఇతర ఛార్జీలను కలిపి రోజువారీ నష్టందాదాపు 300,000డాలర్లుఉంటుందనిఅంచనా. 1960 నాటి సింధూ జలాల ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేయాలని భారత్ తీసుకున్న నిర్ణయం ముఖ్యంగా పాకిస్థాన్ దేశ ఆర్థిక వ్యవస్థలో ప్రధాన భాగమైనవ్యవసాయ రంగంపై గణనీయమైన ఆర్థిక పరిణామాలతో పాటు ఇది పంట దిగుబడి ఆహార భద్రతను ప్రభావితం చేసే అవకాశం ఉంది. ఈనిర్ణయం కారణంగా ఆనకట్టలు బ్యారేజీల నుండి నీటి విడుదలకు సంబంధించిన కీలకమైన సమాచారాన్ని భారతదేశం ఆపివేస్తే అది పాకిస్థాన్ వ్యవసాయ ప్రణాళిక నీటి నిర్వహణకు అనిశ్చితిని సృష్టించవచ్చు. మౌలిక సదుపాయాల పరిమితుల కారణంగా పాకిస్థాన్‌కు నీటి ప్రవాహాన్ని గణనీయంగా నియంత్రించే అవకాశం భారతదేశానికి తక్షణమే లేనప్పటికీ, ఈ నిలిపివేత అనిశ్చితికి భవిష్యత్తులో సంభావ్య ప్రభావాలకు దారితీయవచ్చు. భారత్ ఈనిర్ణయం కారణంగా ఏర్పడే ఆర్థిక ప్రభావం వ్యవసాయం విద్యుత్ రంగాలకు మాత్రమేకాకుండా ఇతర రంగాలతో పాటు పాకిస్థాన్ ఆర్థికవ్యవస్థ మొత్తం స్థిరత్వాన్ని ప్రభావితం చేసే అవకాశం ఉంది. పహల్గామ్ ఉగ్రవాద ఘటనానంతరం భారత్ పాక్ సరిహద్దు రేఖవెంట పాకిస్థాన్ కొనసాగిస్తున్న కవ్వింపు చర్యల నేపథ్యంలో కేంద్రప్రభుత్వం జాతీయ భద్రత సలహా బోర్డును ఏర్పాటు చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడినేపథ్యంలో ఎలాంటి వాతావరణ పరిస్థితులనైనా తట్టుకుని భారతదేశ సరిహద్దులను రక్షణ నిఘాకోసం ప్రత్యేక గూఢచార ఉపగ్రహ ప్రయోగాన్ని భారత అంతరిక్ష సంస్థ వేగవంతం చేస్తోంది.ఉగ్రవాదుల ఏరివేతకు భారత్ మున్నెన్నడూ లేనివిధంగా ప్రతిస్పందిస్తూ వారు కనీవినీ ఎరుగని రీతిలో చర్యలు చేపట్టనున్నట్లు ప్రతినబూనడంతో ప్రపంచదేశాలన్నీ ఊపిరి బిగపట్టి ఇరు దేశాల చర్యలను నిశితంగా గమనిస్తున్నాయి. ●

# 22 మంది న్యాయమూర్తుల ఆస్తులు ఇవీ..

## సిజెఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా బ్యాంక్ ఖాతాలో రూ. 55.75 లక్షల ఎఫ్‌డిలు, పిపిఎఫ్ ఖాతాలో రూ. 1.06 కోట్లు, మూడు ఫ్లాట్లు



**న్యూఢిల్లీ, మే 6:** న్యాయ వ్యవస్థలో పారదర్శకతను పెంపొందించే లక్ష్యంతో తమ ఆస్తులను బహిర్గతం చేయడానికి సుప్రీంకోర్టుకు చెందిన 30 మంది సిట్టింగ్ న్యాయమూర్తులు అంగీకరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జడ్జిలు తమ ఆస్తుల వివరాలను తాజాగా స్వచ్ఛందంగా ప్రకటించారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా సహా 22 మంది న్యాయమూర్తులు తమ ఆస్తుల వివరాలను కోర్టు అధికారి వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. సిజెఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా తన బ్యాంకు ఖాతాలో రూ. 55.75 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉన్నట్లు వెల్లడించారు. పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పిపిఎఫ్) ఖాతాలో రూ. 1.06 కోట్లు ఉన్నట్లు తెలిపారు. అలాగే, సౌత్ ఢిల్లీలో ఒక త్రీబెడ్‌రూమ్ డిడిఎ ఫ్లాట్ ఉన్నట్లు తెలిపారు. దాన్ని ఆయన తన సోదరుడితో కలిసి కొనుగోలు చేసినట్లు చెప్పారు. తర్వాత 2,000లో దాన్ని ఫ్రీహోల్డ్‌గా మార్చారు. ఇక కామన్వెల్త్ గేమ్స్ విలేజ్‌లో రెండు పార్కింగ్ స్థలాలతో కూడిన ఫోర్‌బెడ్ రూమ్ ఫ్లాట్ ఉంది. ఈ ఫ్లాట్‌ను 2004లో తన తండ్రి నుంచి వారసత్వంగా పొందిన ఇంటి అమ్మకం ద్వారా వచ్చిన ఆదాయంతో 2019లో కొనుగోలు చేసినట్లు వివరించారు. వీటితోపాటు గురుగ్రామ్‌లోని సెక్టార్ 49లోని సిస్పాల్ విహార్‌లో కుమార్తెతో కలిసి కొనుగోలు చేసిన మరో ఫోర్‌బెడ్‌రూమ్ ఫ్లాట్ ఉంది. ఇందులో జస్టివ్ సంజీవ్ ఖన్నా వాటా 56 శాతం కాగా.. మిగిలింది 44 శాతం ఆయన కుమార్తెది. ఇక త్వరలో సిజెఐగా బాధ్యతలు చేపట్టనున్న జస్టిస్ బీఆర్ గవాయ్ సైతం తన ఆస్తుల వివరాలను బహిర్గతం చేశారు. తన బ్యాంకు ఖాతాలో రూ. 19.63 లక్షలు, పిపిఎఫ్ ఖాతాలో రూ. 6.59 లక్షలు ఉన్నాయని తెలిపారు. మహారాష్ట్రలోని అమరావతి, నాగ్‌పూర్‌లలోవారసత్వంగా వచ్చిన వ్యవసాయ భూములు, ముంబై, ఢిల్లీలో నివాస అపార్ట్‌మెంట్లు ఉన్నట్లు వెల్లడించారు. వీరితోపాటు పలువురు న్యాయమూర్తులు తమ ఆస్తుల వివరాలను వెల్లడించారు. ఢిల్లీ హైకోర్టు జడ్జీ జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలో ఇటీవలే భారీ స్థాయిలో నోట్ల కట్టలు బయటపడిన అంశం వివాదాస్పదమైన విషయం తెలిసిందే. ఈ ఘటన తర్వాత సుప్రీం న్యాయమూర్తులు కీలక నిర్ణయం తీసుకున్నారు. తమ వ్యక్తిగత ఆస్తుల వివరాలను వెల్లడించేందుకు నిర్ణయించారు. పారదర్శకతతో పాటు ప్రజల్లో న్యాయ వ్యవస్థపట్ల విశ్వాసాన్ని నింపేందుకు ఈ చర్యకు పూనుకున్నారు. డిక్లరేషన్ ద్వారా ఆస్తులు వివరాలను వెల్లడించేందుకు న్యాయమూర్తులు ఏకగ్రీవంగా అంగీకరించారు.

ఏప్రిల్ ఒకటో తేదీన జరిగిన ఫుల్ కోర్టు మీటింగ్‌లో ఈ నిర్ణయం తీసుకున్నారు. భారత ప్రధాన న్యాయమూర్తికి తమ ఆస్తులు వివరాలను వెల్లడించేందుకు జడ్జీలు నిర్ణయించారు. తమ ఆస్తులను సుప్రీంకోర్టు అధికారిక వెబ్ సైట్‌లో ప్రచురించేందుకు ప్రధాన న్యాయమూర్తితోసహా న్యాయమూర్తులందరూ ఆమోదం తెలిపారు. తమ ఆస్తులను బహిర్గతం చేయడానికి సుప్రీంకోర్టుకు చెందిన 30మంది సిట్టింగ్ న్యాయమూర్తులు అంగీకరించారు. ప్రస్తుతం 22 మంది జడ్జిలు తమ ఆస్తుల వివరాలను వెబ్ సైట్‌లో పొందుపరిచారు. కాగా, గత సంప్రదాయాలకు పూర్తి భిన్నంగా సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇది భవిష్యత్తు న్యాయమూర్తులకు కూడా వర్తిస్తుంది. ఇక ప్రతి సంవత్సరం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు తమ ఆస్తుల వివరాలను వెల్లడించాల్సి ఉంటుంది.

గతంలో న్యాయమూర్తులు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ)కి తమ ఆస్తుల వివరాలు అందచేసేవారు. అది కూడా తప్పనిసరి కాదు. న్యాయమూర్తులు స్వచ్ఛం దంగా తమ ఆస్తులను బహిర్గతం చేసేవారు. కాగా, తాజా నిర్ణయానికి సంబంధించిన తీర్మానం ఇంకా కోర్టు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ కాలేదు. ఇటీవల ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో మంటలు చెలరేగి కాలిపోయిన కరెన్సీ కట్టలు కనిపించటం తీవ్ర కలకలం రేపింది.



# అమెరికా నుంచి వెళ్తే 1000 డాలర్లు ఇస్తాం

## అక్రమ వలసదారులకు ట్రంప్ సర్కార్ కొత్త ఆఫర్

**వాషింగ్టన్, మే 6:** ఎలాంటి పత్రాలు లేకుండా అమెరికాలో ఉంటున్న వలసదారులకు ట్రంప్ సర్కార్ బంపర్ ఆఫర్ ప్రకటించింది. స్వచ్ఛందంగా యూఎస్ నుంచి వెళ్లాలని అనుకునే వలసదారులకు 1000 డాలర్లు ఇస్తామని పేర్కొంది.ప్రయాణ ఖర్చులు కూడా చెల్లిస్తామని హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ విభాగం ప్రకటించింది. స్వచ్ఛందంగా అమెరికా నుంచి వెళ్లాలని అనుకునే వారి ప్రయాణ ఖర్చులు కూడా తామే భరిస్తామని తెలిపింది. ఎవరైతే స్వచ్ఛందంగా వెళ్లాలని అనుకుంటారో, వారు సిబిపి హోమ్ యాప్ ద్వారా అధికారులకు ఆ విషయం తెలపాలని సూచించింది. ఇలా స్వచ్ఛందంగా వెళ్లేవారిని ఇమ్మిగ్రేషన్ అధికారులు నిర్బంధించడం, బహిష్కరించడం లాంటివి చేయరని పేర్కొంది.

మీరు అమెరికాలో చట్టవిరుద్ధంగా ఉంటే, స్వచ్ఛందంగా తిరిగి మీ స్వదేశానికి వెళ్లడం మంచిది. అప్పుడే మీరు అరెస్ట్ నుంచి తప్పించుకోగలుగుతారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ వాళ్లు ఇప్పుడు సిబిపి హోమ్ యాప్ ద్వారా అక్రమ వలసదారు లకు ఆర్థిక సాయం చేస్తోంది. ముఖ్యంగా వలసదారులు తమ స్వదేశానికి వెళ్లడానికి స్టైఫండ్ అందిస్తుందని డిహెచ్ఎస్ సెక్రటరీ క్రిస్టి నోయెమ్ ప్రకటించారు. డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్ష ఎన్నికల సమయంలోనే అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపుతానని చెప్పారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ దేశ చరిత్రలోనే అతిపెద్ద బహిష్కరణ ఆపరేషన్ ప్రారంభించారు. అయితే ఈ ప్రక్రియ చాలా క్లిష్టమైనది, అత్యంత ఖరీదైనది కూడా.

అందుకే రిపబ్లికన్ ప్రభుత్వం ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కోసం నిధులు పెంచాలని కాంగ్రెస్‌ను కోరు తోంది. 2025 జనవరి నుంచి ఇప్పటి వరకు మొత్తం 388 మంది భారతీయ పౌరులను అమెరికా బహిష్కరించింది. వారిలో 333 మందిని ఫిబ్రవరిలో మూడు వేర్వేరు విమా నాల్లో అమెరికా నుంచి భారత్‌కు పంపించింది. మిగిలిన 55 మంది భారతీయ పౌరులను వాణిజ్య విమానాల్లో పనామా ద్వారా పంపించారు అని భారత విదేశాంగ శాఖ సహాయమంత్రి కీర్తివర్ధన్ సింగ్ లోక్‌సభకు లిఖితపూర్వకంగా తెలియజేశారు.

# చిన్మయ కృష్ణదాస్ మళ్లీ అరెస్టు

## బంగ్లాలో వెల్లువెత్తిన హిందూ మైనార్టీల నిరసనలు

**ఢాకా, మే 6:** బంగ్లాదేశ్‌లో ఇస్కాన్ ప్రబోధకుడు చిన్మోయ్ కృష్ణదాస్‌ను మరోసారి అక్కడి పోలీసులు అరెస్టు చేశారు. మైనారిటీలను రక్షించాలని ఆందోళనలు చేపట్టి దేశ ద్రోహం కేసులో అరెస్టయిన చిన్మోయ్ కృష్ణదాస్‌కు ఇటీవలే బెయిల్ లభించింది. ఈ నేపథ్యంలో ఆయన్ను మళ్లీ పోలీసులు మరో కేసులో అరెస్ట్ చేసినట్లు సమాచారం. గతేడాది నవంబర్ 7న కోర్టు ప్రాంగణంలో న్యాయవాది సైఫుల్ ఇస్లాం అలీఫ్‌పై నిరసనకారులు దాడిచేసి, హత్య చేసిన కేసులో ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే చిన్మోయ్ కృష్ణదాస్‌కు బెయిల్ మంజూరు చేయాలన్న హైకోర్టు ఉత్తర్వుపై అక్కడి సుప్రీం కోర్టు స్టే విధించినట్లు సమాచారం. కృష్ణదాస్‌పై నమోదైన కేసులపై వర్చువల్ విచారణ తర్వాత సోమవారం ఆయనను అరెస్ట్ చేయడానికి సుప్రీంకోర్టు అనుమతించింది. మిగిలిన కేసులపై మంగళవారం విచారణ జరగనుంది. బంగ్లాదేశ్‌లో ఇస్కాన్ ప్రచారకర్తగా పనిచేస్తున్న చిన్మయ్ కృష్ణదాస్ గతేడాది నవంబరులో చిట్టగాంగ్‌లో జరిగిన ఓ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ క్రమంలో బంగ్లాదేశ్ జెండాను ఉద్దేశించి పలు వివాదాస్పద వ్యాఖ్యలు చేసినట్లు అభియోగాలు వచ్చాయి. దీంతో నవంబరు 25న ఢాకా విమానాశ్రయంలో ఆయనను పోలీసులు అరెస్టు చేశారు.

అనంతరం జైలుకు తరలించారు. ఆయన తరఫున వాదనలు వినిపించేందుకు ఓ న్యాయవాది ప్రయత్నించగా, ఆయనపై ఆందోళనకారులు దాడి చేశారు. మరో సీనియర్ న్యాయవాది కేసును టేకప్ చేయగా, ఆయనపైనా కూడా బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో చిన్మయ్ కేసును వాదించేందుకు ఎవరూ ముందుకురాలేదు. చివరకు చిన్మయ్ భాగస్వామిగా ఉన్న సమ్మిళిత సనాతన జాగరణ్ జోతే అనే సంస్థ 11 మందితో లాయర్ల బృందాన్ని ఏర్పాటుచేసింది. ఈ క్రమంలోనే ఆయనకు ఊరట లభించింది. ఇటీవల కృష్ణదాస్‌కు బంగ్లాదేశ్ హైకోర్టు బెయిల్ మంజూరు చేయగా, తాజాగా మరోకేసులో అరెస్ట్ చేయడం జరిగింది. కాగా, షేక్ హసీనా ప్రభుత్వం కూలిపోయిన దగ్గరి నుంచి భారత్‌బంగ్లా మధ్య సంబంధాలు ఒడుదొడుకులు ఎదుర్కొంటున్నాయి. ఈ చిన్మయ్ కృష్ణదాస్ అరెస్టు కూడా అందుకు ఓ కారణమైంది.

# యుఎన్ కౌన్సిల్‌లో పాక్‌పై ప్రశ్నల వర్షం



**న్యూయార్క్, మే 6:** పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్ పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలపై ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలో అంతర్గత చర్చ జరిగింది. అయితే ఇందులో పాక్‌కు సభ్యదేశాలు కఠిన ప్రశ్నలు సంధించినట్లు తెలిసింది. పహల్గాం ఉగ్రదాడిని దృష్టి మళ్లించేందుకు పాకిస్థాన్ కశ్మీర్ అంశాన్ని ప్రస్తావించగా భారత్ గట్టిగా బదులిచ్చింది. సభ్యదేశాలు కూడా పహల్గాం ఉగ్ర దాడిని ముక్తకంఠంతో ఖండించాయి. ఉగ్రదాడికి బాధ్యత ఎవరు వహిస్తారని సభ్య దేశాలు పాక్‌ను ప్రశ్నించినట్లు తెలిసింది. అలాగే ఉద్రిక్తతలు పెరిగేలా పాకిస్థాన్ వరుసగా క్షిపణి పరీక్షలు నిర్వహించడంపైనా నిలదీసినట్లు సమాచారం.ఐరాస సెక్యూరిటీ కౌన్సిల్‌లోని 15 సభ్య దేశాల్లో పాకిస్థాన్ ఒకటి. ఆ దేశం అభ్యర్థన పైనే ఈ సమావేశం జరిగింది. తన సభ్యత్వాన్ని అడ్డంపెట్టుకొని భారత్ వ్యతిరేక తీర్మానం చేయాలని తొలుత భావించింది. కానీ, ఈ ప్రయత్నాలు బెడిసికొట్టి దానికే ఎదురు క్లాస్ తీసుకొన్నాయి. దాదాపు గంటన్నర జరిగిన ఈసమావేశం ఎలాంటి నిర్ణయం, తీర్మానాలు లేకుండానే ముగిసింది. ఐక్యరాజ్యసమితి కూడా ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇరుదేశాలు చర్చల ద్వారా శాంతియుత పరి ష్కారం తీసుకురావాలని భద్రతా మండలి సభ్య దేశాలు పిలుపునిచ్చాయని ఐరాస ప్రతినిధి మహమ్మది ఖిలారీ వెల్లడించారు. బహిరంగంగా అణు బెదిరింపులకు దిగుతున్న పాకిస్థాన్‌పైచాలా సభ్యదేశాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఇటీవల పాకిస్థాన్ క్షిపణి పరీక్షలు నిర్వహించడాన్ని కూడా ప్రశ్నించాయి. అది ఉద్రిక్తతలు పెంచి ప్రాంతీయ అస్థిరతకు దారి తీస్తుందని ఆందోళన వ్యక్తం చేశాయి. అదే సమయంలో భారత్ కుట్రపన్ని పహల్గాం తనకు తానే దాడి చేసుకొని ఫాల్స్ ఫ్లాగ్ ఆపరేషన్ పాక్‌పై నిందలు మోపుతోందన్న వాదనలను కూడా సభ్యదేశాలు తోసిపుచ్చాయి. ఉగ్రదాడికి పాల్పడిన వారు జవాబుదారీగా ఉండాలంటూ తేల్చి చెప్పాయి.

పహల్గాం దాడిలో లష్కరే తోయిబా పాత్రను కూడా ఐరాస భద్రత మండలి సభ్య దేశాలు ప్రశ్నించాయి. అంతేకాకుండా ఉగ్రవాదులు మతం ఆధారంగా అమాయ ప్రజలను చంపడంపై ఆందోళన వ్యక్తం చేశాయి. అయితే పాకిస్థాన్ ఈ అంశాన్ని అంతర్జాతీయం చేద్దామనుకొంది. అయినా ఏ దేశమూ దానితో చేయి కలపలేదు. దీంతో ఏ తీర్మానం లేకుండానే సమావేశం ముగిసింది. చివరికి చైనా కూడా భేటీ అనంతరం ప్రెస్ స్టేట్‌మెంట్‌లో పాలుపంచుకోలేదు. భారత్‌తో ద్వైపాక్షిక చర్చల ద్వారానే సమస్యలను పరిష్కరించుకోవాలని పాక్‌కు చాలా దేశాలు సలహా ఇచ్చాయి. పాక్ తరఫున ఐరాస శాశ్వత ప్రతినిధి అసీమ్ ఇఫ్తికార్ అహ్మద్ హాజరయ్యారు. భద్రతా మండలి సభ్య దేశాల నుంచి కఠిన ప్రశ్నలు ఎదుర్కొన్న పాకిస్థాన్ ప్రతినిధి ఇఫ్తికార్ మాత్రం మేకపోతు గాంభీర్యం ప్రదర్శించారు. సమావేశంలో తమ లక్ష్యాలు నెరవేరాయని చెప్పారు.

# గుజరాత్ భారీ వర్షాలకు 14 మంది మృతి


## 16 మందికి గాయాలు, మరో తుపాను ఉందని హెచ్చరిక

**అహ్మదాబాద్, మే 6:** ఉరుములు మెరుపులతో కూడిన అకాలవర్షాలు గుజరాత్‌ను అతలాకుతలం చేసాయి. ఇప్పటివరకూ 14 మంది చనిపోగా 16 మంది గాయాలపాలయ్యారు. 26 పశువులు కూడా చనిపోయినట్లు తేలింది. ఏడు ఇళ్లు ధ్వంసం అయ్యాయని అధికారులు వెల్లడించారు. ఐఎండి మరింతగా సంక్షోభం ఉంటుందని, ఉరుములు మెరుపులు పిడుగులతో కూడిన వర్షాలు తప్పవని హెచ్చరించింది. గంటకు 60 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, మరికొన్ని రోజులపాటు ఇదే వాతావరణం ఉంటుందని చెప్పారు. గడచిన 24 గంటల్లో మరింత తీవ్రస్థాయిలో విజృంభించింది. మొత్తం 253 తాలూకాల్లో 168 తాలూకాలు ఈ అకాలవర్షాలకు దెబ్బతిన్నాయి. ఖేడా, గాంధీ నగర్, మెహసానా, వదోదర జిల్లాల్లో 25 నుంచి 40 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. దుమ్ము తుపానుకొన్ని చోట్ల ఇసుక దుమారం మరికొన్నిచోట్ల ఎక్కువగా పిడుగులతో కూడిన వర్షాలు కురిసాయి. మౌలికవనరులు భారీగా దెబ్బతిన్నట్లు తేలింది. భారీహోర్డింగ్‌లు కూలిపోయాయి. ఇళ్లు దెబ్బతిన్నాయి. దహోద్‌లోని లింఖేడాలో మరింతగా నష్టంజరిగింది. చెట్లుకూలి మీదపడటంతో నలుగురుచనిపోయారు. హోర్డింగ్‌లు పడటం వల్ల వాటికింద ఇద్దరు నలిగిపోయి మృతిచెందారు. మరో ముగ్గురు పిడుగుపాటుకు చనిపోయారు. మరో ఇద్దరు విద్యుదాఘాతంవల్ల చనిపోయినట్లు తేలింది.తమ ఇళ్లల్లో కొంత భాగం దెబ్బతినడం వల్ల ముగ్గురు చనిపోయారు. ఖేడా, వదోదర, అహ్మదాబాద్, దహోద్, ఆరవల్లి, ఆనంద్‌జిల్లాల్లోనే ఈ మరణాలు చోటుచేసుకున్నాయి. ఒక్క ఖేడా జిల్లాలోనే నలుగురుచనిపోయారు. ప్రతిపక్షనాయకుడు అమిత్ చావ్‌డా బిజెపి ప్రభుత్వంపై ధ్వజమెత్తారు.ప్రకృతి వైపరీత్యాల్లో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని తేలింది. మృతుల కుటుంబాలకు 10 లక్షలచొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్‌చేసారు. దెబ్బతిన్న పంటలకు పరిహారం ఇవ్వడంతోపాటు వారికి బీమా కల్పించాలని అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్లు తెరవాలని డిమాండ్‌చేసారు. మరింతగా తుపాను వచ్చే ప్రమాదం ఉన్నందున రాష్ట్రంలోని రైతులకు తీవ్రనష్టం కలుగుతుందని రైతు నాయకుడు సాగర్ రాబారి హెచ్చరించారు.

# నిఘా హెచ్చరికలున్నా పహల్గాంకు అదనపు బలగాలు ఎందుకు పంపలేదు?

## ప్రధాని మోడీపై ఎఐసిసి చీఫ్ మల్లిఖార్జున్ ఖర్గే విమర్శలు

**రాంచి, మే 6:** పహల్గాం ఉగ్రదాడిపై మూడు రోజుల ముందే కేంద్రానికి ఇంటిలిజెన్స్ రిపోర్ట్ అందిందని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ఆరోపించారు. ఉగ్రదాడి జరుగుతుందని ఇంటిలిజెన్స్ వర్గాలు హెచ్చరికల వల్లే ప్రధాని మోదీ తన పర్యటనను రద్దు చేసుకున్నారని విమర్శించారు. ఇంటిలిజెన్స్ వర్గాలు ముందే హెచ్చరించినా పహల్గాంలో అదనపు బలగాలను ఎందుకుమోహరించలేదని కేంద్రాన్ని ప్రశ్నించారు. ఝార్ఖండ్ రాజధాని రాంచీలో జరిగిన సంవిధాన్ బచావో ర్యాలీలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలుచేశారు. పహల్గాం ఉగ్రదాడికి మూడు రోజుల ముందే ప్రధాని మోదీకి ఇంటిలిజెన్స్ రిపోర్ట్ అందిందని నాకు తెలిసింది. ఈ రిపోర్ట్ వల్లే ఆయన కశ్మీర్ పర్యటనను రద్దు చేసుకున్నారు. మీరు అక్కడికి వెళ్లడం మంచిది కాదని ఇంటిలిజెన్స్ ముందే హెచ్చరిస్తే అక్కడ



ఉన్న పర్యాటకులు, పౌరులు జాగ్రత్తల కోసం ఎందుకు సరైన చర్యలు తీసుకోలేదు. ఒకవేళ మీకు ముందు సమాచారం ఉంటే అదనపు బలగాను అక్కడికి ఎందుకు పంపించలేదు. ఏ నిర్ణయం తీసుకున్నా కాంగ్రెస్‌పార్టీ మద్దతు పార్టీలకన్నా దేశమే ముఖ్యమన్నఖర్గే, పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా ఎలాంటి నిర్ణయం తీసుకున్నా కాంగ్రెస్ పార్టీ మద్దతు ఇస్తుందని చెప్పారు. ఇందిరా గాంధీ, మహాత్మా గాంధీ దేశం కోసం ప్రాణాలు అర్పించారని, సోనియా గాంధీ దేశం కోసం ఎంతో చేశారని గుర్తు చేశారు. సోనియా గాంధీ రెండు సార్లు ప్రధానమంత్రి పదవిని వదులుకున్నారని అన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థలను మూసివేయడమే మోడీ ప్రభుత్వ పాలసీ అని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ సామాజిక వర్గాల నుంచి ఉద్యోగాలను లాగేసుకుంటుందని విమర్శించారు. రిజర్వేషన్లపై ఉన్న 50శాతం కోటాను తొలగించేందుకు రాజ్యాంగ సవరణ చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన నాయకులను బెదిరించే చర్యలను మోడీ పాల్పడకూడదని తెలిపారు. తాము పేద ప్రజలు, గిరిజనుల అభివృద్ధి కోసం పోరాడుతున్నామని అన్నారు.

# బయటిశక్తులే ముర్షిదాబాద్ అల్లర్లకు మూలం

## ప్రలోభాలకు లొంగవద్దన్న మమతా బెనర్జీ

**ముర్షిదాబాద్(బెంగాల్), మే 6:** అల్లర్లు, ఉద్రిక్తతలు, హింస చెలరేగిన ముర్షిదాబాద్‌ప్రాంతాల్లో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పర్యటించారు. బయటినుంచి వచ్చిన శక్తులే ఈ అల్లర్లను రెచ్చగొట్టారని ఆరోపించారు. ఎవరైతే ఈ అల్లర్లకు కుట్రలు పన్నారో వారందరినీ చట్టంముందుకు తెస్తామని మమతా హెచ్చరించారు. రాష్ట్రప్రజలు చీలికలకు పోకుండా సమైక్యంగా నిలవాలని ఆమె పిలుపునిచ్చారు. బిజెపి మత ఛాందసవాదంలో ఎవ్వరూ పడిపోవద్దని ఆమె పిలుపునిచ్చారు. ఆందోళనకారులు, కుట్రదారులు బెంగాల్‌కు చెందినవారు కాదని, వారంతా బయటినుంచి వచ్చారని, బిజెపిమాటవిని మీకుమీరే వేరుగా చీలిపోవద్దని ఆమె విజ్ఞప్తిచేసారు. బయటివ్యక్తుల మాటలు వినవద్దని ఆమె ముర్షిదాబాద్ పర్యటనలో పిలుపునిచ్చారు. బాబ్రి మసీదు కూల్చివేత సమయంలో కూడా ముర్షిదాబాద్‌లో ఎలాంటి అల్లర్లు జరగలేదన్నారు. వక్ఫ్‌సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఎవ్వరూ హింసాత్మక నిరసనలకు పోవద్దని ఆమె సూచించారు. బెంగాల్‌లో ఈ చట్టాన్ని అమలుచేసే ప్రశ్నేలేదన్నారు. రెండు రోజులపాటు అల్లర్లు జరిగిన ముర్షిదాబాద్ ప్రాంతాల్లో ఆమె పర్యటించారు. తాను శాంతిని కోరుకుంటానని, పశ్చిమబెంగాల్ మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని అందుకు తాము నిరంతరం కట్టుబడిపనిచేస్తామన్నారు. ప్రజల్లో మతవిద్వేషాలను ఎందుకు భారీగా చొప్పిస్తున్నారని ఆమె బిజెపి నాయకులను విమర్శించారు. దేశరక్షణకోసం కాకుండా మతపరమైన ఉద్రిక్తతలను కేంద్రం కూడా ప్రోత్సహిస్తోందని ఆమె మండిపడ్డారు.

ముందు మన సరిహద్దులను పరి రక్షించాలని మన మాతృభూమి పరిరక్షణకు ఎంతకైనా తెగించాల్సిందేనని ఆమె అన్నారు. పహల్గాం దాడుల్లో చనిపోయినవారి కుటుంబాలను ఆదుకోవాలని ఎలాంటి మురికిరాజకీయా లకు తావీయకుండా ఈదాడికి ప్రతీకారం తీర్చుకోవాల్సిందేనని ఆమె అన్నారు. అలాగే ముర్షిదాబాద్ నిరసనకారులపై బిఎస్ఎఫ్ కాల్పులుజరపడాన్ని కూడా ఆమె తీవ్రంగా వ్యతిరేకించారు.

# 'మిసైల్ వార్'లో ఎవరి బలం ఎంత?

## భారత్‌తో పోలిస్తే దాయాది దేశం క్షిపణులు దిగదుడుపేనంటున్న నిపుణులు

**హైదరాబాద్, మే 6, ప్రభాతవార్త:** పహల్గాం ఉగ్రదాడి తరువాత భారత్, పాకిస్తాన్‌ల మధ్య ఉద్రిక్తత పరిస్థితులు రోజురోజుకు పెరిగి పోతుండడం తెలిసిందే. ఈ క్రమంలో భారత్ సైన్యాన్ని సర్వసన్నద్ధం చేస్తుండగా పాక్ ఒక అడుగు ముందుకేసి ఏకంగా క్షిపణులను ప్రయోగిస్తూ కవ్వింపులకు దిగుతోంది. ఈ నేపథ్యంలో మిస్సైల్ వార్‌లో భారత్, పాక్‌లలో ఏ దేశం సామర్థ్యం ఎంత అనే దానిపై పరిశీలించిన అంతర్జాతీయ రక్షణ రంగ నిపుణులు భారత్‌తో పోలిస్తే దాయాది దేశం క్షిపణులు దిగదుడుపేనని తేల్చేశారు. పాకిస్తాన్ మూడు రోజుల క్రితం అబ్దాలీ అనే బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించింది. సాయుధ దళాల యుద్ధ సన్నద్ధతను పరిశీలించే నిమిత్తం ఈ పరీక్ష నిర్వహించినట్లు పాక్ చెప్పుకుంది. భారత్‌ను ఈ క్షిపణి ద్వారా టార్గెట్ చేయగలమని పాక్ సైన్యాధికారులు తెలిపారు. పాక్ పరిశీలించిన అబ్దాలీ క్షిపణిని హాత్ఫ్ 2 అని కూడా పిలుస్తారు. దీనిని పాక్ స్పేస్ రీసర్స్ కమిషన్ తయారు చేసింది. భూమిపై నుంచి ప్రయోగించే ఈ బాలిస్టిక్ క్షిపణి 450 కిలోమీటర్ల దూరంలోని ఉపరితల లక్ష్యాలను చేధిస్తుంది. ఇందులో అత్యాధునిత నావిగేషన్ వ్యవస్థ వున్నప్పటికీ అణువార్ హెడ్‌లను మోయగలిగే సామర్థ్యం దీనికి లేదు. దీంతో పాటు పాక్ వద్ద గల బాబర్ క్షిపణి 700 కిలోమీటర్లు, ఘజ్నవీ 300 కిలోమీటర్లు, షాహీన్ 2750 కిలోమీటర్ల దురం వరకు లక్ష్యాలను




చేధించగలవు. అయితే ఈ క్షిపణులు భారత నావిగేషన్, రాడార్ వ్యవస్థలను దాటుకుని భారత్‌లోకి రావడం అంత సులభం కాదని నిపుణులు అంటున్నారు. ఇక భారత్ వరకు వస్తే బ్రహ్మోస్, అగ్ని 5, ప్రళయ్, పృథ్వీ 2 క్షిపణులు పాక్‌లోని అన్ని నగరాలను నిమిషాల వ్యవధిలో తాకగలిగే సామర్థ్యం కలిగి వున్నాయి. ఇందులో అగ్ని 5 క్షిపణి ఎనిమిది వేల కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఐదు నుంచి పది నిమిషాల వ్యవధిలోనే చేధించగలదు. ఈ క్షిపణి టన్ను బరువు కలిగిన వార్ హెడ్‌లను మోసుకెళ్ల కలదు. భారత్ వద్ద వున్న అత్యంత శక్తివంతమైన దీర్ఘశ్రేణి క్షిపణిగా దీనికి పేరుంది. ఇక సబ్‌మెరైన్ నుంచి ప్రయోగించకలిగే కే 4 ఎస్ఎల్‌బీఎం 3500 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను కూడా సులభంగా చేధించగలదు. ఈ క్షిపణితో అణుబాంబులను కూడా ప్రయోగించ వచ్చు. పాక్‌లో రక్షణ వ్యవస్థలు ఎక్కువగా వున్న రావల్పిండి, ఇస్లామాబాద్ నగరాలను ఈ క్షిపణి ఐదు నిమిషాల వ్యవధిలో ధ్వంసం చేయగలదు. దీని తరువా త సూపర్ సానిక్ క్రూయిజ్ క్షిపణి బ్రహ్మోస్ ధ్వనికి మూడు రెట్లు సమానమైన వేగంతో ప్రయాణించి శత్రుదేశ లక్ష్యాలను కచ్చితత్వంతో నాశనం చేయగలదు. దీంతో పాటు వెయ్యి కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను చేధించగల నిర్భయ్ శత్రుదేశాల రక్షణ వ్యవస్థల నుంచి తప్పించుకుని, ఆ దేశ రాడార్ వ్యవస్థల కళ్లుగప్పి లక్ష్యాలను తుత్తినీయలు చేయగలదు. ఇక ఉపరితల లక్ష్యాలను చేధించడల ప్రళయ్ పరిధి 150 కిలోమీటర్లు. ఇది శత్రు దేశ లక్ష్యాలను కచ్చితత్వంతో కూల్చగలదు. ఇక వైమానిక శక్తిలో భారత్ ముందు పాక్ దిగదుడుపే. భారత వైమానిక దళంలో విమానాల సంఖ్య 2229 వీటిలో యుద్ధ విమానాలు 513. ఇక పాక్ వద్ద వున్న యుద్ధ విమానాల సంఖ్య 328. భారత్ వద్ద రఫేల్, సుఖోయ్, మిగ్ విమానాలు వుంటే పాక్ వద్ద జె 17, ఎఫ్ 16 రకం యుద్ధ విమానాలు వున్నాయి.

# జర్మనీ ఛాన్సలర్‌పదవికి ఫ్రెడ్రిక్ మెర్జ్ విఫల యత్నం

## ఆరు ఓట్ల తేడాతో ఓటమి

**బెర్లిన్, మే 6:** రెండోప్రపంచ యుద్ధం తర్వాత జర్మనీలో జరిగిన ఓటింగ్‌లో కన్సర్వేటివ్‌నాయకుడు ఫ్రెడ్రిక్ మెర్జ్ పదో ఛాన్సలర్‌గా ఎన్నికయ్యేందుకు విఫల యత్నంచేసారు. కేవలం ఆరుఓట్ల తేడాతో మంగళవారం ఆయన ఓటమి చవిచూసారు. వాస్తవానికి ఆయన అత్యంత సునాయాసంగా గెలుస్తారన్న అంచనాలున్నాయి. దేశం మొత్తం కూడా ఇదే అంచనాతో ఉన్నారు. ఛాన్సలర్ పదవికి పోటీలో ఉన్న వ్యక్తి ఇప్పటివరకూ చరిత్రలో మొదటి బ్యాలట్‌లో ఎప్పుడూ ఓటమి చెందలేదు. రెండోప్రపంచ యుద్ధకాలంనుంచి కూడా అదే జరుగుతోంది. ఈ ఓటమితో స్టాక్ మార్కెట్లకు కూడా విఘాతం కలిగింది. జర్మనీ డాక్స్ 1.8శాతం క్షీణించింది. మెర్జ్‌కు 630 ఓట్లలో 316 ఓట్లు రావాల్సి ఉంది. అయితే ఆయన కేవలం 310 ఓట్లు మాత్రమే రాబట్టుకోగలిగారు. తన సంకీర్ణం పరిధిలో ఉన్న 328 ఓట్లను కూడా ఆయన రాబట్టుకోలేకపోయారు. ఓటింగ్‌మొత్తం రహస్య బ్యాలెట్ పద్ధతిలోజరిగింది. మెర్జ్ శిబిరం నుంచి ఎంతమంది ఎంపిలు ఫిరాయించారన్నది కూడా స్పష్టత రావడంలేదు. మెర్జ్ సంకీర్ణ కూటమి తన వామపక్ష నరకిస్టియన్ డెమొక్రటిక్ యూనియన్, బవేరియన్ సిస్టర్‌పార్టీ క్రిస్టియన్ సోషల్ యూనియన్‌ల ఆధ్వర్యంలోనే నడుస్తోంది.



వీరితోపాటు సోషల్ డెమొక్రాట్లుకూడా కలిసారు. ప్రస్తుతం పదవినుంచి దిగిపోతున్న ఓలాఫ్ షోల్జ్‌పార్టీ సోషల్ డెమొక్రాట్లు కూడా ఈ సంకీర్ణ కూటమికి మద్దతునిచ్చారు. ఆరుఓట్లతో ఓటమితో ఇపుడు కూటమిలోని అన్ని పార్టీలు కూడా భేటీ అయి భవిష్యత్తుకార్యాచరణపై చర్చలు జరుపుతున్నారు.

మరోపక్క యూరోపియన్ యూనియన్ 27 దేశాల కూటమికి అధినేతగా కూడా మెర్జ్ కృషిచేస్తున్నారు. షోల్జ్ ప్రభుత్వం ఇందుకోసం విఫలయత్నం చేసింది. కొత్తప్రభుత్వం ఏర్పాటయ్యేంతవరకూ ఇపుడు షోల్జ్ కేర్‌టేకర్ ప్రభుత్వ పెద్దగా కొనసాగుతారు. ప్రపంచం మొత్తం సంక్షోభంలోకి పోతోందని, యూరోపియన్ కూటమికి పటిష్టమైన శక్తివంతమైన జర్మనీ అవసరం ఉందని మెర్జ్ ఈసందర్భంగా వెల్లడించారు.

# తెలుగు రాష్ట్రాల రైల్వే జోన్‌లో మాక్ డ్రిల్

**గుంతకల్లు రైల్వే,మే 6,ప్రభాతవార్త** పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం భారత్-పాక్‌ల మధ్య ఏర్పడిన ఉద్రిక్తతలు నేపథ్యంలో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జారీ చేసిన కీలక ఆదేశాల మేరకు తెలుగు రాష్ట్రాల రైల్వే జోన్‌లో చేపట్టిన మాక్ డ్రిల్ కార్యక్రమాన్ని నేడు నిర్వహించనున్నట్లు రైల్వే తెలిపింది. యుద్ధ పూర్వ సంసిద్ధత చొరవలో భాగంగా పౌర రక్షణ కార్యక్రమం కింద చేపట్టిన యుద్ధ పూర్వ సన్నద్ధత చొరవలో భాగంగా తెలుగురాష్ట్రాల్లోని దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలోని కాచిగూడ(హైదరాబాద్ డివిజన్), రాయచూర్(గుంతకల్లు డివిజన్), ఔరంగబాద్(నాందేడ్ డివిజన్) గుర్తించబడిన రైల్వే స్టేషన్ల వద్ద పౌరరక్షణ (సివిల్ డిఫెన్స్) కార్యక్రమంలో ద్వారా నేడు(2025 మే 7న బుధవారం) సమగ్ర పౌర రక్షణ మాక్‌డ్రిల్ నిర్వహించనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. ఈ డ్రిల్‌ను జోనల్ రైల్వే సివిల్ డిఫశ్రీన్స్ కంట్రోలర్ ఉదయనాథ్ కోట్లా గారి పర్యవేక్షణలో పౌర రక్షణ వాలంటీర్లు, బోధకులు సంబంధిత సిబ్బంది బృందంతో కలిసి నిర్వహించనున్నారు. వారు అత్యవసర సంసిద్ధత అంతర్-ఏజెన్సీ సమన్వయాన్ని అంచనా వేయడానికి శత్రుదాడి దృశ్యాన్ని అనుకరించాలి. ఈవ్యాయామంలో కీలకమైన అంశాలు : వైమానిక దాడుల హెచ్చరిక సైరన్‌లను సక్రియం చేయడం, ప్రమాద బ్లాక్ అవుట్ చర్యల అమలు, తరలింపు ప్రణాళిక రిహార్సల్స్, అగ్నిమాపక, ప్రాథమిక లైఫ్ సపోర్ట్(బి.ఎల్.ఎస్) రెస్క్యూ ఆపరేషన్లతో సహా పౌర రక్షణ సేవల సంసిద్ధత పరీక్ష మొదలైనవి. సంబంధిత అన్ని విభాగాలు పాల్గొంటాయి. వాటి సంబంధిత ప్రదేశాలలో మాక్‌డ్రిల్ సజావుగా జరిగేలా చూసుకోవాలి. అదనంగా సివిల్ డిఫెన్స్ మార్గదర్శకాలకు అనుగుణంగా, డ్రిల్ సమయంలో రైల్వే స్టేషన్లలో బ్లాక్ అవుట్ చర్యలు అమలు చేయబడతాయి. వీటిలో అనవసరమైన లైటింగ్‌ను ఆపివేయడం, కిటికీలను కప్పడం వంటివి ఉంటాయి. యుద్ధ సమయంలో అత్యవసర పరిస్థితి ఏర్పడినప్పుడు రైల్వే సిబ్బంది మౌలిక సదుపాయాల యొక్క మొత్తం అత్యవసర ప్రతిస్పందన చట్రాన్ని సంసిద్ధతను బలోపేతం చేయడం ఈ వ్యాయామం యొక్క ప్రధాన ఉద్దేశ్యమని సంబంధిత ఉన్నతాదికారులు తెలిపారు.

# తాడిపత్రికి వెళ్లనున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

## వస్తే అడ్డుకుంటా: జెసి ప్రభాకర్ రెడ్డి

### జిల్లా పోలీసు అధికారుల స్పందన పై ఉత్కంఠ



ఎస్పీ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడుతున్న వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకట్రామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

**అనంతపురం, మే 6,(ప్రభాతవార్త బ్యూరో)** అనంతపురం జిల్లా తాడపత్రి పట్టణంలోని తన నివాసానికి కుటుంబ సభ్యులతో కలిసి వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఈనెల 8 వతేదిన వెళ్లేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు అనంతపురం డిఐజి, అనంతపురం ఎస్పీలకు మెయిల్స్ ద్వారా, వాట్సాప్ ద్వారా సమాచారం ఇచ్చినట్లు తెలియ వచ్చింది. తాడపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడపత్రి పట్టణము, తాడపత్రి నియోజకవర్గంలో వెళ్లేందుకు షరతులతో కూడిన అనుమతిని ఇటీవల రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన విషయం తెలిసిందే. ఐదు వాహనాలకు మించి వెళ్లరాదని, అంతకంటే మించి వెళితే తాడపత్రి సబ్ డివిజనల్ అధికారుల అనుమతి తీసుకోవాలని , తాడపత్రి కి వెళ్లేందుకు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని తదితర చర్యలపై రాష్ట్ర హైకోర్టు ఆదేశాలిచ్చింది. ఇరువర్గాల వాదన తర్వాత హైకోర్టు ఆదేశాలిచ్చింది. రాష్ట్ర హైకోర్టు ఆదేశాలు మేరకు సోమవారం జిల్లా ఎస్పీ జగదీష్ ని కలిసి తాడపత్రి కి వెళ్లాలని మా ఎమ్మెల్యే పెద్దారెడ్డి భావించారు.. ఈనెల తొమ్మిదో తేదీన ఉరవకొండ ప్రాంతంలో హంద్రీనీవా కాలువ పరిశీలించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వస్తుండడంతో తగిన ఏర్పాట్లు చేసేందుకు జిల్లా కలెక్టర్ తో కలిసి జిల్లా ఎస్పీ ఉరవకొండ ప్రాంతానికి వెళ్ళినట్లు సమాచారం. అందులో భాగంగా మంగళవారం జిల్లా ఎస్పీని కలిసేందుకు మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఎస్పీ క్యాంప్ ఆఫీస్ కి వెళ్లారు. అయితే జిల్లా ఎస్పీ కార్యాలయం కే జిల్లా ఎస్పీ వస్తారని అధికారులు సమాచారం ఇవ్వడంతో వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకట్రామిరెడ్డి, ఇతర వైసీపీ నాయకులతో కలిసి మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి మంగళవారం జిల్లా ఎస్పీ కార్యాలయం కు వెళ్లారు.. అయితే అక్కడ కొద్దిసేపు వెయిట్ చేసినా జిల్లా ఎస్పీ కార్యాలయం కు రాకపోవడంతో జిల్లా అడిషనల్ ఎస్పీ నీ మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరాముడు కలిసి పరిస్థితిని వివరించి, రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులు అందజేసి వచ్చినట్లు సమాచారం..

కాగా జిల్లా ఎస్పీ కార్యాలయం బయట వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకట్రామిరెడ్డి, తాడపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి విలేకరులతో మాట్లాడారు. వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకట్రామిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ తాడిపత్రికి వెళ్లేందుకు వీలుగా హైకోర్టు ఉత్తర్వులు అందజేసేందుకు తాము జిల్లా ఎస్పీ కార్యాలయానికి వచ్చినట్లు చెప్పారు.

# రాష్ట్ర వ్యాప్తంగా ఇ - శ్రమ్ పోర్టల్‌లో కార్మికుల నమోదు ప్రక్రియ వేగవంతం

### అమరావతిలో ఫ్యాక్టరీస్ డిపార్ట్మెంట్ వెబ్ సైట్, లేబర్ డిపార్ట్‌మెంట్ వెబ్ సైట్ ను ప్రారంభించిన కార్మిక మంత్రిమంత్రి సుభాష్

**విజయవాడ,మే6,ప్రభాతవార్తప్రతినిధి:** మ్యాన్ పవర్ ఏజెన్సీలు అవకతవకలను ఇక ఎట్టి పరిస్థితులలో ఉపేక్షించేది లేదని ఏపీ కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. అమరావతిలో కార్మిక అండ్ ఫ్యాక్టరీల శాఖల అధికారులతో సమావేశమైన మంత్రి మ్యాన్ పవర్ ఏజెన్సీల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏజెన్సీల కింద పనిచేస్తున్న సిబ్బందికి కనీసం వేతనాలు కూడా చెల్లించకుండా ఇబ్బందులు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. కొంతమంది కాంట్రాక్టర్లు మ్యాన్ పవర్ కింద పని చేస్తున్న కార్మికులకు పీఎఫ్ లు కూడా కట్టడం లేదని మంత్రి ఆరోపించారు. ఫ్యాక్టరీస్ డిపార్ట్మెంట్లో ప్రమాదాలను నివారించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని దీనిలో భాగంగానే థర్డ్ పార్టీ ఆడిట్లో ఏజెన్సీలకు అనుభవం ఉండి, అర్హతలు ఉండి కంప్యూటర్ ద్వారా కేటాయింపులు చేసి చెప్పే విధంగా ప్రతి ఏజెన్సీ ఉండాలని అధికారులను ఆదేశించారు. ముందుగా లేబర్ డిపార్ట్మెంట్ వెబ్ సైట్ తో పాటు ఫ్యాక్టరీస్ డిపార్ట్‌మెంట్ వెబ్ సైట్ ను మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 86 లక్షల మంది కార్మికులు వివిధ రంగాలలో పనిచేస్తున్నారని వారి అభివృద్ధికి కూటమి కట్టుబడి ఉందని చెప్పారు. కష్టజీవులుగా చెప్పబడే కార్మికులను గత ప్రభుత్వం తీవ్రంగా మోసం చేయడంతో పని లేక రోడ్డున పడిన పరిస్థితులు కూడా ఉన్నాయని మంత్రి అన్నారు. ముఖ్యంగా గత సీఎం జగన్మోహన్ రెడ్డి అన్ని రంగాల్లో కార్మికులను అణచివేతకు గురిచేశారని చెప్పారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పుడిప్పుడే కార్మికుల జీవనస్థితిగతులు మెరుగుపడుతున్నాయని చెప్పారు.

ప్రధానంగా భవన నిర్మాణ కార్మికులు ఉచిత ఇసుకతో ప్రతిరోజు ఉపాధి పొందుతూ రెట్టింపు ఆనందంతో ఉన్నారనిచెప్పారు. ఇక అధికారులు ప్రభుత్వం కార్మికుల కోసం అందజేస్తున్న ప్రతి పథకాలపై కార్మికులకు అవగాహన పెంచాలన్నారు. చంద్రన్న బీమాలో ప్రతి కార్మికుడు నమోదయ్యేలా చూడాలన్నారు.

# శ్రీవారిమెట్టుమార్గంలో దివ్యదర్శనం టోకెన్లుజారీ

### - టిటిడి ఇఒశ్యామలరావు, అదనపు ఇఒ వెంకయ్యచౌదరి

**తిరుమల,మే 6ప్రభాతవార్తప్రతినిధి:** దేశం నలుప్రాంతాల నుండి ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానికి తిరుమలకు వచ్చే భక్తుల్లో కాలినడకన శ్రీవారిమెట్టుమార్గంలో చేరుకునే వారికి టోకెన్లు జారీకౌంటర్లను పెంచేందుకు చర్యలు తీసుకుంటామని టిటిడి ఇఒ జె.శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి తెలిపారు. శ్రీవారిమెట్టుమార్గంలో భక్తులకు అవసరమైన సౌకర్యాలు మెరుగ్గా కల్పించేందుకు భక్తుల నుండి అభిప్రాయాలు, సూచనలు తీసుకుంటామని చెప్పారు. తిరుపతి నుండి చంద్రగిరి నుండి శ్రీవారిమెట్టుకు చేరుకునే భక్తులు ఆటోడ్రైవర్లు, ట్యాక్సీడ్రైవర్ల నుండి దోపిడీకి గురికాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. భక్తులు కాలినడకన సాఫీగా టోకెన్ అందుకుని తిరుమలకు వచ్చేలా ఏర్పాట్లుచేపడతామన్నారు. మంగళవారం మధ్యాహ్నం శ్రీవారిమెట్టుమార్గాన్ని టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ వెంకయ్యచౌదరి, జెఇఒ వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, విఎస్‌ఒలు ఎస్టీవిరామ్‌కుమార్, సురేంద్ర,సిఇ సత్యనారాయణ, ఎస్‌ఇలు వెంకటేశం, మనోహర్‌తో కలసి పరిశీలించారు. శ్రీవారి దర్శనంకోసం శ్రీవారిమెట్టుమార్గంలో నడచివచ్చే భక్తులు ఉచిత టోకెన్లు పొందేందుకుఅసౌకర్యానికి గురవుతున్నారని ,దీనిపై మరిన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఆటోడ్రైవర్లు తమ స్వప్రయోజనాలకోసం భక్తులను నమ్మించి అధిక ఛార్జీలు దోపిడీచేస్తున్నారని ఫిర్యాదు అందిందదన్నారు. భక్తులకు పరిష్కారాలను కనుగొని తిరుపతి నుండి ఉచితంగా మరిన్ని ఉచిత బస్సులు నడపడంతోబాటు అదనపు కౌంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. భక్తుల నుండి అభిప్రాయాలతోబాటు వారి సూచనలు తీసుకుని మరింత పారదర్శకంగా సేవలందించేలా చూస్తామని ఇఒ,అదనపు ఇఒ తెలిపారు. తిరుమలకు 25వేలమందికిపైగా భక్తులు కాలినడకన చేరుకుంటుంటే శ్రీవారిమెట్టుమార్గం లోనే 10వేలమంది వరకు భక్తులు వస్తున్నట్లు తెలుస్తోంది.

# మసీదులతో సంబంధాలు తెగుతున్నాయి! మహిళా విద్యతోనే వికాసం సాధ్యం: ముఫ్తి అహమదుల్లా నిసార్



మసీదులో మాట్లాడుతున్న హైదరాబాదుకు చెందిన ముఫ్తి అహమదుల్లా నిసార్

**శ్రీకాళహస్తి,మే 6 ప్రభాతవార్త** నేడు ముస్లిం సమాజం ఎదుర్కొంటున్న సవాళ్ళకు సమాధానం ముస్లింలకు మసీదులతో సంబంధాలు తెగుతున్నాయి.అ ందుకే నేడు పలు సవాళ్ళను ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని హైదరాబాదుకు చెందిన ముస్లిం మత గురువు ముఫ్తి అహమదుల్లా నిసార్ అన్నారు. మంగళవారం ఉదయం నుంచి ఆయన మస్జిదే ఖుబా, మహిళల మదరసా నిస్వాన్, జామియా మస్జిద్‌లో ఎడతెరపిలేని సమావేశాలు నిర్వహించారు. శ్రీకాళహస్తిలోని జమియతే ఉలమ జిల్లా అధ్యక్షులు ముఫ్తినయిం సాహెబ్ పర్యవేక్షణలో కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. రోజు రోజుకు కనుమరుగౌతున్న ఆధ్యాత్మిక చింతనపై యువకులను,మహిళలను చైతన్య పరచుటకు కార్యక్రమాలను ఏర్పాటు చేసారు.

పాలక కమిటిలు చొరవ తీసుకోవాలి:
మస్జిదే ఖుబాలో పట్టణంలోని 16 మసీదులకు సంబంధించిన ప్రముఖులు,ముఖ్యులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్బంగా వారికి పలు సూచనలు చేసారు. ముఖ్యంగా ఏ ప్రాంతంలోని మసీదుల వారు ఆ ప్రాంతంలో జమాత్ కార్యక్రమాలను పకడ్బందిగా నిర్వహించాలన్నారు. ఆధ్యాత్మిక చింతన కు సంబంధించి ప్రతి రోజూ యువకులకు చైతన్య పరచే కార్యక్రమాలను ఏర్పాటు చేయాలన్నారు.ఇందుకు ఆయా మసీదుల కమిటీలు చొరవ చూపాలన్నారు.ఆయా ప్రాంతాల్లోని సామాజిక విద్యను అందిస్తున్న మదరసాలకు తమ పిల్లలను కనీసం రోజులో ఒక గంట అయినా వెళ్ళి సంప్రదాయ విద్యను అభ్యసించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటింటికి వెళ్ళి తల్లిదండ్రులను చైతన్యపరచి అరబ్బి చదువుకునేందుకు శ్రద్ద కల్పించాలన్నారు. వేసవి సెలవుల్లో అయినా తమ పిల్లలకు సంప్రదాయ విద్యను నేర్పించుటకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సంప్రదాయ విద్యను పిల్లలు నేర్చుకుంటే వారు తప్పక నమాజు మీద శ్రద్ద కల్గి ఉంటారన్నారు.దాంతో మసీదులు కళ కళ లాడుతాయని వివరించారు.

మహిళా విద్యతోనే సంసారాలు సుఖవంతం:
నేడు మసీదులు వెల వెల బోవటానికి కారణం మహిళకు సంప్రదాయ విద్య లేకపోవటమే అని ముఫ్తి అహమదుల్లా నిసార్ మహిళల మదరసా నిస్వాన్‌లో పిలుపు నిచ్చారు. పట్టణంలోని 16 మసీదుల పరిధిలోని మహిళా విద్యార్థులు, పలువురు మహిళలు ఇక్కడ విద్యను అభ్యసిస్తున్నారు. వారినుద్దేశించి ముఫ్తి మాట్లాడుతూ మన సమాజంలో మహిళలు నిరక్షరాస్యులైనందువల్ల కుటుంబంలో ప్రేమ, అప్యాయతలు, నమ్రత కొరవడ్డాయన్నారు. మన ప్రవక్తలు కుటుంబంలో ఎంతో సఖ్యతగా ఉండేవారని కానీ నేడు సంపాదన ముసుగులో మహిళలు కుటుంబ బాధ్యతలను నిర్వహించటంలో దూరమౌతున్నారన్నారు. ఏకుటుంబంలో అయితే మహిళలు సంప్రదాయాలు, విద్యపై చైతన్యం కల్గి ఉంటారో ఆ కుటుంబం ప్రశాంత వాతావరణంలో సాగుతుందన్నారు. శ్రీకాళహస్తిలోని జామియా మస్జిద్‌లో వందలాది మంది పాల్గొన్న సమావేశంలో ముఫ్తీ అహమదుల్లా నిసార్ మాట్లాడుతూ నేడు మనం ఎటు వెళుతున్నామో ఒక సారి అవగాహన కల్పించుకోండి. మసీదు పక్కనే ఇళ్ళు కాని మసీదులు వెల వెల బోతున్నాయి.

# ఘాట్‌రోడ్డు మూసివేత - కనకదుర్గానగర్ మీదుగా ఇంద్రకీలాద్రికి భక్తులు

**ఇంద్రకీలాద్రి, మే 6, ప్రభాతవార్త** దుర్గమ్మ ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనుల నిమిత్తం ఈనెల 6 నుండి 8 వరకు ఘాట్‌రోడ్డు మూసివేస్తున్నట్లు ఇఓ కె రామచంద్రమోహన్ ప్రకటించిన నేపథ్యంలో మంగళవారం తొలిరోజు సీతమ్మవారి పాదాలు, పున్నమిఘాట్ వద్ద నుండి ప్రత్యేకంగా దేవస్థానం వారు ఏర్పాటు చేసిన వాహనాల్లో భక్తులను కనకదుర్గానగర్ మీదుగా దుర్గమ్మవారి ఆలయానికి చేర్చారు. ఘాట్‌రోడ్డుపై కొండచరియలకు మెష్ వేస్తున్న సందర్భంగా భక్తులు కనకదుర్గానగర్ నుండి దుర్గమ్మవారి ఆలయానికి చేరుకోవాలన్నారు. భక్తులు దేవస్థానంవారు ఏర్పాటు చేసిన ఉచిత బస్సుల ద్వారా ఆలయానికి చేరుకున్నారు. అలాగే విశాఖ, చెన్నై నుండి వాహనాల ద్వారా వచ్చేవారు తమ వాహనాలను సీతమ్మవారి పాదాల వద్ద పార్కింగ్ చేసుకుని అక్కడినుండి ఉచిత బస్సులో ఆలయానికి చేరుకున్నారు. హైదరబాద్ మార్గం నుండి వచ్చేవారు పున్నమి ఘాట్ వద్ద తమ వాహనాలు పార్కింగ్ చేసుకుని అక్కడినుండి దేవస్థానం వారి ఉచిత బస్సుల్లో ఆలయానికి చేరుకున్నారు.



విహెచ్‌పి భారతదేశాధ్యక్షుడు అలోక్ కుమార్‌కు దుర్గమ్మవారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

**దుర్గమ్మవారి సేవలో విహెచ్‌పి దేశాధినేత:** దుర్గమ్మవారిని విహెచ్‌పి భారత అధ్యక్షులు అలోక్ కుమార్ దర్శించుకున్నారు. ఆయనకు దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమెంటోలు అందించిన తదుపరి వేదపండితులు ఆశీర్వచనాలందించారు.

# తిరుమల సమాచారం

## గజవాహనంపై పరిణయమండపానికి..

### - కన్నులపండువగా పద్మావతి పరిణయోత్సవం

**తిరుమల,మే 6ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమలలోని నారాయణగిరిఉద్యానవనాల్లో ప్రత్యేకంగా నిర్మించిన శ్రీనివాసుని పరిణయమండపంలో పద్మావతిపరిణయోత్సవాలు కన్నులపండువగా మొదలయ్యాయి. మూడురోజులు జరిగే ఈ ఉత్సవాల్లో తొలిరోజు మంగళవారం సాయంత్రం శ్రీదేవిభూదేవిలతో కలసి మలయప్పస్వామి గజవాహనంపై,తిరుచ్చిలపై వేర్వేరుగా ఆలయంనుండి ఉద్యానవనాలకు మంగళవాయిద్యాల నడుమ వేంచేశారు. వరుణదేవుడు కరుణించగా చిరుజల్లులు పడుతుండగా చల్లటి ఆహ్లాదకరవాతావరణంలో పరిణయోత్సవాలు ఆరంభమయ్యాయి. వైకుంఠం నుండి భూలోకానికి శ్రీమహావిష్ణువు శ్రీనివాసుడుగా వేంచేసిన తొలిరోజుల్లో నారాయణవనంలోని పద్మావతిదేవిని వివాహమాడిన ఘట్టాన్ని తలపిస్తూ తిరుమలలో మూడురోజులు పద్మావతిపరిణయోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. కల్యాణవేదిక వద్ద ఆలయ అర్చకులు, అధికారులు ప్రత్యేకంగా ఫల,పుష్పాలతో తీర్చిదిద్దిన కల్యాణమండపం వేదికపై స్వామిఅమ్మవార్లను కొలువుదీర్చారు. ఆగమోక్తంగా కల్యాణఘట్టాన్ని జరిపించారు. కొలువు,ఎదుర్కోలు, పూలబంతులాట ,నూతన వస్త్రాలు ధరింపజేశారు. భక్తులు కన్నులపండువగా వీక్షించి ముగ్ధులయ్యారు. అన్నమాచార్యకళాకారులు ఆలపించిన సంకీర్తనలు భక్తులను ఆకట్టుకున్నాయి.అక్కడ నుండి మంగళవాయిద్యాల నడుమ స్వామిఅమ్మవార్లు తిరిగి ఆలయానికి చేరుకోవడంతో పరిణయోత్సవాలు తొలిరోజు ముగిశాయి. పరిణయోత్సవ మండపాన్ని వివిధ రుచుల ఫలాలు, సువాసనలు వెదజల్లే రంగురంగుల పుష్పాలతో అలంకరించి,శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి దంపతులు, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ, పారుపత్తేదార్ హిమత్‌గిరి, విఎస్‌ఒలు ఎస్టీవిరామ్‌కుమార్, సురేంద్ర, ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాలదీక్షితులు, అర్చకులు పాల్గొన్నారు.

## ఎస్పీడిసిఎల్ డైరెక్టర్లుగా అయూబ్‌ఖాన్, గురవయ్య

### - వినియోగదారులకు మెరుగైన సేవలందిస్తాం

**తిరుపతి,మే 6ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ దక్షిణప్రాంత విద్యుత్ పంపిణీసంస్థ (ఎస్‌పిడిసిఎల్)డైరెక్టర్లుగా పి.అయూబ్‌ఖాన్, కె.గురవయ్యలు నియమాకమయ్యారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ఇంధనశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఏపిఎస్‌పిడిసిఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ హోదాలో ఈ ఏడాది ఏప్రిల్ 30న అయూబ్‌ఖాన్ పదవీవిరమణ పొందారు. ఈయన్ను తాజాగా డైరెక్టర్ ప్రాజెక్ట్సుకు, గత ఏడాది మేనెలలో పదవీవిరమణ పొందిన కె.గురవయ్యను డైరెక్టర్ టెక్నికల్‌గా నియమిస్తూ ప్రభుత్వంఉత్తర్వులు జారీచేసింది. నేడు వారివురూ బాధ్యతలు చేపట్టనున్నారు

## తిరుపతిలో బుగ్గమఠం భూములు కబ్జానే!

### - నిర్ధారించిన ప్రభుత్వ రెవెన్యూ సర్వేఅధికారులు

**తిరుపతి,మే 6ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి ఎంఆర్‌పల్లి సమీపంలోని బుగ్గమఠంభూములు ఆక్రమణకు గురయ్యాయని రాష్ట్రప్రభుత్వ సర్వే అధికారులు నిర్ధారించారు. ఆక్రమణల్లోని భూములు 14.49 ఎకరాల్లో 3.88 ఎకరాలు మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆక్రమణల్లో ఉన్నట్లు తేల్చారు. దీనిపై గతంలోనే విజిలెన్స్ అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు.తిరుపతిలోని బుగ్గమఠంలో ఆరు సర్వేనంబర్లలో తమ మఠానికి చెందిన 14.49 ఎకరాలు భూమి ఉందని, వాటికి హద్దులు తెలపాలంటూ తిరుపతి అర్బన్ తాశీల్దార్‌కు బుగ్గమఠం ఇఒ వెంకటేశ్వర్లు వినతిపత్రం ఇచ్చారు.దీనిపై నాలుగురోజుల క్రిందట సర్వే అధికారులు ఆ స్థలంలో సర్వేపూర్తిచేశారు. దీంతో బుగ్గమఠం ఆక్రమణకు గురైందని తేల్చారు. మరీ రానున్న రోజుల్లో మాజీమంత్రిపై చర్యలకు ఉపక్రమిస్తారా అనేది చూడాల్సిందే.

# ఇక చేనేతకు స్వర్ణయుగం

### రాష్ట్ర జౌళిశాఖ మంత్రి ఎస్.సవిత

**కర్నూలు, మే 06, ప్రభాతవార్త :** మన ప్రభుత్వంలో చేనేతలకు స్వర్ణయుగం వచ్చిందని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. మే ఒకటవ తేదీన నెల్లూరు జిల్లాలో 175 నియోజకవర్గాలకు ఒకటి చొప్పున 175 ఎం ఎస్ ఎం ఈ పార్కులకు వర్చువల్ గా భూమి పూజ నిర్వహించిన సందర్భంగా... మంగళవారం ఎమ్మిగనూరు మండలం బనవాసి లో ఎంఎస్‌ఎంఈ పార్కు నిర్మాణానికి రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్, రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి, చేనేత జౌళి శాఖ కమిషనర్ రేఖా రాణి, జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా భూమి పూజ నిర్వహించారు.. మంత్రి సవిత మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేనేతల సంక్షేమానికి కట్టుబడి ఉన్నారన్నారు. గత ప్రభుత్వం చేనేతలకు ఎటువంటి మేలు చేకూర్చలేదన్నారు... మంగళగిరిలో చేనేతలు పడుతున్న ఇబ్బందులు దగ్గరుండి చూసినందువల్ల తాను చేనేత జౌళి శాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత తనని పిలిచి చేనేతలను బాగా చూసుకోవాలని చెప్పారన్నారు.. మన ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇచ్చిన మాట ప్రకారం పవర్ లూమ్ కి 500 యూనిట్లు, హ్యాండ్లూమ్ కి 200 యూనిట్లు ఉచిత కరెంట్ అమలు పరుస్తున్నామన్నారు... అంతే కాకుండా క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నామని, ప్రతి నెల ఒక్కొక్క చోట ఎగ్జిబిషన్ లను ఏర్పాటు చేసి వారికి సౌకర్యంగా అన్ని సదుపాయాలు కూడా ఏర్పాటు చేసి వారికి కావాల్సిన ఏర్పాట్లు కూడా చేస్తున్నామన్నారు....ముఖ్యమంత్రి చేసిన కృషి వల్ల రాష్ట్రానికి చాలా క్లస్టర్లు మంజూరు చేసి రూ.348 కోట్లు కేటాయించారన్నారు..చేనేతలకు లేటెస్ట్ డిజైన్ల శిక్షణ ఇచ్చేందుకు గాను స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ లను ఏర్పాటు చేయబోతున్నామని, ఎమ్మిగనూరు లో కూడా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.. రాష్ట్ర పరిశ్రమలు వాణిజ్యం ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చేసిన కృషి వల్ల టెక్స్టైల్ పార్కు సాధ్యమయిందన్నారు. ఎంఎస్‌ఎంఈ పార్కు లో మొదటి దశలో 22 ఎకరాల్లో మూడు నెలల్లో మౌలిక సదుపాయాలు పూర్తి చేస్తామన్నారు.. మిగిలిన 50 ఎకరాలలో టెక్స్టైల్ రిలేటెడ్ యూనిట్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు... పారిశ్రామిక వాడకు ఎఫ్లుయెంట్ ట్రీట్మెంట్ ప్లాంట్ ను కూడా ఇస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఎమ్మిగనూరు బ్రాండ్ వస్త్రాలకు మా సహకారం ఉంటుందని తెలిపారు. రిలయన్స్ కంపెనీ వారు కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్లు ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నారని మంత్రి తెలిపారు.

# నెల్లూరులో కొనసాగుతున్న హత్యల పరంపర

**నెల్లూరు క్రైమ్, మే 6, ప్రభాతవార్త:** నెల్లూరు నగరంలో గత నెల రోజులుగా హత్యల పరంపర కొనసాగుతూనే ఉంది. పోలీసు అధికారులు ఎన్ని రకాల చర్యలు తీసుకుంటున్నప్పటికీ శాంతి భద్రతలు మాత్రం అదుపులో ఉండడం లేదు. స్థానిక వేదయపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో అయ్యప్ప గుడి కూడలి సమీపంలో మంగళవారం మరో హత్య ఉదంతం వెలుగులోకి వచ్చింది. పోలీసు తెలిపిన సమాచారం మేరకు. ఉదయగిరి మండలం సర్వరాబాదుకు చెందిన గొల్లపల్లి చిన్నయ్య అలియాస్ వికాస్ (40) గత కొంతకాలంగా అయ్యప్ప గుడి కూడలి సమీపంలోని తన స్నేహితుని ఇంట్లో అద్దెకు ఉంటూ నగరంలో రియల్ ఎస్టేట్, ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్నాడు. అతనితో పాటు వెంకటేశ్వర్లు మరో వ్యక్తి అదే ఇంట్లో ఉంటున్నాడు. సోమవారం రాత్రి బయట టిఫిన్ చేసి వచ్చిన ఇద్దరు ఇంటికి వచ్చి నిద్రకు ఉపక్రమించారు. చిన్నయ్య హాలులో నిద్రపోగా, వెంకటేశ్వర్లు గదిలో నిద్రపోయాడు. ఉదయం నిద్ర లేచి గదిలోంచి బయటికి వచ్చిన వెంకటేశ్వర్లు హాలులో విగతజీవిగా పడి ఉన్న చిన్నయ్యను గమనించి చుట్టుపక్కల వారికి, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సమాచారం తెలుసుకున్న నగర డి.ఎస్.పి సింధు ప్రియా, వేదయపాలెం ఇన్చార్జి సీఐ రోశయ్య సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. డాగ్స్ స్క్వాడ్, క్లూస్ టీం సభ్యులు సంఘటన జరిగిన ప్రదేశంలో ఆధారాలను సేకరించారు. చిన్నయ్య మృతి వార్త తెలుసుకున్న బంధుమిత్రులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. చిన్నయ్యకు నగరంలో కానీ, తన సొంత గ్రామంలో గానీ ఎవరితోనైనా విభేదాలు ఉన్నాయమోననే క్రమంలో పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడి సోదరుడు రాజా ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి వేదాయపాలెం పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

# రైలు భద్రతపై రాజీపడే ప్రసక్తే లేదు

## జిఎం అరుణ్ కుమార్ జైన్

**గుంతకల్లు రైల్వే,మే 6,ప్రభాతవార్త** రైల్వే భద్రతా నిబంధనలను తూచ తప్పకుండ పాటించే విషయంలో ఎలాంటి రాజీ పడే ప్రసక్తే లేదని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ ఉద్ఘాటించారు. తెలుగు రాష్ట్రాల రైల్వే జోనల్ ప్రధాన కార్యాలయమైన రైల్ నిలయంలో మంగళవారం రైల్వే భద్రతా సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్బంగా ఆయన అదనపు జీఎం నీరజ్ అగర్వాల్, జీఎం కార్యదర్శి మల్లాది శ్రీనివాస్ ఆయా కీలక విభాగాలకు చెందిన సంబంధిత ప్రిన్సిపల్ ఉన్నతాధికారులతో కలిసి భద్రతాపై సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని లెవెల్ క్రాసింగ్ గేట్ల వద్ద ప్రామాణిక భద్రతా విధానాలను ఖచ్చితంగా పాటించాలని, రైలు కార్యకలాపాలలో భద్రతను నిర్ధారించాలని కోరారు. సికింద్రాబాద్,హైదరాబాద్,విజయవాడ,గుంతకల్లు, గుంటూరు, నాందేడ్ డిఆర్ఎంలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొనా న్నరు. రైలు కార్యకలాపాల భధ్రతను నొక్కి చెబుతూ, రైలు కార్యకలాపాలలో సమన్వయాన్ని కచ్చితంగా పాటించాలని రైళ్లను నడుపుతున్నప్పుడు అన్ని భద్రతా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రైళ్ల రోడ్డు ప్రయాణికుల భద్రతను నిర్ధారించడానికి జోన్‌వ్యాప్తంగా లెవెల్ క్రాసింగ్ గేట్ల వద్ద ప్రామాణిక భద్రతా ప్రోటోకాల్‌లను కచ్చితంగా పాటించాలని ఆయన సిబ్బంది/అధికారులను ఆదేశించారు.

# మున్నేరు ఆయకట్టుకు నిధులు మంజూరు చేయాలి

### - మంత్రి రామానాయుడుకు ఎమ్మెల్యే రాజగోపాల్ వినతి

**జగ్గయ్యపేట, మే 6, ప్రభాతవార్త :** మునేరు పాత ఆనకట్ట, మునేరు కాల్వలు, కాచవరం కాల్వ మరమ్మతులకు నిధులు మంజూరు చేయకుంటే మొత్తం 22,146 ఎకరాల ఆయకట్టు ఎడారిలా మారిపోయే ప్రమాదం ఉందని, ప్రభుత్వం ద్వారా నిధులు విడుదలకు, పనుల నిర్వహణకు అనుమతులివ్వాలని శాసన సభ్యులు శ్రీరాం రాజగోపాల్ విజ్ఞప్తిచేశారు. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట అసెంబ్లీ పరిధిలోని వత్సవాయి మండలం పోలంపల్లి గ్రామంలోగల మునేరు ప్రాజెక్టుకు, జగ్గయ్యపేట మండల పరిధిలోని కాచవరం కాల్వల నిర్వహణ, మరమ్మతులకు నిధులు మంజూరు చెయ్యాలని టిడిపి జాతీయ కోశాధికారి, జగ్గయ్యపేట ఎంఎల్ఏ శ్రీరాం రాజగోపాల్ ఏపి జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు మంగళవారం వినతి పత్రం సమర్పించారు.

మంత్రి రామానాయుడు పుట్టిన రోజు సందర్భంగా తొలుత శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే రాజగోపాల్ తదనంతరం గత 2024 సెప్టెంబర్ వరదల కారణంగా దెబ్బతిన్న మునేరు పాత ఆనకట్ట మరమ్మతులు, కాచవరం కాల్వ మరమ్మతులు నిమిత్తం నిధులు మంజూరు చెయ్యాలని మంత్రితోపాటు ప్రభుత్వ కార్యదర్శిని కోరారు. 1894-1898లో నిర్మాణమైన మునేరు ఆనకట్ట ద్వారా 50 కిలోమీటర్ల పొడవునా వత్సవాయి, పెనుగంచిప్రోలు, నందిగామ మండలాల్లోని 24 గ్రామాల్లో 16,427 ఎకరాలు సాగు అవుతుందన్నారు. గత ఏడాది సంభవించిన వరదల కారణంగా కాల్వలకు పలుచోట్ల గండ్లు పడ్డాయని యుద్ధప్రాతిపదికన కొంతమేర గండ్లు పూడ్చి సవరించటం జరిగిందనా న్నరు.



మంగళవారం ప్రజావాణిలో దరఖాస్తుదారుల సమస్యలు వింటున్న డా.చిన్నారెడ్డి

# ప్రజావాణిలో 252 దరఖాస్తులు

**హైదరాబాద్(బేగంపేట), మే 6,ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 252దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయితీరాజ్,గ్రామీణాభివృద్ధిశాఖకు సంబంధించి 56,విద్యుత్‌శాఖకుసంబంధించి 32,రెవెన్యూ శాఖకు సంబంధించి 50,ప్రవాసీ ప్రజావాణికి 01, ఇందిరమ్మ ఇండ్లకోసం 44 దరఖాస్తులు వచ్చాయి.

ఇతర శాఖలకు సంబంధించి 69 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు.సీఎం ప్రజావాణి ఇంచార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా.జి.చిన్నారెడ్డి,స్టేట్ నోడల్ అధికారి దివ్యదేవరాజన్‌లు దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

# ఉపాధి హామీ సిబ్బంది వేతనాలు విడుదల

**హైదరాబాద్, మే 6, ప్రభాతవార్త :** తెలంగాణ లోని ఉపాధి హామీ సిబ్బందికి ప్రభుత్వం శుభవార్త తెలిపింది. ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న సిబ్బందికి నాలుగు నెలల బకాయి వేతనాలు విడుదల చేసింది. రాష్ట్రంలో ఈ పథకంలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఏపీవోలు మొత్తం 3,200 మందికి చెందిన రూ.62 కోట్ల వేతన బకాయిలు మంగళవారం విడుదల అయ్యాయి. అయితే తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, తక్షణమే తమ జీతాలు విడుదల చేయాలని గత కొద్ది రోజులుగా వీరంతా నిరసనకు దిగారు. దీనిపై స్పందించిన సర్కార్ నేడు ఆ పెండింగ్ బకాయిలను విడుదల చేసింది.



మంగళవారం విద్యార్థుల సమస్యలను చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు దృష్టికి తీసుకెళ్లుతున్న ఎంపి ఆర్.కృష్ణయ్య

# హాస్టళ్లు మూసివేస్తున్నా మెస్ బిల్లు చెల్లించరా!

## చీఫ్ సెక్రటరీతో బిసి నాయకుల చర్చలు

**హైదరాబాద్, మే 6, ప్రభాతవార్త:** 'ఏడు నెలలుగా బీసీ కాలేజీ హాస్టల్లో మెసి బిల్లులు బకాయిలు చెల్లించడం లేదు. దీనితో హాస్టళ్ల మూసివేస్తామని అధికారులు నోటీసులు ఇచ్చారు. అయినా ప్రభుత్వం ఇంకా బడ్జెట్ ఇవ్వలేదు. రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల పరిధిలో 500 డిగ్రీ కాలేజీలలో చదివేల మంది విద్యార్థుల పరీక్షలు బహిష్కరిస్తుంటే ఫీజుల బకాయిలు చెల్లించకుండా విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్నారని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు,రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నాయకత్వంలో మంగళవారం సచివాలయంలో చీఫ్ సెక్రెటరీ రామకృష్ణారావుతో చర్చలు జరిపారు. నాలుగు శాఖలలో కలిపి 4వేల కోట్ల బకాయిలు పేరుకు పోయాయి. గత మూడేళ్లుగా కాలేజీ కోర్సులు చదివే విద్యార్థుల 4వేల కోట్ల ఫీజు బకాయిలు చెల్లించడం లేదు. దీనితో విద్యార్థులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. మరోవైపు ప్రైవేటు కళాశాల యాజమాన్యాలు డిగ్రీ పరీక్షలు నిర్వహించకుండా నిరసనలు తెలుపుతున్నప్పటికీ ప్రభుత్వం మొద్దు నిద్ర నటిస్తున్నదని దుయ్యబట్టారు. ఇంత జరుగుతుంటే తమకేమీ పట్టనట్లు సిఎం, మంత్రులు వ్యవహరించడం సిగ్గుచేటు' అని అన్నారు.అందకు స్పందించిన చీఫ్ సెక్రటరీ బిసి హాస్టల్ మెస్ బిల్లులు రెండు రోజుల్లో క్లియర్ చేస్తామని, ఆ తర్వాత దశలవారీగా ఫీజులు చెల్లిస్తామని హామీ ఇచ్చారు.ఈ చర్చల్లో బిసి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అనంతుల రామూర్తిగౌడ్, బిసి సంఘాల నాయకులు గోరేగే మల్లేశ్‌యాదవ్, నీల వెంకటేష్,జిల్లాపల్లి అంజి, సి.రాజేందర్, పగిళ్ళ సతీష్,మోదీ రాందేవ్ యాదవ్, ఎస్.రవికుమార్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# సిఎస్‌కు మంత్రి సురేఖ అభినందనలు

## రాష్ట్ర పురోగతికి మీ అపార అనుభవం అవసరమని వ్యాఖ్య

**హైదరాబాద్, మే 6 ప్రభాతవార్త:**తెలంగాణ నూతన సిఎస్‌గా బాధ్యతలు స్వీకరించిన సీనియర్ ఐఎఎస్ రామకృష్ణరావుని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అభినందనలు తెలిపారు. ఆయన సిఎస్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా మంత్రి సురేఖను సచివాలయంలో ఆమె ఛాంబర్‌లో ప్రత్యేకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి ఆయన్ను సన్మానించారు. అనంతరం మంత్రి సురేఖ మాట్లాడుతూ రాష్ట్ర పరిపాలన విభాగంలో, తెలంగాణ ఆర్థిక కార్యకలాపాల్లో సిఎస్ రామకృష్ణరావుకి ఉన్న అపార అనుభవం ప్రస్తుతం రాష్ట్ర పురోగతి ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అటువంటి సీనియర్ ఐఎఎస్ నేతృత్వంలో పరిపాలన సంబంధిత అంశాల్లో రాష్ట్రంలోని అన్ని విభాగాలు ముందుకు వెళ్తాయన్న ధీమాను మంత్రి వ్యక్తం చేశారు. త్వరలో తమ ఎండోమెంటు డిపార్టుమెంటు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న కాళేశ్వరం సరస్వతినది పుష్కరాలు సమర్థవంతంగా నిర్వహించేందుకు రామకృష్ణరావు కృషి చేయాలని మంత్రి సురేఖ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖకి రామకృష్ణరావు ధన్యవాదాలు తెలిపారు.

# నేటితో ముగియనున్న ఎప్‌సెట్ కీపై అభ్యంతరాలు

## 12న ఫలితాల విడుదలకి సన్నాహాలు

**హైదరాబాద్, మే6, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కాలేజీల్లో ఇంజనీరింగ్‌తోపాటు ఫార్మసీ, అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఎప్(ఈఏపి) సెట్-2025 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఏప్రిల్ 29, 30 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలు జరగగా మే 2 నుంచి 4 వరకు ఇంజనీరింగ్ పరీక్షలు జరిగాయి. అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలకు సంబంధించిన ప్రాథమిక కీని ఈ నెల 4న మధ్యాహ్నం అందుబాటులోకి తీసుకురాగా ఇంజనీరింగ్ ప్రాథమిక కీని 4న సాయంత్రం 5 గంటల తరువాత నుంచి అందుబాటులో ఉంచారు. అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలకి సంబంధించిన ప్రాథమిక కీపై అభ్యంతరాలు మంగళవారంతో ముగిశాయి. నేటి(బుధవారం)తో ఇంజనీరింగ్ పరీక్షలకి సంబంధించిన ప్రాథమిక కీపై అభ్యంతరాలను స్వీకరించడానికి తుది గడువు. ఇంజనీరింగ్ ప్రాథమిక కీపై అభ్యంతరాలు పూర్తయిన తరువాత ఎప్ సెట్-2025 తుది ఫలితాలను విడుదల చేయనున్నారు. ఎప్ సెట్ ఫలితాలను ఈ నెల 12న విడుదల చేసేందుకు ఎప్ సెట్ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

ఈఏపీ సెట్-2025కి 3,06,796 మంది దరఖాస్తు చేసుకోగా అందులో ఇంజనీరింగ్‌కి 2,20,049 దరఖాస్తులు వచ్చాయి. పరీక్షల నిర్వహణ కోసం 124 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలకు 89వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. వారి కోసం 112 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలను రెండు సెషన్‌లలో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు తిరిగి మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించారు.

# కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చాల్సిందే

## బిజెఎల్పీ నాయకుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డి

**హైదరాబాద్, మే 6 ప్రభాతవార్త:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రం దివాళా తీసిందని పదేపదే చెప్పడం వెనుక అసలైన ఉద్దేశ్యం ఏమిటని బిజెఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రశ్నించారు. మంగళవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర దివాళా తీసిందని చెప్పడం చూస్తుంటే ఇది ఓ పకడ్బందీ స్కెచ్‌లా కనిపిస్తుందన్నారు. ఒకవైపు ప్రజలను ప్రిపేర్ చేస్తున్నట్టు, మరోవైపు ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల మీదకు ప్రజలను ఉసిగొల్పుతున్నట్లుగా పకడ్బందీ ప్లాన్ చేసినట్లు కనబడుతుందన్నారు. ఇచ్చిన హామీలను తప్పించుకునే కుతంత్రంగా, ఒకవైపు ఉద్యోగులను భయపెడుతూ, బ్లాక్ మెయిల్ చేస్తూ మరోవైపు ప్రజలలో ఆర్థిక సంక్షోభ భయం రేకెత్తించి సంక్షేమాన్ని తుంగలో తొక్కేందుకు ప్రయత్నిస్తుందన్నారు. పిసిసి నాయకులుగా ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డితో పాటు ఆ పార్టీ నాయకులు ఉత్తమ్, భట్టి విక్రమార్కలు రాష్ట్రంలో రూ.5.29 లక్షల కోట్ల అప్పులున్నాయని చెప్పారు. ఇప్పుడు మాత్రం అప్పు తక్కువగా చూపడం అనుమానాస్పదంగా ఉందన్నారు. రాష్ట్రానికి, రాష్ట్ర ప్రజానీకానికి భరోసా కల్పించాల్సిన ముఖ్యమంత్రి రాష్ట్రంలో అప్పులు పుట్టడం లేదని, అప్పుకోసం వెళ్తే దొంగలను చూసినట్లు చూస్తున్నారంటూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాడన్నారు. ప్రజల పక్షాన బిజెపి పోరాటం చేస్తుందన్నారు.

# తొలి ఒడి అమ్మ ఒడి..మలిబడి అంగన్వాడీ బడి

## చిన్నపిల్లల భవిష్యత్తు అంగన్వాడీ టీచర్లపై ఆధారపడి ఉంది

### ఎడ్యుకేషన్ వాలంటరీ కార్యక్రమంలో టెక్ ఎఫ్ఎంసి ఇంటర్నేషనల్ ఆయిల్ అండ్ మైనింగ్ కంపెనీ సేవలు అభినందనీయం: మంత్రి సీతక్క

**మనోహరాబాద్,మే 6,ప్రభాతవార్త:** చిన్నపిల్లలకు క్రమశిక్షణ నైతిక విలువలతో కూడిన విద్యా బోధన అంగన్వాడి సెంటర్స్ తోనే సాధ్యపడుతుందని పంచా యతీరాజ్ గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), తెలిపారు. మనోరాబాద్ మండలం శుభం ఫంక్షన్ హాల్ లో అంగన్వాడి ప్రీ ప్రైమరీ గ్రాడ్యుయేషన్ సభలో మంత్రి సీతక్క , జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు తమ సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. అంతకు ముందు అంగన్వాడీ టీచర్లు ఏర్పాటు చేసిన స్టాలు, చార్టర్లను పరిశీలించారు. అనంతరం టెక్నిప్ ఎఫ్ఎంసీ ఇండియా సంస్థ స్పాన్సర్ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికేట్లను, మెమొంటోలను మంత్రి అందించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ అంగన్వాడి సెంటర్స్ ప్రీ ప్రైమరీ స్కూల్స్ గా మార్చుకొని అంగన్వాడీలను మరింత ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన ఐసిడిఎస్ డిపార్ట్మెంట్ అందరికి స్పాన్సర్షిప్‌తో ముందుకు వచ్చిన టెక్ ఎఫ్ఎంసి (ఆయిల్ అండ్ మైనింగ్ కంపెనీ) అభినందనలు తెలిపారు. పిల్లల సృజనాత్మకత, వెలికి తీసి వారి ప్రతిభా పాట వాళ్లకు పదును బెట్టి తయారుచేసిన ఎగ్జిబిషన్ చూపరులను ఆకట్టుకుంది మంత్రి సీతక్క తెలిపారు. ఇప్పటికే అంగన్వాడీ కేంద్రాలలో 57 రకాల ఆట వస్తువులను, గర్భిణీ స్త్రీల కోసం బెంచీలు,అవసరమైన పోషకాహారాన్ని అంది స్తున్నామన్నారు. అంతే కాకుండా



మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

చిన్నారులకు అవసరమైన పోషకాహారం కోసం సైంటిస్టు చేత బాలంమృతం తయారు చేయిస్తున్నాం అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ అంగన్వాడి సెంటర్స్ లలో పోషకాహారం గుణాత్మక విద్య , ఫ్రీ ప్రైమరీ యాక్టివిటీ సమర్థవంతంగా అమలు అవ్వాలని అంగన్వాడి సెంటర్స్ లలో మంచి టీచింగ్ చిన్న పిల్లలకు టేబుల్స్ లెర్నింగ్ నెంబర్స్ ఆల్ఫాబెట్స్ ఇవన్నీ విజయవంతంగా అమలవుతున్నాయని చెప్పారు. అంగన్వాడీ టీచర్స్ కు ఒక మంచి కార్యక్రమాన్ని వారికి ఇస్తున్నామని టెన్త్ పాస్ అయిన పిల్లలను ఇంటర్మీడియట్లో జాయిన్ చేసే విధంగా చర్యలు తీసుకునేటట్లు చూడాలన్నారు .పోషకాహార రహిత అంగన్వాడి సెంటర్లగా రూపుదిద్దుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇంత మంచి కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నందున అంగన్వాడీ టీచర్స్ కు ఎఫ్ఎంసీ టెక్ వాలంటీర్ సంస్థకు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో తూప్రాన్ ఆర్డీవో జై చంద్రారెడ్డి, ఇన్చార్జి అదనపు కలెక్టర్ భుజంగరావు ,మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, గ్రంధాలయ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి, డిడబ్ల్యుఓ హైమావతి, ఎలక్షన్ రెడ్డి జెడి విశా లాక్షి, సంబంధిత ఐసిడిఎస్ సిడిపివోలు,అంగన్వాడి టీచర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణకు కేంద్రం ఏం చేసిందో శ్వేతపత్రం విడుదల చేయాలి

## ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్

**హైదరాబాద్, మే 6 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం ఏం చేసిందో శ్వేతపత్రం విడుదల చేయాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు. మంగళవారం గాంధీ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి కేంద్రం ఏం చేసిందో రాష్ట్ర బిజెపి నాయకులు చెప్పాలని డిమాండ్ చేశారు. తేదీ, సమయం చెప్తే బిజెపికి ఆఫీసుకి వస్తానని అన్నారు. మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్ హాఫ్ బిజెపి, హాఫ్ బిఆర్ఎస్ అంటూ ఎద్దేవా చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని సిఎం నిజాయితీగా వివరించారన్నారు. హరీష్, కెటిఆర్, ఈటల, బండిసంజయ్ బుద్ధితో మాట్లాడాలన్నారు. కెసిఆర్ చేసిన అప్పుకి కాంగ్రెస్ ప్రభుత్వం కడుతున్న వడ్డీనెలకి 7వేల కోట్లు అన్నారు. రెడ్డి ముఖ్యమంత్రి బిసి కులగణన చేసారన్నారు. రేవంత్‌కి మంచి పేరు వస్తుందన్న సమయంలో సన్నాసులు బయటకి వస్తున్నారన్నారు. రైతు భరోసాపై బండి సంజయ్ దారుణంగా మాట్లాడుతున్నాడని, ఏపిలోని కేంద్ర మంత్రులను చూస్తే సంతోషం అవుతుందన్నారు. బకాసురుడు బయటకి వచ్చి బస్సులు వద్దని కోట్లాడుతున్నట్లు చెప్తున్నాడు అన్నారు. రాష్ట్రాన్ని దోచుకున్న దొంగలు బిఆర్ఎస్ నాయకులని, ఉద్యమం చేస్తున్నట్లు నటించి పార్టీని నిర్మించుకున్నారని అన్నారు. ఉద్యోగసంఘాల నాయకుల మాటలు ఉద్యోగులు వినకండి, కెసిఆర్‌కి కాలు విరిగినా గుణం మారలేదన్నారు. లక్షల కోట్ల అప్పులు చేసిన కెసిఆర్‌ని ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. రేవంత్‌ను తట్టుకొనే దమ్ము ధైర్యం ఎవరికి లేదన్నారు.

# వదలని వర్షాలు

## నీటిపాలైన ధాన్యం

### పలు జిల్లాల్లో పంట నష్టం

**హైదరాబాద్, మే 6, ప్రభాతవార్త:** రైతన్నలను అకాల వర్షాలు వదలడం లేదు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో మరోసారి కురిసిన వర్షాలు, ఈదురు గాలలకు అపార నష్టాన్ని కలిగించాయి. రాష్ట్రంలోని ఉమ్మడి కరీంనగర్, వరంగల్, నిజామాబాద్ జిల్లాల్లో సోమవారం రాత్రి, మంగళవారం ఈదురుగాలులతో కూడిన వాన కండగండ్లే మిగిల్చింది. కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలోని అన్ని గ్రామాలతోపాటు రామడుగు మండలం వెలిచాల, వెదిర, దేశరాజ్‌పల్లి, షానగర్, పందికుంటపల్లి, కిష్టాపూర్, వన్నారం, కొక్కెరకుంట గ్రామాల్లో గంటపాటు వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల్లో విక్రయానికి తెచ్చి ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. తేమ శాతంతో సంబంధం లేకుండా తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు కోరారు. మానకొండూర్ మండలంలో ఆదివారం రాత్రి వీచిన ఈదురు గాలులకు జగ్గయ్యపల్లి, లక్ష్మీపూర్, ఈదులగట్టెపల్లి, రంగపేట, వెల్ది, వేగురుపల్లి గ్రామాల్లోని మామిడికాయలు నేలరాలడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. నిజామాబాద్ నగరంతోపాటు డిచ్‌పల్లి,మాక్లూర్, కోటగిరి, భీమ్‌గల్, రుద్రూర్, ఆలూరు, చందూరు, ఆర్మూర్ తదితర మండలాల్లోని మార్కెట్ యార్డుల్లో వడ్లు, మక్కలు తడిసిపోయాయి. భీమ్‌గల్‌ఆర్మూర్ మధ్య రహదారిలో పదుల సంఖ్యలో చెట్లు నేలకూల డంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు చోట్ల వర్షం కురిసింది. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని కొను గోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిపోగా, రైతులు కన్నీటి పర్యాంతమయ్యారు. అప్పారావుపేటలో ధాన్యం రాశులపై కవర్లు లేచి పోగా, కొంత ధాన్యం కొట్టుకుపోయింది. కాగా సిద్దిపేట జిల్లాలో రెండు రోజుల క్రితం కురిసిన అకాల వర్షంతో 9,368ఎకరాల్లో వివిధ పంటలకు నష్టం వాటిల్లినట్లు సోమవారం వ్యవసాయ, ఉద్యాన వన శాఖ అధికారులు ప్రాథమిక నివేదికను సిద్ధం చేశారు.జిల్లాలోని 15 మండలాల పరిధిలోని 89గ్రామాల్లో 3869 మంది రైతులకు సంబంధించి వరి,మామిడి,కూరగాయలు, నిమ్మ,మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లింది.

# కాల్పులు విరమించి కేంద్రం, మావోయిస్టు పార్టీ చర్చలకు రావాలి

**హైదరాబాద్ (సైఫాబాద్), మే 6 ప్రభాతవార్త:** మావోయిస్టు పార్టీ, కేంద్ర ప్రభుత్వం కాల్పుల విరమణ పాటించి శాంతి చర్చలకు రావాలని శాంతి చర్చల కమిటి విజ్ఞప్తి చేసింది. మావోయిస్టు పార్టీ చర్చలకు సిద్ధమని, అనువైన వాతావరణం ఏర్పాటు చేయాలని, పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ ఈ మేరకు పత్రికా ముఖంగా ప్రకటన చేశారని, అనంతరం మరో మూడు సార్లు చర్చలకు సిద్ధమని ప్రకటించినా కేంద్రం మొండిగా వ్యవహరించిందని కమిటీ పేర్కొంది. కర్రెగుట్ట ఆపరేషన్‌ను వేలాదిగా బలగాలతో కొనసాగించడం ప్రజాస్వామ్య విధానం కాదని శాంతి చర్చల కమిటి తెలిపింది. ఈ మేరకు మంగళవారం సాయంత్రం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో శాంతి చర్చల కమిటీ అధ్యక్షుడు



సమావేశంలో పాల్గొన్న శాంతి చర్చల కమిటీ ప్రతినిధులు

జస్టిస్ బి .చంద్రకుమార్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు కందిమల్ల ప్రతాప్‌రెడ్డి, ప్రొఫెసర్ పి.ఎల్.విశ్వేశ్వరరెడ్డి, సి.హెచ్.బాలకిషన్‌రావు, అత్రం భుజంగరావు, పాత్రికేయులు ప్రొఫెసర్ అన్వర్‌ఖాన్, సోమ రామమూర్తి, అజయ్, హరిప్రిత్, న్యాయవాదులు వెంకన్న, బండి దుర్గా ప్రసాద్ హాజరై పలు తీర్మానాలు అమోదించారు. శాంతి చర్చల కమిటీ దేశంలో ఆనేక ప్రాంత్రాలలో ప్రజలు, వివిధ ప్రజాసంఘాలు, పార్టీలు, సామాజిక సాముహాలు స్పందించి శాంతి చర్యలకు ముందుకు రావాలని ఉద్యమిస్తామని, కేంద్ర ప్రభుత్వం, మావోయిస్టు పార్టీ ఏలాంటి షరుతులు లేకుండా చర్చలకు రావాలని కమిటీ తీర్మానించింది. అనంతరం కమిటీ అధ్యక్షుడు నూతన కమిటీని ప్రకటించారు.

# మిస్ వరల్డ్ పోటీలకు ముస్తాబైన గచ్చిబౌలి

## ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి జూపల్లి

**సైబరాబాద్ ప్రతినిధి, మే 6 ప్రభాతవార్త:** నగరంలో మొట్టమొదటిసారిగా జరుగుతున్న మిస్‌వరల్డ్ అందాల పోటీలకు గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం ముస్తాబైంది. ప్రపంచవ్యాప్తంగా ఎంతో పేరుగాంచిన ఈ పోటీలను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని ఏర్పాట్లను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగానే మంగళవారం సాయంత్రం రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు గచ్చిబౌలిని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఆయాశాఖల అధికారులతో కలిసి ఏర్పాట్లను సమీక్షించిన మంత్రి పలు సూచనలు చేశారు. మిస్‌వరల్డ్ పోటీల ప్రారంభోత్సవం సందర్భంగా శ్రీమణిద్వీప ఆర్ట్స్ అకాడమీ విద్యార్థినులు ప్రదర్శించే పేరిణి స్వాగత నృత్యాన్ని అప్పటికే ఇండోర్ స్టేడియంలో అభ్యసి స్తుండగా వారిని ప్రశంసించారు.

**తెలంగాణ సంస్కృతికి అద్దంపట్టాలి:మంత్రి:** మిస్‌వరల్డ్ పోటీలను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నదని, ముఖ్యంగా వంద దేశాలకు పైగా ఈపోటీల్లో పాల్గొంటున్న నేపథ్యంలో తెలుగుదనం ఉట్టిపడేలా పరిసరాలను తీర్చిదిద్దాలని నిర్వాహకులకు సూచించారు. షోబోట్ ఈవెంట్స్ వారు ఏర్పాటుచేస్తున్న స్వాగత తోరణాలపై మంత్రి తీవ్ర అసహనం వ్యక్తంచేశారు. తెలంగాణ



గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాట్లను సమీక్షిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

సంస్కృతి, సాంప్రదాయాలకు సంబంధం లేకుండా ఇష్టానుసారంగా అలంకరణలు చెయ్యొద్దని సూచించారు. పోటీలకు సమయం దగ్గరపడ్డా ఇంకా అనుకున్న స్థాయిలో పనులు పూర్తికావడంలేదని భాషా సాంస్కతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణపై అసహనం వ్యక్తం చేశారు. భరతనాట్యం,కథక్,పేరిణి నృత్యాలు, సన్నాయి మేళం,భజంత్రీలు,తెలంగాణకళలు,హ్యాండీక్రాఫ్ట్స్ వంటిసాంప్రదాయాలకుపెద్దపీట వెయ్యాలన్నారు.

**శంషాబాద్‌లోనూ ఘనంగా ఏర్పాట్లు**

మిస్‌వరల్డ్ పోటీల సందర్భంగా గచ్చిబౌలితోపాటు శంషాబాద్ కూడా సర్వాంగసుందర ంగా ముస్తాబవుతోందని మంత్రి తెలిపారు. నగరంలో నిర్వహిస్తున్న అందాల పోటీల కారణంగా ప్రపంచం చూపు మన హైదరాబాద్‌పైనే ఉందని, అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మన సంస్కృతి సాంప్రదాయలు ఉట్టిపడేలా స్వాగత తోరణాలు, అలంకరణలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈనెల పదవ తేదీవరకు అన్ని ఏర్పాట్లు పూర్తవుతాయని ఆయన పేర్కొన్నారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని శాఖలను సమన్వయం చేస్తూ మిస్‌వరల్డ్ పోటీలను ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు.

# యువ వికాసానికి సిబిల్ స్కోర్: లబ్దిదారులకు ఇదే ప్రధాన అర్హత

**హైదరాబాద్, మే 6, ప్రభాతవార్త:** రాజీవ్ యువ వికాసం స్కీమ్‌లో సిబిల్ స్కోర్ కీలకం కానుంది. పథకం ద్వారా ప్రభుత్వ సహాయంతో లోన్ పొందాలనుకునే యువతకు క్రెడిట్ స్కోర్‌ను ప్రధాన అర్హతగా నిర్ణయించనున్నారు. దరఖాస్తుదారుల సిబిల్ స్కోర్ తక్కువగా ఉన్నా, గతంలో రుణాలు తీసుకుని చెల్లించకపోతే వారి దరఖాసులను బ్యాంకులు తిరస్కరించే అవకాశం ఉందని సంక్షేమ శాఖల అధికారులు చెబుతున్నారు. లోన్ అప్లికేషన్‌కు ముందు సిబిల్ స్కోర్‌ను తప్పనిసరిగా బ్యాంకులు పరిశీలించాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది, సిబిల్ స్కోరును గుర్తించేందుకు అవసరమైన ఫీజును కూడా లబ్దిదారుల నుండి వసూలు చేయనున్నాయి. ప్రతి అప్లికేషన్‌కి రూ.100 నుంచి రూ.200 వరకు వసూలు చేసే యోచనలో కొన్ని బ్యాంకులు ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే కొన్ని బ్యాంకులు ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాయి. కాగా సిబిల్ స్కోర్ వసూలుపై ప్రభుత్వం స్పందించింది. తక్కువ ఆదాయ వర్గాల అభ్యర్థులపై భారం పడకుండా చూడాలనే ఉద్దేశంతో బ్యాంకులు వసూలు చేసే ఫీజును మాత్రమే మినహాయించాలన్న ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తోంది. సిబిల్ స్కోరు గుర్తించేందుకు అవసరమైన ఫీజు విషయమై ఎస్సీ సంక్షేమ శాఖ అధికారులు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు నివేదించనున్నారు. ఈ విషయంపై స్టేట్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ సమావేశంలో ఈ అంశంపై చర్చ జరిగే అవకాశం ఉంది. ఇక రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకం కోసం భారీగా దరఖాస్తులువచ్చాయి. మొత్తం 16,25,441 దరఖాస్తులలో అత్యధికంగా బీసీల నుంచి 5,35,666,ఎస్సీల నుంచి 2,95,908, ఎస్టీల నుంచి 1,39,112, ఈబీసీల నుంచి 23,269, మైనారిటీల నుంచి 1,07,681, క్రిస్టియన్ మైనారిటీల నుంచి 2,689 దరఖాస్తులు వచ్చాయి. ప్రస్తుతం మండల స్థాయిలో దాదాపు 70 శాతం దరఖాస్తుల పరిశీలన పూర్తయినట్టు అధికారులు తెలిపారు. జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా లబ్దిదా రులకు రుణాల మంజూరు చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. మొదటివిడతలో సుమారు 5 లక్షల మందికి అందించేలా చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది.

# కట్టడాలను తప్పనిసరిగా ఇంజినీర్లు పర్యవేక్షించాలి

## ఎస్కి డైరెక్టర్ డాక్టర్ రామేశ్వర్‌రావు

**హైదరాబాద్, మే 6 ప్రభాతవార్త:** సిమెంట్, స్టీల్‌తో నిర్మించే గృహ నిర్మాణాలు, అపార్ట్‌మెంట్‌లు కనీసం 30 నుండి 40 సంవత్సరాల వరకు ఉండే విధంగా డిజైన్ చేస్తారని, ఇక ఎయిర్ పోర్టులు, సాగునీటి ప్రాజెక్టులు ఒడ రేవులు, రైల్వే నిర్మాణాలు పెద్ద పెద్ద వంతెనలు వందేండ్లకు పైగా వుండే విధంగా డిజైన్ చేస్తారని, మధ్యలో వీటి నిర్వహణ కోసం మాత్రమే కొంత ఖర్చు చేస్తే అవి శాశ్వతంగా వుంటాయని ఎస్కి డైరెక్టర్ డాక్టర్ జి. రామేశ్వర్ రావు అన్నారు. ఎఫెక్ట్స్ అఫ్ కరోజన్ ఆన్‌టిఎంటి బార్స్ అండ్ బిల్డింగ్ స్ట్రక్చర్స్ విషయమై గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ అఫ్ ఇండియాలో మంగళవారం జరిగిన సెమినార్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎస్కి సివిల్ అండ్ ట్రాన్స్ పోర్టేషన్ విభాగం ఏర్పాటు ఈ సెమినార్‌లో నగరంలోని వివిధ కన్‌స్ట్రక్షన్స్ కంపనీలలో పనిచేస్తున్న సుమారు 54 మంది ఇంజనీర్లు పాల్గొన్నారు. ఈ సందర్బంగా దేవిశ్రీ ఇస్పాత్ లిమిటెడ్ చీఫ్ రాజీవ్ బిష్త్ మాట్లాడుతూ సిమెంట్‌తో నిర్మించే ప్రతి కట్టడం కూడా నమ్మకంగా దృఢంగా ఉంటేగానీ ఎక్కువకాలం పనిచేస్తుంటుందని, ఆయా నిర్మాణాల్లో వాడుతుండే మెటీరియల్‌ని ఇంజనీర్లు స్వయంగా పరిశీలించాలని, లేదంటే జరిగే నష్టానికి వారే బాధ్యులవుతారన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ అఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి. రామేశ్వర్ రావు మాట్లాడుతూ దేశంలోని అన్ని ప్రాంతాల్లో పనిచేస్తున్న ఇంజనీర్లకు ఎప్పటికపుడు అప్‌డేషన్ శిక్షణ కార్యక్రమాలను తమ శిక్షణ సంస్థ ద్వారా అంది స్తున్నామన్నారు.

ఈ సందర్బంగా ఎస్కి ఆవిర్భావం నుండి ప్రస్తుతం పనిచేస్తున్న వివిధ డివిజన్లకు సంబంధించి ప్రెసెంటేషన్ ఇచ్చారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ కె.గణేష్ బాబు, డాక్టర్ వెంకట్ దిలీప్, సిటి విభాగం హెడ్ డాక్టర్ ఆర్. వెంకట్ రెడ్డి, సి.హెచ్. తిలక్, సునీతలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ పాకిస్థాన్‌కి అనుకూలమే

## బిజెపి ఎంపి రఘునందర్‌రావు

**హైదరాబాద్, మే 6 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు పాకిస్తాన్‌కి అనుకూలంగానే మాట్లాడుతుందని బిజెపి ఎంపి రఘునందన్‌రావు అన్నారు. మంగళవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. ప్రజల ప్రాణాలను పణంగా పెట్టే సంస్కృతి కాంగ్రెస్‌ది మాత్రమే అన్నారు. ఉగ్రదాడి మోడీకి ముందే తెలుసు అని మల్లికార్జున ఖర్గే దౌర్భాగ్యపు మాటలు మాట్లాడారన్నారు. దాడి జరిగిన విషయం తెలిసిన వెంటనే మోడీ సౌదీ అరేబియా పర్యటనను విరమించుకుని తిరిగి వచ్చేసారన్నారు. అఖిలపక్ష సమావేశంలో ప్రభుత్వానికి మద్దతుంటారు బయటకు వచ్చి మోడీనీ తప్పుని మాట్లాడుతారని అన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేతగాని ప్రభుత్వం అన్నారు. బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డి మాట్లాడిన మాటలు ఒకసారి గుర్తు చేసుకోవాలన్నారు. అధికారంలోకి వచ్చాక రేవంత్ రెడ్డి 1,50,000 కోట్లు అప్పు చేశారని, కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి దేశ రక్షణ విషయంలో రాజీపడే మాటలు మాట్లాడుతుందని మండిపడ్డారు. కాగా కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్‌ను ఎంపి రఘునందన్‌రావు మర్యాదపూర్వకంగా కలిసారు. తెలంగాణలో వెంటనే సైనిక పాఠశాలలు ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో సైనిక పాఠశాలలు ప్రారంభం అయ్యే వరకు ఆంధ్రప్రదేశ్‌లో సైనిక్ స్కూల్స్‌లో 67 శాతం లోకల్ కోటా ఉంచాలని విజ్ఞప్తి చేశారు.

# 'మందాడి' నుంచి సుహాస్ ఫస్ట్ లుక్

ప్రముఖ నిర్మాణ సంస్థ ఆర్ఎస్ ఇన్ఫోటైన్ మెంట్ అధినేత ఎల్రెడ్ కుమార్ తన 16వ ప్రాజెక్ట్‌గా "మందాడి" అనే స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాను ప్రకటించింది. "సెల్ఫీ" సినిమాతో తన ప్రతిభను నిరూపించుకున్న దర్శకుడు మతిమారన్ పుగళేంది ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రధాన పాత్రలో నటుడు సూరి కనిపించనున్న ఈ చిత్రంలో తెలుగులో మంచి గుర్తింపు పొందిన సుహాస్ తన తమిళ అరంగేట్రం చేస్తున్నారు. కథా నాయికగా మహిమా నంబి యార్ నటిస్తు న్నారు. అన్ని భాషల్లోను ఆకట్టుకునేలా చిత్రాన్ని మలుస్తున్నారు. ఇటీవల టైటిల్ మరియు సూరి ఫస్ట్ లుక్‌ను విడుదల చేసిన నిర్మాతలు, తాజాగా సుహాస్ ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. లుంగీ ధరించి, నెరిసిన జుట్టుతో, జెర్సీ వేసుకుని "సునామీ రైడర్స్" బృందంతో సముద్రతీరంలో నిలిచిన సుహాస్ రూపం అభిమానులను ఆకట్టుకుంటోంది. మరో పోస్టర్‌లో సూరి, సుహాస్ ఇద్దరూ స్వయంగా పడవలు నడుపుతూ ఒకరికి ఒకరు వ్యతిరేకంగా కనిపించడం సినిమాలో వారి మధ్య జరిగే గట్టి పోరును సూచిస్తోంది. సుహాస్ ఈ చిత్రంలో బలమైన ప్రతినాయకుడిగా కనిపించనున్నాడు. ఈ చిత్రంలో సత్యరాజ్, రవీంద్ర విజయ్, అచ్యుత్ కుమార్ వంటి అద్భుత నటులు కూడా కీలక పాత్రల్లో కనిపించనున్నారు. క్రీడా నేపథ్యాన్ని ఆధారంగా చేసుకుని, బలమైన భావోద్వేగాలు, సంకర్షణలతో కూడిన ఈ సినిమా జీవన పోరాటం, వ్యక్తిత్వం, ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబిస్తుంది. కథను బలంగా ముందుకు నడిపించడంలో టాప్‌టియర్ సాంకేతిక బృందం కీలకపాత్ర పోషిస్తోంది: సంగీతం జి.వి. ప్రకాష్ కుమార్ సమకూరుస్తుండగా, సినిమాటోగ్రఫర్‌గా ఎస్.ఆర్. కతిర్ ఐ.ఎస్.సి. పని చేస్తున్నారు. ఈ సినిమాకు ప్రొడక్షన్ డిజైనర్ డి.ఆర్.కె. కిరణ్, ఎడిటర్ ప్రదీప్ ఇ.రాఘవ్. యాక్షన్ కొరియోగ్రఫీని లెజెండరీ పీటర్ హెయిన్, సౌండ్ డిజైన్‌ను ప్రతాప్ అందిస్తున్నారు. తారాగణం: సూరి, సుహాస్, మహిమ నంబియార్, సత్యరాజ్, రవీంద్ర విజయ్, అచ్యుత్ కుమార్ తదితరులు. దర్శకత్వం: మతిమారన్ పుగళేంది.




# 'షష్టి పూర్తి' విడుదలకు రెడీ

ఏనాడూ ప్రెస్‌మీట్స్‌లో కనపడని సుప్రసిద్ధ కళా దర్శకుడు పద్మశ్రీ తోట తరణి ఈ సినిమా టీజర్ రిలీజ్ వేడుకలో పాల్గొని మాట్లాడటం. ఇలాంటి ఎన్నో విశేషాలతో షష్టి పూర్తి చిత్రం టాక్ ఆఫ్ ది టాలీవుడ్‌గా నిలిచింది. రూపేష్, ఆకాంక్ష సింగ్ హీరో హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రం ద్వారా పవన్ ప్రభ దర్శకునిగా పరిచయ మవుతున్నారు. మా ఆయి ప్రొడక్షన్స్ పతాకంపై రూపేష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తు న్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని ఈ నెల 30న విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా దర్శకనిర్మాతలు పవన్ ప్రభ, రూపేష్ మాట్లాడుతూ, ఈసినిమాకి ఎందరో హేమాహేమీలు పని చేశారు. అభినయంలో ఆరితేరిన రాజేంద్ర ప్రసాద్, అర్చన ఈ సినిమాకు మెయిన్ అస్సెట్. ఇక ఇళయ రాజా స్వరాల వల్ల మా చిత్రానికి ప్రేక్షకుల్లో గొప్ప అటెన్షన్ వచ్చింది. ఇప్పటికే విడుదల చేసిన రెండు పాటలు టాప్ లిస్ట్‌లో ఉన్నాయి. మళ్లీ వ్వింటేజ్ ఇళయరాజాను వింటున్నామని అందరూ ప్రశంసిస్తున్నా రు. ఏదో ఏ జన్మలోదో ..పాటకు ప్రముఖ సంగీత దర్శకుడు కీరవాణి సాహిత్యం అందించడం మా అదృష్టం. రెహమాన్ రచించిన ఇరు కనులు కనులు కలిసి మురిసె పాటను ఎస్పి చరణ్, విభావరి ఆలపించారు. ఎక్కడ విన్నా ఈ పాటలే వినిపిస్తున్నాయి. ఈ పాటల కారణంగా ప్రేక్షకుల్లోనే కాకుండా, బిజినెస్ సర్కిల్స్‌లో కూడా మా సినిమాపై స్పెషల్ అటెన్షన్‌వచ్చింది. అలాగే ఇటీవల రిలీజ్ చేసిన టీజర్‌కి కూడా సూపర్ రెస్పాన్స్ వచ్చింది. అవుట్ పుట్ కూడా అద్భుతంగా వచ్చింది. కచ్చితంగా ఈ సమ్మర్‌కి మంచి ఫీల్ గుడ్ మూవీతో వీడ్కోలు చెప్పవచ్చు. మిగిలిన 3 పాటలను, ట్రైలర్‌ను త్వరలోనే విడుదల చేస్తాం అని తెలిపారు. రాజేంద్ర ప్రసాద్, అర్చన, రూపేష్, ఆకాంక్షా సింగ్, కాంతార ఫేమ్ అచ్యుత్ కుమార్, సంజయ్ స్వరూప్, తెనాలి శకుంతల, ఆనంద చక్రపాణి, రాజ్ తిరందాసు, మురళీధర్ గౌడ్, చలాకి చంటి, బలగం సంజయ్, అనుపమ.






# 9న 'సిఎం పెళ్లాం'

ప్రముఖ నటుడు అజయ్, ఇంద్రజ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం సిఎం పెళ్లాం. రమణారెడ్డి దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాను బీఆర్‌కే నిర్మించారు. ఈ సినిమా మే 9న విడుదల కానుంది. ఈ సినిమా ప్రెస్‌మీట్‌ను నేడు చిత్ర యూనిట్ హైదరాబాద్‌లో నిర్వహించింది. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ, ఎమ్మెల్యే.. సీఎం అవుతాడు. ఎలక్షన్లు రాగానే ఎమ్మెల్యేగా కంటెస్ట్ చేసే వ్యక్తే కాకుండా ఆయన సతీమణి ఓట్లు అడగడం తెలిసిందే. కానీ గెలిచాక ఎంతమంది తమ ఇంటికి వచ్చిన ఓటర్లను కలుస్తున్నారు? సినిమా ద్వారా ఈ ప్రశ్నను నేను అడుగుతున్నా. కనీసం ఈ సినిమా తర్వాత అయినా అది ప్రారంభమవు తుందని నేను ఆశిస్తున్నా. ఎమ్మెల్యే కాస్త బిజీగా ఉండి బయట తిరుగుతున్న సమయంలో ఇంటికి పెద్ద సంఖ్యలో తమ సమస్యల పరిష్కారానికి వచ్చిన వ్యక్తులను ఎమ్మెల్యే పెళ్లాం ఒక రెండు లేదంటే మూడు గంటల పాటు కలిస్తే చాలా మార్పులొస్తాయని నమ్మాను. ఏదో చేయాల్సిన అవసరం లేదు కానీ కలిస్తే చాలు మార్పొస్తుందని ఈ సినిమాలో చూపించా. ఇక




యంగ్‌స్టర్స్ గురించి కూడా ఈ సినిమాలో చూపించాను. గత ప్రెస్‌మీట్‌లో నేను పాటలో హైడ్రాబాడ్ సిట్టీ అన్నానని కాంట్రవర్సీ చేశారు. నేను అన్నది హైదరాబాద్ బ్యాడ్ అని కాదు. సీఎం రేవంత్ రెడ్డి హైడ్రా అనేది బయట పెట్టారు. అది సక్సెస్ అయితే వర్షాలొచ్చినప్పుడు సిటీ మునిగిపోకుండా ఉంటుంది. మొన్న వైరస్ టైంలో మాస్క్ చూశాం. ఇప్పుడు రాజకీయ వ్యవస్థలో వైరస్ వ్యాధి కన్నా మించింది బుతు. మీడియా ముందుకు వచ్చి రాజకీయ నాయకులు బుతులు మాట్లాడకూడదన్న పాయింట్‌ను ఈ సినిమా ద్వారా బయటపెడుతున్నా. గవర్నమెంట్ జీవోలను ఆపిన హైకోర్టు. ఈ క్రమంలోనే హైకోర్టుకు, గవర్నర్‌కు ఒక వినతి పత్రం అందించబోతున్నా. రాజకీయ నాయకులు మీడియా ముందుకు వచ్చి బూతులు మాట్లాడితే రాజకీయాల్లో పోటీ ఐదేళ్ల పాటు పోటీ చేయకుండా నిషేధం విధించాలనే రూల్ తీసుకురావాలని కోరబోతున్నా. అలాగే పదవిలో ఉన్నవారు బూతులు మాట్లాడితే.. పవర్ కోల్పోతారన్న రూల్ రావాలి. కాబట్టి ఇది రొటీన్ సినిమా కాదు. ఎంటర్‌టైన్‌మెంట్ యాంగిల్‌లో ఒక మెసేజ్ ఇవ్వబోతున్నా అన్నారు. అజయ్ మాట్లాడుతూ, రమణారెడ్డి యూఎస్ వెళ్లి 25 ఏళ్లవుతుంది. ఇంతకాలం తర్వాత ఒక బౌండ్ స్క్రిప్ట్‌తో నా దగ్గరకు వచ్చారు. ఈ మధ్య కాలంలో బౌండ్ స్క్రిప్ట్స్ పెద్దగా రావడం లేదు. నేను కన్విన్స్ అయింది ఏంటంటే.. ప్రి వర్క్ కానీ.. పోస్ట్ వర్క్ కానీ మొత్తం బౌండ్ స్క్రిప్ట్‌తో వచ్చారు. సినిమా చేయవచ్చనడానికి ఫస్ట్ గ్రీన్ ఫ్లాగ్ నాకు. కంటెంట్ ఉమన్ ఎంపవర్‌మెంట్ మీద ఉంది. పొలిటికల్‌గా ఏమేం మార్పులు చేస్తే బాగుంటుందనే దానిపై ఆయన సినిమా చేస్తున్నారు. కాబట్టి అదంతా నచ్చి సినిమా చేశారు. ఇక ప్రొడ్యూసర్ రామకృష్ణ ఎంత అవసరమో అంత స్పెండ్ చేశారు.

# ఒటిటికి 'అనగనగా'

సుమంత్ కుమార్ లీడ్ రోల్‌లో సన్నీ సంజయ్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం అనగనగా. కాజల్ చౌదరి కథానాయిక. రాకేశ్ రెడ్డి గడ్డం, రుద్రా మదిరెడ్డి నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ మంచి బజ్ క్రియేట్ చేసింది. తాజాగా మేకర్స్ ఈ సినిమా స్ట్రీమింగ్ డేట్‌ని అనౌన్స్ చేశారు. మే 15 నుంచి ఈ సినిమా ఈటీవీ విన్‌లో స్ట్రీమింగ్ కానుంది. డైరెక్టర్ సన్నీ సంజయ్ అందరికీ కనెక్ట్ అయ్యే కథని హార్ట్ టచ్చింగ్‌గా ప్రజెంట్ చేశారని ప్రమోషనల్ కంటెంట్ హామీ ఇచ్చింది. ఈ థాట్ ప్రొవొకింగ్ అండ్ హార్ట్ వార్మింగ్ మూవీ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించనుంది. నటీనటులు: సుమంత్ కుమార్, కాజల్ చౌదరి, మాస్టర్ విహార్ష్, అవసరాల శ్రీనివాస్, అను హాసన్, రాకేష్ రాచకొండ, కౌముది నేమాని



టెక్నికల్ టీం:
రచన, దర్శకత్వం సన్నీ సంజయ్
నిర్మాతలు: రాకేశ్ రెడ్డి గడ్డం, రుద్రా మదిరెడ్డి
కో డైరెక్టర్ గురు కిరణ్
సహ రచయిత దీప్తి
సినిమాటోగ్రాఫర్ పవన్ పప్పుల
సంగీతం చందు రవి
కాస్ట్యూమ్ డిజైనర్ ప్రియాంక వీరబోయిన
ప్రొడక్షన్ డిజైనర్ ఎల్లోల్ డిజైన్ స్టూడియో అరవింద్ మ్యూల్ చంద్రిక గొర్రెపాటి
సౌండ్ డిజైనర్ అశ్విన్ ఆర్
గ్రాఫిక్ డిజైనర్ రామ్ చరణ్, ఎడిటర్ వెంకటేష్ చుండూరు
పీఆర్వో: వంశీ శేఖర్.

# 'కాంత' నుంచి స్పెషల్ పోస్టర్ రిలీజ్

దుల్కర్ సల్మాన్ మోస్ట్ ఎవైటెడ్ పీరియాడికల్ మూవీ కాంత అద్భుతమైన స్టార్ కాస్ట్, ఇంట్రస్టింగ్ ప్రమోషనల్ కంటెంట్‌తో సంచలనం సృష్టిస్తూనే ఉంది. లీడ్ పెయిర్ దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే ల స్టన్నింగ్ ఫస్ట్ లుక్స్ మంచి బజ్ క్రియేట్ చేశాయి. హీరోయిన్ భాగ్యశ్రీ బర్త్డే సందర్భంగా మేకర్స్ స్పెషల్ పోస్టర్ని రిలీజ్ చేశారు. భాగ్యశ్రీని క్లాసిక్ లుక్‌లో ప్రజెంట్ చేసిన ఈ పోస్టర్ అదిరిపోయింది. ప్రస్తు తం సోషల్ మీడియాలో వైరల్ అవు తుంది. ఈ సినిమా షూటింగ్ పూర్త యింది. పోస్ట్‌ప్రొడక్షన్ పనులు శర వేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే మేకర్స్ ప్రమోషన్స్ని కిక్ స్టార్ట్ చేస్తారు. కాంత గొప్ప కథ, నటీనటులు, టెక్నికల్ టీంతో మస్ట్ వాచ్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ అందించబోతోంది. సినిమా విడుదల తేదీని త్వరలో అనౌన్స్ చేయను న్నారు. తారాగణం: దుల్కర్ సల్మాన్, సముద్రఖని, భాగ్యశ్రీ బోర్సే

సాంకేతిక సిబ్బంది:
దర్శకత్వం: సెల్వమణి సెల్వరాజ్
బ్యానర్లు: స్పిరిట్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్, వేఫేరర్ ఫిల్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్, నిర్మాతలు: రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్, ప్రశాంత్ పొట్లూరి, జోమ్ వర్గీస్
ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సాయికృష్ణ గద్వాల్, సుజయ్ జేమ్స్
లైన్ ప్రొడ్యూసర్: శ్రవణ్ పాలపర్తి
దీవీశి దాని శాంచెజ్ లోపెజ్
ఆర్ట్ డైరెక్టర్: రామలింగం
రచయిత: తమిళ్ ప్రభ
సంగీతం: ఝను చంతర్
ఎడిటర్: లెవెల్లిన్ ఆంథోనీ గోన్సాల్వేస్
కాస్ట్యూమ్ డిజైనింగ్: పూజిత తాడికొండ, అర్చనరావు, హర్మాన్ కౌర్
పీఆర్వో: వంశీ శేఖర్.



# హార్షాలీ మల్హోత్రాకు దేశ వ్యాప్త గుర్తింపు..

సోషల్ మీడియాను బాగా ఫాలో అయ్యేవారు అయితే ఇట్టే గుర్తుపట్టవచ్చు. మిగతా వారు అయితే అంత త్వరగా గుర్తుపట్టలేరు. ఈ అమ్మాయి మొన్నటివరకు ఒక చైల్డ్ ఆర్టిస్ట్. అలాగనీ పెద్దగా సినిమాలు చేయలేదు. నటించింది కేవలం ఒకే ఒక్క సినిమాలోనే. కానీ దేశ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుంది. తన అమాయకమైన నటన, క్యూట్ నెస్, ఎక్స్ ప్రెషన్స్‌తో సినిమా ఆడియెన్స్‌కు బాగా చేరువైంది. కొన్ని సన్నివేశాల్లో అయితే ఏం మాట్లాడకుండానే తన హావభావాలతో అందరితో కన్నీళ్లు పెట్టించింది. సినిమా కూడా బ్లాక్ బస్టర్ హిట్ అయ్యింది. బాక్సాఫీస్ వద్ద వందల కోట్ల వసూళ్లు రాబట్టింది. అయితే ఈ సినిమా హిట్ అయిన తర్వాత కూడా ఈ క్యూటీ మరే మూవీలోనూ నటించలేదు. చదువుకు ప్రాధాన్యమిచ్చి ఇండస్ట్రీకి దూరంగా ఉండిపోయింది. సినిమాలకు దూరంగా ఉన్నఈ ముద్దుగుమ్మ ఇటీవల సోషల్ మీడియాలో బాగా యాక్టివ్‌గా ఉంటోంది. ఎప్పటికప్పుడు తన బ్యూటిఫుల్ అండ్ గ్లామరస్ ఫొటోలు షేర్ చేస్తోంది. వీటికి నెటిజన్ల నుంచి కూడా మంచి రెస్పాన్స్ వస్తుంటుంది. అలా తాజాగా ఈ అమ్మడు షేర్ చేసిన ఫొటోలను చూసిన నెటిజన్లు అవాక్కవుతున్నారు. అప్పుడు సినిమాలో కనిపించిన ఆ చిన్నపాపేనా? ఈ అందాల ముద్దుగుమ్మా అంటూ క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు. మరి ఈ బ్యూటీ ఎవరో మీరైనా గుర్తు పట్టారా? తను మరెవరో కాదు సల్మాన్ ఖాన్ భజరంగీ భాయ్ జాన్ సినిమాలో నటించిన హార్షాలీ మల్హోత్రా.. అదేనండి మున్నీ. భజరంగీ భాయ్ జాన్ సినిమాకు ముందు కొన్ని సీరియల్స్‌లో నటించింది హార్షాలీ. 2014లో కుబూల్ హై, లౌట్ ఆవో తృషా తదితర ధారావాహికల్లో చైల్డ్ ఆర్టిస్టుగా నటించింది. ఇక ఏడేళ్ల ప్రాయంలో భజ్రంగీ భాయ్‌జాన్ మూవీలో యాక్ట్ చేసింది. ఆ సినిమాలో అమాయకంగా ఉన్న మున్నీ ఇప్పుడు టీనేజ్‌లో తన అందంతో కుర్రకారును కట్టిపడేస్తోంది. సోషల్ మీడియాలో ఫుల్ యాక్టివ్‌గా ఉండే హార్షాలి మల్హోత్రాకు ఇన్ స్టాగ్రామ్‌లో సుమారు 3.7 మిలియన్ల మంది ఫాలోవర్లు ఉన్నారు. ప్రస్తుతం చదువుకుంటోన్న ఈ ముద్దుగుమ్మ త్వరలోనే సినిమాల్లోకి వచ్చే అవకాశముందని తెలుస్తోంది.



# ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'సింగిల్'

కింగ్ ఆఫ్ ఎంటర్టైన్మెంట్ శ్రీ విష్ణు ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ గీతా ఆర్ట్స్ బ్యానర్‌లో హోల్సమ్ ఎంటర్‌టైనర్ సింగిల్‌తో అలరించబోతున్నారు. ఈ చిత్రంలో కేతిక శర్మ, ఇవానా కథానాయికలుగా నటించారు, వెన్నెల కిషోర్ కీలక పాత్ర పోషించారు. ఈ చిత్రానికి కార్తీక్ రాజు దర్శకత్వం వహించారు. గీతా ఆర్ట్స్ మెగా ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ సమర్పణలో కళ్యా ఫిల్మ్స్‌తో కలిసి చిత్రాన్ని విద్యా కొప్పినీడి, భాను ప్రతాప, రియాజ్ చౌదరి నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్ ట్రైలర్ పాటలు సినిమాపై హ్యూజ్ బజ్ క్రియేట్ చేశాయి. సింగిల్ మే 9న థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ కేతిక శర్మ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**ఈ ప్రాజెక్టులోకి ఎలా వచ్చారు? గీతా ఆర్ట్స్‌లో వర్క్ చేయడం ఎలా అనిపించింది?**

గీతా ఆర్ట్స్ సంస్థలో వర్క్ చేయాలని ఎప్పటినుంచో నా కోరిక. అల్లు అరవింద్ ఒక సినిమాని ప్రజెంట్ చేస్తుంటారంటే కచ్చితంగా ఆ సినిమాలో అద్భుతమైనటువంటి కంటెంట్ ఉంటుంది. ఈ సినిమా గురించి నాకు కాల్ వచ్చినప్పుడు ఫైనల్‌గా గీత ఆర్ట్స్‌లో వర్క్ చేస్తున్నాననే ఆనందం కలిగింది. కథ విన్నప్పుడు చాలా ఎంజాయ్ చేశాను.

**ఈ సినిమాలో మీ క్యారెక్టర్ ఎలా ఉండబోతుంది?**

ఈ సినిమాలో పూర్వా అనే క్యారెక్టర్‌లో కనిపిస్తాను. తను వెరీ ఇండిపెండెంట్, ప్రాక్టికల్ గర్ల్.

**శ్రీ విష్ణుతో వర్క్ చేయడం ఎలా అనిపించింది?**

శ్రీ విష్ణు వండర్ఫుల్ పర్సన్ చాలా సింపుల్, చాలా హంబుల్‌గా ఉంటారు. యాక్టింగ్‌లో కూడా చాలా సపోర్ట్ చేశారు. శ్రీ విష్ణు కామెడీ టైమింగ్ చాలా యూనిక్‌గా ఉంటుంది. ఆయన స్పాట్లో డైలాగ్స్ ఇంప్రవైజ్ చేసేస్తుంటారు. ఆయన పర్ఫార్మెన్స్ చాలా స్పాంటేనియస్‌గా ఉంటుంది. ఆయనతో వర్క్ చేయడం రియల్లీ గ్రేట్ ఎక్స్పీరియన్స్.

**ఇవానాతో వర్క్ చేయడం ఎలా అనిపించింది?**

ఇవానా వెరీ బ్యూటిఫుల్ అండ్ గర్ల్. ఆన్ స్క్రీన్‌లో మామధ్య ఒకటి రెండు సీన్స్ ఉన్నాయి. అయితే ఆఫ్‌స్క్రీన్‌లో మేము చాలా మంచి ఫ్రెండ్స్ అయ్యాం.



# 20 కోట్లు డిమాండ్ చేస్తోన్న హీరోయిన్

ప్రస్తుతం పాన్ ఇండియా లెవల్లో దక్షణాది హీరోయిన్స్ హవా కొనసాగుతుంది. తెలుగు, తమిళం, కన్నడ, హిందీలో వరుస సినిమాలతో బ్లాక్ బస్టర్ హిట్స్ అందుకున్న స్టార్స్.. ఇప్పుడు హిందీ సినీరంగంలోకి అడుగుపెడుతున్నారు. తాజాగా ఓ హీరోయిన్ మాత్రం వరుసగా పది ఫ్లాప్స్ అందుకున్నప్పటికీ భారీగా రెమ్యునరేషన్ డిమాండ్ చేస్తుంది. భారతీయ సినీరంగంలోని టాప్ హీరోయిన్లలో ఆమె ఒకరు. ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించింది. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం భాషలలో ఎంతో స్టార్ హీరోలతో స్క్రీన్ షేర్ చేసుకుని తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకుంది. కానీ ఆమె సినిమాల కంటే ఎక్కువగా వివాదాలతోనే ఫేమస్ అయ్యింది. కొన్నాళ్లుగా ఈ అమ్మడు జోరు తగ్గింది. కానీ రెమ్యునరేషన్ మాత్రం తగ్గేదేలే అంటో దట. దాదాపు ఆమె నటించిన పది సినిమాలు డిజాస్టర్స్ అయ్యాయి. అయినప్పటికీ రెమ్యునరేషన్ మాత్రం ఎక్కువే డిమాండ్ చేస్తుందట. ఇంతకీ ఆమె ఎవరో తెలుసా..? ప్రస్తుతం ఒక్కో సినిమాకు రూ.20 కోట్ల పారితోషికం తీసుకోవాలనుకుంటుందట ఈ అమ్మడు. ఆమె మరెవరో కాదు.. హీరోయిన్ నయనతార. సౌత్ ఇండస్ట్రీలో లేడీ సూపర్ స్టార్‌గా క్రేజ్ సంపాదించుకుంది. ఇప్పుడు నయన్ వయసు 40 సంవత్సరాలు. అయినప్పటికీ కుర్రహీరోయిన్లకు గట్టిపోటీనిస్తుంది. దశాబ్దాలుగా సినీరంగంలో కొనసాగుతున్న నయన్.. ఇప్పుడు ఒక్కో సినిమాకు రూ.20 కోట్లు డిమాండ్ చేస్తుందని టాక్. ఇరవై ఏళ్లకు పైగా తెలుగు, తమిళం, కన్నడ సినిమాల్లో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్న నయనతార.. అటు లేడీ ఓరియెంటెడ్ చిత్రాలతోనూ సత్తా చాటుతుంది. ఇటీవలే జవాన్ సినిమాతో బాలీవుడ్ ఇండస్ట్రీలోకి విజయవంతంగా అడుగుపెట్టింది. దీంతో ఆమె క్రేజ్ పాన్ ఇండియాకు చేరింది.



# సెలవుల్లో టూర్ ప్లానింగ్..

సాధారణంగా ఏదైనా టూర్ ప్లాన్ చేయాలంటే సెలవుల కోసం చూస్తారు. పిల్లలు ఉన్న వాళ్లయితే వేసవి సెలవుల్లో వెళ్లేందుకు ఇష్టపడతారు. ఎందుకంటే పిల్లలకు ఎక్కువ రోజులు సెలవులు ఉంటాయి. కాబట్టి. ప్రయాణ బడలికతో వారి అనారోగ్యానికి గురైనా మళ్లీ కుదురుకోవడానికి సమయం ఉంటుంది. వెళ్లిన చోట ఎక్కువ సమయం గడిపేందుకు వీలుంటుంది. ఇక పెద్దవాళ్లయితే సెలవులు పెట్టుకోవాల్సి వస్తుంది. కొందరు టూర్ ప్లాన్ చేసుకునే ముందే ఎక్కువరోజులు సెలవుల కోసం ప్రయత్నిస్తారు. వారికి ఉన్న సెలవులను ఈ రకంగా వాడుకునేందుకు మధ్యలో మధ్యలో సెలవులు పెట్టకుండా ఉన్న సెలవులు కాపాడుకుంటారు. అటువంటప్పుడు ఈ సమయంలో సెలవులు ఉపయోగించుకునే వీలు కల్పించుకుంటారు. అయితే ఇలాంటి సౌకర్యం అన్ని సంస్థల్లో ఉండకపోవచ్చు.



వీలున్న చోట ఇటువంటి సౌకర్యం ఉంటే పిల్లలు, ఇంట్లో పెద్దవాళ్లు ఉంటే ఏ పుణ్యక్షేత్రానికో, ఆ తరువాత ఏదైనా పిక్నిక్‌లాంటి ప్రదేశానికో ప్లాన్ చేసుకోవచ్చు. దగ్గర ప్రదేశాలకు వెళ్లట్లయితే సొంత వాహనం ఉన్నవారికి ఇబ్బంది ఉండదు. లేదా ఏదైనా అద్దె వాహనంలో అయినా వెళ్లవచ్చు. లేదా విమానంలోనో, రైలులోనే ప్రయాణించాల్సి వస్తే ముందుగా ఆలోచించుకోవాల్సింది లగేజీ ఎక్కువగా ఉండకుండా చూసుకోవడం. ఎక్కువమంది ఉంటే ఎవరి లగేజీ వారు చూసుకున్నప్పటికీ పెద్దవాళ్ల లగేజీతో నడవడం, ప్రయాణించడం కష్టం కాబట్టి కావాల్సినవేమిటి, తీసుకెళ్లాల్సినవేమిటి చూసుకుని సర్దుకోవాల్సి ఉంటుంది. బ్యాగులు, సూట్‌కేసులు ఎక్కువైనా వాటిని జాగ్రత్తచేయడం కొంత కష్టమైన పనే. దుస్తులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చినప్పటికీ వెంట ఉండాల్సిన వస్తువులు చాలానే ఉంటాయి. తక్కువ లగేజీ ఉంటే మంచిది అనుకున్నప్పటికీ ఎప్పుడేం అవసరమొస్తుందో అన్న సందేహం వచ్చినప్పుడు తప్పదు అనుకుని అదనంగా తీసుకెళ్లాల్సినవి ఉంటాయి. ఈ రోజుల్లో యూజ్ అండ్ త్రో వంటివి కొనుక్కోవడం చాలా మంది చేస్తున్నారు. పిల్లలకు వారికి కావల్సిన చిన్న చిన్న వస్తువులను వారు మోసే వీలున్న బ్యాగుల్లో వారికి సంబంధించిన పేస్టు, టూత్‌బ్రష్‌లు, కర్చీఫ్‌లు, క్యాప్‌లు, స్వెటర్‌లు వంటివి పెట్టవచ్చు. ఇక పెద్దవాళ్లయితే స్వెటర్‌లు, మఫ్లర్‌లు, క్యాప్‌లు ప్రయాణంలో ధరించే ఉంటారు కాబట్టి, వారికి కావల్సి దుస్తులు, మందులు, తప్పనిసరిగా అవసరమైన వస్తువులు ఎలాగూ వెంట ఉండాల్సి వస్తుంది. ◆

# టెన్షన్ పడితే జబ్బులు ఖాయం..

టెన్షన్ ఇప్పుడు చాలా మంది జీవితాల్లో దీనిని తగ్గించడం కష్టంగా మారిపోయింది. మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, విపరీతమైన పని ఒత్తిడి టెన్షన్ అందరి జీవితాల్లోనూ భాగంగా మారింది. ఇక బాగా టెన్షన్ పడితే అనేక రోగాలు వచ్చే అవకాశం ఉంటుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎంత పని ఒత్తిడి ఉన్నప్పటికీ టెన్షన్‌ను తగ్గించుకోవాలని ప్రశాంతంగా ఉండటం అలవాటు చేసుకోవాలని అంటున్నారు. టెన్షన్‌తో చేయాల్సిన పనులు సరిగ్గా చేయకపోగా, అనవసరమైన రిస్కులు పడాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు. బాగా టెన్షన్ పడితే హైబిపి వచ్చే ప్రమాదం ఉంటుందని చెబుతున్నారు. హైబిపి మన శరీరంలోని ధమనుల గోడలపైన ఒత్తిడిని పెంచి మనకు గుండెపోటు, మూత్రపిండాల వ్యాధులు రావడానికి కారణమవుతుందని అందుకే టెన్షన్‌ను తగ్గించుకోవాలని సూచిస్తున్నారు. టెన్షన్ ఎక్కువగా ఉన్నవారిలో గుండె పనితీరు దెబ్బతింటుంది. ఇది గుండె జబ్బులు వచ్చే ప్రమాదాన్ని మరింత పెంచుతుంది. బాగా టెన్షన్ పడే వారిలో దయాబెటిస్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. విపరీతమైన ఒత్తిడి ఇన్సులిన్ ఉత్పత్తిని తగ్గించి, రక్తంలోని గ్లూకోస్ స్థాయిలను ఒక్కసారిగా పెంచుతుంది. దీనివల్ల మధుమేహం బారిన పడే అవకాశం ఉంది. టెన్షన్ జీర్ణవ్యవస్థను దెబ్బతీస్తుంది. దీంతో అజీర్ణం, మలబద్ధకం, గ్యాస్ వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది. విపరీతమైన టెన్షన్ తలనొప్పికి కూడా కారణమవుతుంది. టెన్షన్ కారణంగా నిద్రస్థాయి కూడా తగ్గుతుంది. నిద్రలేమి సమస్య పెరుగుతుంది. ఫలితంగా శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుంది. ఇక ఎక్కువ కాలంపాటు టెన్షన్ పడుతూ ఉండడం ఒక రకమైన ఆందోళనకు, డిప్రెషన్‌కు కారణమవుతుంది. మానసిక రుగ్మతలకు కారణంగా మారుతుంది. ఎన్నో అనర్థాలు కలిగించే టెన్షన్‌ను పక్కనపెట్టి ప్రశాంతంగా జీవించడం ఉత్తమం. ప్రశాంతగా ఉన్నవారికి ఎటువంటి రోగాలు వచ్చే అవకాశం లేదు. అందుకే టెన్షన్ తగ్గించుకోవటానికి యోగా, మెడిటేషన్ వంటివి చేస్తే మంచి ఫలితం ఉంటుంది. ◆



## ఆధ్యాత్మికం

# ప్రబోధకుల ప్రవర్తన

ప్రబోధకులు, ప్రవచనకారులు ప్రజలకు ఎన్నో విషయాలను, ధర్మాలను బోధిస్తారు. అయితే వారి బోధకంటే వారి ప్రవర్తనే ప్రజలకు ఎక్కువ ప్రభావాన్ని కలిగి ఉంటుంది. వారు సాధ్యమైనంత వరకు దోషరహితంగా జీవించాలి. ఏదైనా తప్పు చేస్తే పశ్చాత్తాప పడాలి, ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. మహాభారతంలోని ఒక విషయాన్ని చెబుతారు. పారాయణం లక్ష్మీకాంత శర్మగారు. 'శంఖుడు, లిఖితుడు అనే విప్రులు ప్రాణస్నేహితులు. ఒకసారి శంఖుడు లిఖితునితో పనిపడి అతని ఆశ్రమానికి వెళ్లాడు. అప్పుడు లిఖితుడు ఆశ్రమంలో లేడు. అతని కోసం శంఖుడు చాలాసేపు ఎదురు చూశాడు. ఎంతకూ లిఖితుడు రాలేదు. ఆకలి ఎక్కువై నందున ఆశ్రమంలోని ఒక మామిడి చెట్టు నుండి ఒక పండుకోసం, తిని విశ్రమించాడు. కొంతసేపటికి లిఖితుడు వచ్చాడు. కుశల ప్రశ్నలు వేశాడు. శంఖుడు పండుతిన్న సంగతిని లిఖితునితో చెప్పాడు. అప్పుడు లిఖితుడు 'మిత్రమా! నీవు నన్ను అడక్కుండా పండు తిన్నావు. కాన ఇది దొంగతనం. మనం ధర్మ బోధకులం, శాస్త్రాన్ని అనుసరించాలి కదా? అపుడే మనం ఇతరులకు బోధింపగలం. దొంగతనం చేసినందుకు శాస్త్రంలో దొంగయొక్క హస్తాన్ని చేధించాలని ఉంది కదా! కావున నీవు ఈ దేశం రాజు వదనదకు వెళ్లి నీ చేతిని నరికించుకో, ఇది నీ ధర్మం' అని అన్నాడు. అంత శంఖుడు తన తప్పును ఒప్పుకొని రాజు వద్దకు వెళ్లి తన చేతిని నరికించుకున్నాడు.

ఈ విధంగా పూర్వం మహనీయులు తమ ప్రవృత్తిలో అధర్మం కనబడితే వెంటనే తమకు తామే శిక్ష అనుభవించేవారు. సామాన్య ప్రజలకే కాక సాధుపుంగవులకు, పండితులకు ప్రవచన కారులకు దిశా నిర్దేశం చేసే విషయాలెన్నో మహాభారతంలో కనపడతాయి.

**- రాచమడుగు శ్రీనివాసులు**

# మాట్లాడితే మంచిదే!

ఆడవాళ్లు సుభాషిణులు.. అందంగా, వినసొంపుగా మాట్లాడతారనే అభిప్రాయంతోపాటూ, ఎక్కువ మాట్లాడతారనే భావనా ఉంది. ఇందులో ఎంతవరకూ నిజం ఉందనే విషయంపైన ఆరిజోనా యూనివర్సిటీ శాస్త్రవేత్తలు పరిశోధన చేశారు. ఆడవాళ్లైనా, మగవాళ్లెయినా సుమారుగా పాతికేళ్లు వచ్చేంతవరకూ ఒక రోజులో దాదాపుగా సమానమైన పదాలనే ఉపయోగిస్తారట. ఆ తర్వాత.. అంటే పాతిక నుంచి అరవై నాలుగేళ్లు వచ్చేంత వరకూ ఆడవాళ్ల రోజువారీ సంభాషణల్లో మగవాళ్లతో పోలిస్తే మూడు వేల పదాలు ఎక్కువ ఉంటాయట. ఇలా ఉండటానికి ప్రధాన కారణం.. పిల్లలట. వాళ్లకి జాగ్రత్తలు చెబుతూ, తీర్చిదిద్దేక్రమంలో ఈ పదాల సంఖ్య పెరుగుతూ వస్తుందని ఈ అధ్యయనం తేల్చింది. ఆ బాధ్యతలన్నీ తీరిపోయే సమయానికి అంటే, అరవైఏళ్లు దాటేసరికి ఆడవాళ్లూ, మగవాళ్లూ వాడే తిరిగి సమానంగా ఉంటున్నాయి తేలింది. నాలుగు దేశాలకు చెందిన స్త్రీ పురుషులని ఎకువ్కని వారు మాట్లాడిన ఆరున్నర లక్షల రికార్డులని పరిశీలించాక వెల్లడించిన విషయాలివి. అలాగే, వ్యాయామం చేయడంలానే చక్కగా మాట్లాడటం కూడా ఆరోగ్య లక్షణమే అంటున్నారు శాస్త్రవేత్తలు. ◆



# శరీరానికి ఇంధనం మంచినీరు

రోజువారీ పనులన్నీ చక్క పెట్టాలన్నా నీళ్ల అనే ఇంధనాన్ని శరీరానికి తరచూ అందించాల్సిందే. మిగిలిన కాలాలతో పోలిస్తే ఎండలు నిప్పులు చెరిగే సమయంలో దాహం వేసినా వేయకపోయినా, అప్పు డప్పుడు ఓ గ్లాసు నీళ్ల తాగుతుంటే అతి వేడి, ఎండనుంచి మనల్ని మనం కాపాడు కోగలుగుతాం. చాలామంది ఇది తెలిసి కూడా నీళ్ల సరిగ్గా తాగక అనారోగ్యాల్ని తెచ్చుకుంటున్నారు. నీళ్ల సరిగ్గా తాగకపోతే డీ హైడ్రేషన్ బారిన మాత్రమే పడామనుకుంటే పొరపాటు నీళ్ల అందనప్పుడు ఎలక్ట్రోలైట్లు బ్యాలెన్స్ తప్పుతాయి. దాంతో శరీరంలో శక్తి కూడా సన్న గిల్లి, తరచూ పనిమీద ఏకాగ్రత కుదరదు. తలనొప్పి, చిరాకు, చిన్నచిన్న విషయాలను మర్చిపోవడం, నిస్సత్తువ, ఫలితంగా కోపం.. చాలినన్నీ నీళ్ల తాగక పోవడం చర్మంలోని కొలాజెన్ పైనా ప్రభావం పడుతుంది. దాంతో చర్మంలో తేమ తగ్గిపొడి బారుతుంది. ముఖ్యంగా అధిక రక్తపోటు, గుండె సంబంధ సమస్య లున్నవారు నీళ్ల సరిగ్గా తాగని పక్షంలో రక్తం చిక్కబడి బ్రెయిన్ లేదా హార్ట్ స్ట్రోక్ రావొచ్చని అధ్యయనాలు చెబుతున్నాయి. మూత్రనాళ ఇన్ఫెక్షన్లు, జుట్టు ఎండు గడ్డిలా మారడం వంటివీ నెమ్మదిగా మొదలవుతాయి. నీళ్ల తాగితే పోషకాలు అందుతాయి.. శరీరంలోనూ యాభై నుంచి డెబ్బై అయిదు శాతం వరకూ నీరే ఉంటుంది. శరీరానికి సరిపడా నీరు అందించడం వల్ల కీళ్ల నొప్పులు త్వరగా రావు, నీళ్ల శరీరంలోని టిష్యూలనూ వెన్నె ముకనూ ఆరోగ్యంగా ఉంచి తరచూ ఒళ్ల నొప్పుల బారిన పడకుండా చేస్తాయి మరి. మనలో పేరుకున్న వ్యర్థాలు లేదా ఫ్రీ రాడికల్స్ బయటకుపోయి శరీరమూ అంతర్గతంగా శుభ్రపడుతుంది. జీర్ణ వ్యవస్థపనితీరు మెరగవుతుంది. అధిక రక్తపోటు సమస్యా నియంత్రణలోకి వస్తుంది. మూత్రపిండాలూ మెరుగ్గా పనిచేస్తాయి. జుట్టు, చర్మం గోళ్ల ఆరోగ్యంగా కనిపిస్తాయి. చప్పగా రుచీ, పచీ లేని నీటిని అదే పనిగా ఏం తాగుతామని అనేకునే వారు నీటిలోనే నిమ్మరసం, నాలుగైదు పుదీనా ఆకులు, రెండు కీరా ముక్కలు.. వంటి సహజ ఫేవర్లను జత చేసుకోవచ్చు. నీళ్లకు బదులుగా కొబ్బరి నీళ్లూ, పల్చటి మజ్జిగా, నీటిశాతం ఎక్కువ ఉండే పుచ్చకాయ, కీరా, తర్బూజా, ద్రాక్ష, కమలా ఫలం వంటివి తీసుకున్నా మంచిదే. మామి డి, స్ట్రాబెర్రీ, నిమ్మ, ఆపిల్ వంటి పండ్ల సుగుణాలు ఉంటాయి. గ్లాసు నీటిలో ఒక క్యూబ్ లేదా డ్రాప్ వేసుకుంటే నీళ్లకు మెగ్నీషియం, పొటాషియం, వంటి ఎలక్ట్రో లైట్లూ.. సి,బి, ఇ లాంటి విటమిన్లూ అందు తాయి. ఇవి పొడి, లిక్విడ్ రూపంలోనూ దొరుకుతున్నాయి. ◆



# పెన్షనర్ల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలి

## ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డి. వెంకటేశ్వర్లు

**విజయవాడ,మే6,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని అందించేలా ఏపీ ప్రభుత్వ పదవి విరమణ చేసిన ఉద్యోగుల సంఘం అధ్యక్షులు, కార్యదర్శులు డి. వెంకటేశ్వర్లు. జి. ప్రభుదాస్‌లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు. 2019వ సంవత్సరంలో మంజూరు చేసిన పెన్షనర్ల అడిషనల్ క్వాంటమ్ ను పునరుద్ధరించాలని, పదవీరమణ అనంతరం అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందిన పెన్షనర్లకు చెల్లించాల్సిన మెడికల్ రిఎంబర్స్ మెంట్ బిల్లులను చెల్లించడంతో పాటు హెల్త్ కార్డులపై మెరుగైన వైద్యం సేవలు అందించాలని కోరారు.

ఏపి పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా కార్యవర్గం సమావేశం సోమవరం జిల్లా అధ్యక్షులు కె. దాలినాయుడు అధ్యక్షతన గాంధీనగర్‌లోని పెన్షనర్ల సంఘం భవనంలో నిర్వహించారు.

ఈ సందర్భంగా ఇటీవల ఏపీ ఎన్జీజీఓ అసోసియేషన్‌కు జిల్లా కార్యవర్గానికి నూతనంగా అధ్యక్షులు, సహాఅధ్యక్షులు, కార్యదర్శులుగా ఎన్నికైన డి. సత్యనారాయణ రెడ్డి, వి.వి. ప్రసాద్, పి. రమేష్‌లను పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రామానికి ముఖ్య అతిథిగా హాజరైన పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షలు డి. వెంకటేశ్వర్లు మట్లాడుతూ సుధీర్ఘ కాలం పాటు రాష్ట్ర ప్రభుత్వంలో సేవలందించి పదవీవిరమణ చేసి వయోభారంతో బాధపడుతున్న పెన్షనర్ల సమస్యలను పరిష్కరించడం పై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టావలసిన అవసరం ఉందన్నారు. 2019వ సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి అయిన నారా చంద్రబాబు నాయుడు పెన్షనర్ల పై ఉన్న మమకారంతో అడిషనల్ కోంటమ్‌ను మంజూరు చేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం 7075 సంవత్సరాల వయస్సుగల పెన్షనర్లకు మంజూరైన 10 శాతం అడిషనల్ కోంటమ్‌ను 7 శాతానికి, 75 80 సంవత్సరాల వయస్సుగల పెన్షనర్లకు మంజూరైన 15 శాతం అడిషనల్ కోంటమ్‌ను 12 శాతానికి తగ్గించి పెన్షనర్లను తీవ్ర మానసిక క్షోభకు గురి చేయడం జరిగిందన్నారు. ప్రస్తుత నాయకత్వంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం తిరిగి అడిషనల్ కోంటమ్‌ను పునరుద్దరిస్తుందని సంవత్సరం కాలంగా పెన్షన్‌దారులు ఎదురు చూస్తున్నారన్నారు. అడిషనల్ కోంటమ్‌ను పునరుద్దరించి పెన్షనర్లను అదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామని ఆయన అన్నారు.

రాష్ట్ర కార్యదర్శి జి. ప్రభుదాస్ మాట్లాడుతూ పదవీ విరమణ అనంతరం వయోభారంతో పెన్షనర్లు అనారోగ్యానికి గురై మెరుగైన చికిత్సను పొందడంలో తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారన్నారు. మెడికల్ రిఎంబ్రస్‌మెంట్ బిల్లులు ప్రభుత్వం వద్ద పెడిరగ్‌లో ఉన్నాయని వాటిని చెల్లింకచపోవడంలో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారన్నారు.

తక్షణమే పెండిరగ్ బిల్లులు చెల్లించాలని ప్రభుత్వాని కోరారు. హెల్త్ కార్డులకు సంబంధించి పెన్షనర్లు తమ వాటాగా నెలకు 225 రూపాయలు, 300 రూపాయలను చెల్లించినప్పటికి మెరుగైన వైద్యం పొందలేకపోతున్నారన్నారు. హెల్త్ కార్డులు పూర్తి స్థాయిలో అమలు అయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఏపిఎన్జిజీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డి. సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ ఏపిఎన్జిజీవో రాష్ట్ర సంఘం ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు.

# చర్లపల్లి-ఇటానగర్ రైలు నెలాఖరు వరకు పొడిగింపు

**గుంతకల్లు రైల్వే,మే 6,ప్రభాతవార్త** తెలుగు రాష్ట్రాల నుంచి అరుణాచల్‌ప్రదేశ్‌లోని నహర్లగాన్(ఇటానగర్) మధ్య నడుపుతున్న ప్రత్యేక రైలు సర్వీసులను ప్రస్తుత వేసవి సీజన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం నెలాఖరు వరకు పొడిగించినట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. చర్లపల్లి నుంచి నహర ్లగాన్(ఇటానగర్) వెళ్లే నెంబర్ 07046 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 10నుంచి 31వరకు పొడిగించారు. ఈ రై ప్రతి శనివారం ఉదయం 8.40కి చర్లపల్లి నుంచి బయలుదేరి, సోమవారం సాయంత్రం 4గంటలకు నహర్లగాన్ (ఇటానగర్) చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో నహర్లగాన్ (ఇటానగర్) నుంచి చర్లపల్లి వెళ్లే నెంబర్ 07047ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసులను ఈ నెల 13నుంచి జూన్ 3వరకు పొడిగించారు. ఈ రైలు ప్రతి మంగళవారం మధ్యాహ్నం 1గంటకు నహర్లగాన్ నుంచి బయలుదేరి గురువారం రాత్రి 8.30గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. మార్గమద్యలో ఈ రైళ్లు తెలుగు రాష్ట్రాల్లో నల్గొండ, మిర్యాలగూడ, నడికూడి, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, యలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం, పలసలతో పాటు ఒరిస్సా, పశ్చిమబెంగాళ్, అస్సాం, అరుణాచల్ ప్రదేశ్‌లోని ముఖ్యమైన స్టేషన్లలో నిలుస్తాయి.



పాటిగడ్డలో సన్న బియ్యం భోజనం చేస్తున్న మంత్రి సీతక్క, ఎఐసిసిసభ్యురాలు కోట నీలిమ.విశాల్‌సుధామ్‌లు

# పేదలకు నాణ్యమైన సన్నబియ్యం అందించింది కాంగ్రెస్ ప్రభుత్వమే

## పాటిగడ్డలో సన్నబియ్యం భోజనం చేసిన మంత్రి సీతక్క

**హైదరాబాద్, మే 6,ప్రభాతవార్త** పేదలకు నాణ్యమైన సన్నబియ్యాన్ని అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని, సన్నబియ్యం పంపిణీతో లబ్దిదారులు ఎంతో సంతోషంగా ఉన్నారని రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి , గ్రామీణ నీటి సరఫరా, మహిళా మరియూ శిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి అనుసూయ (సీతక్క) అన్నారు. మంగళవారం సనత్‌నగర్ నియోజకవర్గం పరిధిలోని పాటిగడ్డలో ఏఐసీసీ సభ్యురాలు డా.కోట నీలిమ, సనత్‌నగర్ నియోజకవర్గం సీనియర్ నాయకులు విశాల్‌సుధామ్‌లతో కల్సి సీతక్క పాటిగడ్డలోని సాలేహాబేగం నివాసంలో సన్నబియ్యం భోజనం చేసారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని తమ ప్రభుత్వం పేదల కోసం ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలులోకి తీసుకు వస్తుందన్నారు. పేదలు సన్న బియ్యం పంపిణీతో ఎంతో సంతోషంతో ఉన్నారన్నారు. అన్నదాతల సంక్షేమం కోసం తెలంగాణా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఆమె ఈ సందర్భంగా ప్రజలకు వివరించారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా పేదల సంక్షేమం గురించి పట్టించుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు విశాల్‌సుధామ్, బబ్లూ , చిరంజీవి, హనీఫ్‌ఖాన్, కృష్ణ, మనోజ్, నసీరుద్దీన్(అడ్డూ), తస్లీమ్, మాధవి, అల్తమాష్, జగదీష్, పర్వేజ్ కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# త్వరలో అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి

**- ఇబిసి,కాపులకు రూ.15 లక్షలు అందించేలా ప్రతిపాదనలు**

**విజయవాడ,మే 6,ప్రభాతవార్త ప్రతినిధి:** విదేశాల్లో ఉన్నత విద్య చదివే విద్యార్థులకు ఆర్థిక చేయూతనందించేందుకు ప్రభుత్వం త్వరలో అంబేద్కర్ ఓవర్సీస్‌ను అమలులోకి తీసుకుని రానున్నది. ఇందుకు సంబంధించి కీలక సమాచారాన్ని అందుబాటులోకి తీసుకుని వచ్చింది. విదేశీ విద్యాపథకాన్ని అమల్లోకి తీసుకురానుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబిసి, కాపు వర్గాల్లోని ప్రతిభావంతులైన పేదల పిల్లలకు విదేశాల్లో ఉన్నత విద్య చదవాలనే కలను నెరవేర్చేలా ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు విదేశీ విద్య పథకాన్ని పునరుద్దరించనున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో అధికారులు పథకం అమలుకు కసరత్తు ప్రారంభించారు. ముసాయిదా మార్గదర్శకాలను రూపొందించి ప్రభుత్వానికి నివేదించారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.25 లక్షలు, బీసీ, మైనార్టీలకు రూ.20 లక్షలు, ఈబీసీ, కాపు విద్యార్థులకు రూ.15 లక్షల చొప్పున అదించాలని అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

# మచిలీపట్టణం ప్రజలకు నీటి సమస్య రానివ్వం

**- నీటిని శుద్ధి చేసేందుకు రూ.16 కోట్ల వ్యయంతో ప్లాంట్ ఏర్పాటు : మంత్రి కొల్లు రవీంద్ర**



నూతనంగా నిర్మించిన ఎలివేటెడ్ లెవెల్ సర్వీస్ రిజర్వాయరును జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ బండి రామకృష్ణ కలిసి ప్రారంభించిన మంత్రి కొల్లురవీంద్ర

**విజయవాడ,మే6,ప్రభాతవార్తప్రతినిధి:** బందరు(మచిలీపట్టణం) నగర ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండా చూడటమే కూటమి ప్రభుత్వ ప్రధాన ఆశయమని రాష్ట్ర గనులు, భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. మంగళవారం ఉదయం ఆయన నగర పరిధిలోని మాచవరం రెండవ డివిజన్లో దాదాపు రూ.2.68 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన 500 కిలో లీటర్ల సామర్థం గల ఎలివేటెడ్ లెవెల్ సర్వీస్ రిజర్వాయరును జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ బండి రామకృష్ణ, ఇతర నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ ఈ ప్రాంతంలో నూతనంగా నిర్మించిన ఈ ఓవర్ హెడ్ ట్యాంక్ ద్వారా దాదాపు ఐదు లక్షల లీటర్లను నిల్వ చేసి నగర ప్రజలకు అందించడం జరుగుతుందన్నారు.

ఈ రిజర్వాయరును నిర్మించడానికి 2014లో అమృత్ పథకం కింద కోట్లాది రూపాయల నిధులను మంజూరు చేయించి పనులు చేపట్టినప్పటికీ తర్వాత వచ్చిన ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా కనెక్షన్లు ఇవ్వకపోవడంతో మాచవరంతో పాటు గిలకలదిండిలోని రెండు ట్యాంకులు నిరుపయోగంగా ఉండిపోయాయన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మిగిలిన పనులను పూర్తి చేసి నగర ప్రజలకు పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. మచిలీపట్నం నియోజకవర్గంలో 14 ప్రాంతాలలో రిజర్వాయర్లను ఏర్పాటు చేసుకున్నామని, భవిష్యత్తులో అవసరం మేరకు మరిన్ని రిజర్వాయర్‌లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో కూడా 200 ఎకరాలలో తరకటూరు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ను అప్పటి టిడిపి ప్రభుత్వ దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు హయాంలోనే ఏర్పాటు చేశామని మంత్రి గుర్తు చేశారు. తర్వాత 2014-19 టిడిపి ప్రభుత్వ హయాంలో తరకటూరు పైపులైన్లకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టి నీటి వృధాను అరికట్టామన్నారను. నీటిని శుద్ధి చేయడానికి రూ.16 కోట్ల వ్యయంతో నగరంలో ప్లాంట్ ను ఏర్పాటు చేశామన్నారు. వేసవి దృష్ట్యా ఎక్కడా కూడా నీటి సమస్య తలెత్తకూడదనే ఉద్దేశంతో ఇటీవల దాదాపు వెయ్యి హార్స్ పవర్ సామర్థం గల మోటార్లను పెట్టి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను నింపామని, బందరు పట్టణంతోపాటు బందరు మండలం, పెడనకు రాబోయే రెండు నెలలకు ఎలాంటి ఇబ్బందులు రావన్నారు.

# 12న కాకినాడలో 'మాలల మహారణభేరి' భారీ బహిరంగ సభ

**హైదరాబాద్, మే 6 ప్రభాతవార్త:** ఎపి రాష్ట్ర మాల సంఘాల జెఎసి ఆధ్వర్యంలో స్వర్గీయ పి.వి.రావు 73వ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 12వ తేదీన కాకినాడ పట్టణంలో 'మాలల మహారణభేరి' పేరిట భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని పి.వి.రావు మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పండు అశోక్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్ నగరంలో ఈ రణభేరికి సంబంధించిన కరపత్రాలను తెలంగాణ రాష్ట్ర శాసన సభ్యుడు వివేక్‌వెంకటస్వామి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడుతూ 12వ తేదీన జరిగే భారీ బహిరంగ సభకు మాలలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మాల సంఘాల జెఎసి ఛైర్మన్ జి.చెన్నయ్య, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మాల సంఘాల నాయకులు బూర్గుల వెంకటేశ్వర్లు, బుంగ సతీష్‌కుమార్, మాలే నాగరాజు, సూరిబాబు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న వివేక్‌వెంకటస్వామి. చిత్రంలో జి.చెన్నయ్య, పండు అశోక్‌కుమార్ తదితరులు

# గ్రాండ్‌ప్రి రేస్ విజేతగా పియాస్ట్రి

## వరల్డ్ ఛాంపియన్ వెర్‌స్టాపెన్ ఎదురీత



**న్యూఢిల్లీ:** ఫార్ములా వన్-2025 సీజనులో భాగంగా జరిగిన ఆరో రేసు మయామి గ్రాండ్‌ప్రిలో మెక్‌లారెన్ జట్టు డ్రైవర్ ఆస్కార్ పియాస్ట్రి విజేతగా నిలిచాడు. గత నాలుగేళ్ల ఫార్ములావన్ ప్రపంచ ఛాంపియన్‌షిప్ టైటిల్ సాధించిన రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్‌వెర్‌స్టాపెన్‌కు ఈ సీజన్‌లో తీవ్రమైన పోటీ ఎదురవుతోంది. క్వాలిఫయింగ్ సెషన్‌లో అదరగొట్టిన వెర్‌స్టాపెన్‌ను ప్రధాన రేసులో మాత్రం మెక్‌లారెన్ డ్రైవర్లు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. ఇక ఫ్లోరిడాలో జరిగిన ఆరో రేసులో నిర్ణీత 57 ల్యాప్‌ల రేసును పియాస్ట్రి అందరికంటే వేగంగా, అందరికంటే ముందుగా 1 గంట 28 నిముషాల 51.587 సెకన్ల వ్యవధిలో పూర్తి చేసి ఈ సీజన్‌లో నాలుగో గెలుపును, వరుసగా మూడో విజయాన్ని అందుకున్నాడు. అలాగే మెక్‌లారెన్‌కే చెందిన లాండో నోరిస్ రెండో స్థానాన్ని దక్కించుకున్నాడు. గత ఏడాది ఈ రేసులో విజేతగా నిలిచిన నోరిస్ ఈసారి 1 గంట 28 నిముషాల 56.217 సెకన్లలో రేసును పూర్తి చేశాడు. మెర్సిడెస్ డ్రైవర్ జార్జి రసెల్ మూడో స్థానాన్ని పొందగా, పోల్ పొజిషన్ తో రేసును ఆరంభించిన ప్రపంచ ఛాంపియన్ వెర్‌స్టాపెన్ నాలుగో స్థానంతో సరిపెట్టుకున్నాడు. నలుగురు డ్రైవర్లు వీసా క్యాష్ రేసింగ్ బుల్స్‌కు చెందిన లియామ్ లాసన్, స్టేక్ టీమ్ కిక్ సాబెర్‌కు చెందిన గాబ్రియెల్ బోర్టొలెటో, మనీగ్రామ్ హాస్‌కు చెందిన ఒలివెర్ బియర్మన్, అల్పైన్ టీమ్‌కు చెందిన జాక్ దూహాన్‌లు రేసు మధ్యలోనే నిష్క్రమించారు. లాసన్ 36వ ల్యాప్‌లో, బోర్టొలెటో 30వ ల్యాప్‌లో, బియర్మన్ 27వ ల్యాప్‌లో, దూహాన్ తొలి ల్యాప్‌లో వైదొలగారు.

# బిలియర్డ్స్ క్లాసిక్ విజేత పంకజ్




**న్యూఢిల్లీ:** భారత దిగ్గజ క్యూయిస్టు పంకజ్ అద్వానీ ఖాతాలో మరో టైటిల్ చేరింది. సీసీఐ బిలియర్డ్స్ క్లాసిక్ టోర్నీలో పంకజ్ వరుసగా మూడోసారి విజేతగా నిలిచాడు. ఏస్ క్యూయిస్ట్ పంకజ్ అద్వానీ తన మూడవ సిసిఐ బిలియర్డ్స్ క్లాసిక్ టైటిల్‌ను గెలుచుకున్నాడు, ఇక్కడ జరిగిన ఫైనల్‌లో ధ్రువ్ సిత్వాలాను 5-2 తేడాతో ఓడించాడు. ముంబైలో ఆలస్యంగా ఇక్కడ జరిగిన ఫైనల్‌లో మొదటి మూడు ఫ్రేమ్‌లలో అద్వానీ తన అత్యుత్తమ ప్రదర్శనకు దూరంగా ఉన్నాడు, కానీ తన ప్రత్యర్థి సిత్వాలా అందించిన అవకాశాన్ని అతను సద్వినియోగం చేసుకున్నాడు, తుది పోరులో ఆదిలో తడబడ్డ అద్వానీ ఆ తర్వాత పుంజుకుని పోటీలోకి వచ్చాడు. అతను 94 పరుగుల బలమైన బ్రేక్‌లో ఉన్నప్పుడు తడబడ్డాడు. అద్వానీ నాలుగో ఫ్రేమ్‌ను గెలిచి 2-2తో సమం చేశాడు. తన లయను కనుగొని ఆటను తన ఆధీనంలోకి తీసుకున్నాడు. నాల్గవ ఫ్రేమ్‌ను కైవసం చేసుకుని మ్యాచ్‌ను సమం చేయడానికి అద్వానీ 145 పాయింట్ల సందర్భనతో సద్వినియోగం చేసుకున్నాడు. తరువాతి మూడు ఫ్రేమ్‌లను గెలిచి విజయాన్ని నమోదు చేశాడు. దీంతో 2.5 లక్షల రూపాయల మేర ప్రైజ్ మనీని అద్వానీ గెలుచుకున్నాడు. ఇక సిత్వాలా రన్నరప్‌గా 1.5 లక్షల రూపాయలను గెలుచుకున్నాడు. 2023 మరియు 2024లో విజయాలతో సహా వరుసగా మూడవ సంవత్సరం పోటీని గెలుచుకున్న తర్వాత అద్వానీ మాట్లాడుతూ, "ఈ విజయం నాకు ప్రత్యేకమైనది" అని అన్నారు.

### ఇంగ్లండ్, ఐర్లాండ్‌తో సిరీస్‌కు..

# వెస్టిండీస్ జట్టు ఖరారు

**న్యూఢిల్లీ:** ఐర్లాండ్, ఇంగ్లాండ్‌తో జరిగే వన్డే సిరీస్‌లకు వెస్టిండీస్ క్రికెట్ బోర్డు తమ జట్టును ఖరారు చేసింది. ఈ మేరకు మంగళవారం తమ జట్టును ప్రకటించింది. దక్షిణాఫ్రికాలో జరగబోయే 2027 వన్డే ప్రపంచ కప్‌ను దృష్టిలో ఉంచుకుని విండీస్ క్రికెట్ బోర్డు పటిష్టమైన జట్టును సిద్ధం చేసింది. ఈ స్క్వాడ్ లో భాగంగా ఎక్కువగా యువకులకే అవకాశం కల్పించింది. షాయ్ హోప్ కెప్టెన్‌గా కొనసాగుతాడు. 18 ఏళ్ల జ్యువెల్ ఆండ్రూ తిరిగి విండీస్ జట్టులో స్థాన సంపాదించాడు. వన్డే అరంగేట్రంలోనే సెంచరీ చేసిన అమీర్ జాంగూ కూడా జట్టులోకి వచ్చాడు. ఈ స్క్వాడ్ లో ఆశ్చర్యకరంగా విండీస్ స్టార్ బ్యాటర్ షిమ్రాన్ హెట్మైర్ పేరు లేదు. బ్రాండన్ కింగ్, ఎవిన్ లూయిస్ ఓపెనర్లుగా రావడం ఖాయంగా మారింది.



కీసీ కార్టీ మూడో స్థానంలో ఆడే అవకాశం ఉంది. హోప్, రోస్టన్ చేజ్, జస్టిన్ గ్రీవ్స్, షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్, రొమారియో షెపర్డ్ మిడిల్, లోయర్ ఆర్డర్ లో బ్యాటింగ్ భారాన్ని మోయనున్నారు. అల్జారి జోసెఫ్ పేస్ అటాక్కు నాయకత్వం వహిస్తారు. షమర్ జోసెఫ్, మాథ్యూ ఫోర్డ్ ఫాస్ట్ బౌలర్లుగా ఎంపికయ్యారు. గుడాకేష్ మోటీ విండీస్ స్క్వాడ్ లో ఏకైక ఫ్రంట్లైన్ స్పిన్నర్‌గా ఉన్నాడు. ఇక ఐర్లాండ్ పర్యటన ఈ నెల 21న ప్రారంభమవుతుంది. 23, 25 తేదీల్లో వరుసగా రెండు, మూడు వన్డేలు జరగనున్నాయి. 29 నుండి జూన్ 2 వరకు ఇంగ్లాండ్‌లో మూడు మ్యాచ్‌లు జరుగుతాయి. వన్డేలు ముగిసిన తర్వాత ఇంగ్లాండ్‌తో వెస్టిండీస్ ఐదు టీ20 మ్యాచ్‌లు ఆడనుంది. ప్రస్తుతం ఐపీఎల్ ఆడుతున్న రూథర్‌ఫోర్డ్, షెపర్డ్ త్వరలోనే విండీస్ జట్టులో చేరనున్నారు. కెప్టెన్ హోప్, జోసెఫ్ పాకిస్థాన్ సూపర్ లీగ్ ఆడుతున్నారు. ఈ లీగ్ మే 18 నాటికి పూర్తవుతుంది. కాగా వెస్టిండీస్ వన్డే జట్టులో షాయ్ హోప్ (కెప్టెన్), జ్యువెల్ ఆండ్రూ, కీసీ కార్టీ, రోస్టన్ చేజ్, మాథ్యూ ఫోర్డ్, జస్టిన్ గ్రీవ్స్, అమీర్ జాంగూ, అల్జారి జోసెఫ్, షమర్ జోసెఫ్, బ్రాండన్ కింగ్, ఎవిన్ లూయిస్, గుడకేష్ మోటీ, షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్, జేడెన్ సీల్స్, రొమారియో షెపర్డ్ ఉన్నారు.



### ప్లేఆఫ్‌కు నో ఎంట్రీ

### ఏడు జట్ల మధ్యనే ప్లేఆఫ్ రేస్ నుండి 3 టీమ్‌లు ఔట్

# ఐపిఎల్‌లో అదిరే ట్విస్ట్

న్యూఢిల్లీ: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)-2025, సీజన్ 18లో ఇప్పటి వరకూ 55 మ్యాచ్‌లు పూర్తయినప్పటికీ, ఏ జట్టు ప్లేఆఫ్‌లోకి ప్రవేశించలేక పోవడం గమనార్హం. మూడు జట్లు ప్లే ఆఫ్ రేసు నుంచి నిష్క్రమించగా, ప్లేఆఫ్ రేసు 7 జట్ల మధ్య కొనసాగుతోంది. అందువల్ల, ఈ వారం జరిగే మ్యాచ్ ప్లేఆఫ్స్‌లో ఆడబోయే జట్ల విషయంలో అనూహ్య పరిణామాలు చోటు చేసుకోనున్నాయి. ఈ 18వ సీజన్‌లో అద్భుతంగా రాణించిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ప్రస్తుతం 11 మ్యాచ్‌ల్లో 8 విజయాలతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉంది. మొత్తం 16 పాయింట్లు సాధించినప్పటికీ, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు మాత్రం అధికారికంగా ప్లేఆఫ్‌లోకి ప్రవేశించలేదు. దీనికి ప్రధాన కారణం మరో 7 జట్లు ప్లేఆఫ్ రేసులో ఉండటమే. ముఖ్యంగా, 4 జట్లు బెంగుళూరును అధిగమించి ప్లేఆఫ్స్‌కు చేరుకునే ఛాన్స్ ఉంది. అందుకే, రాబోయే మూడు మ్యాచ్‌లు ఆర్‌సీబీకి కీలకం కానున్నాయి. ముంబై ఇండియన్స్ తమ తదుపరి మూడు మ్యాచ్‌ల్లో గుజరాత్ టైటాన్స్, ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఓడిస్తే, ఆ జట్టు మొత్తం 20 పాయింట్లతో ప్లేఆఫ్‌కు చేరుకుంటుంది. పంజాబ్ కింగ్స్ తమ తదుపరి 3 మ్యాచ్‌ల్లో ముంబై ఇండియన్స్, రాజస్థాన్ రాయల్స్‌ను ఓడిస్తే 19 పాయింట్లతో ప్లేఆఫ్‌లో తమ స్థానాన్ని పదిలం చేసుకుంటుంది. అదేవిధంగా, గుజరాత్ టైటాన్స్‌కు సంబంధించి లక్నో సూపర్ జెయింట్స్, చెన్నై సూపర్ కింగ్స్‌ను ఓడించినట్లయితే మొత్తం 18 పాయింట్లతో ప్లేఆఫ్‌కు అర్హత సాధిస్తుంది. ఇక కోల్‌కతా నైట్ రైడర్స్ తమ తదుపరి మూడు మ్యాచ్‌ల్లో గెలిస్తే, అంటే, చెన్నై సూపర్ కింగ్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరులను ఓడించినట్లయితే, ఆ జట్టు మొత్తం 17 పాయింట్లతో ప్లేఆఫ్‌కు అర్హత సాధిస్తారు. ఇదిలా ఉండగా, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు లక్నో సూపర్ జెయింట్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్, కోల్‌కతా నైట్ రైడర్స్ చేతిలో ఓడిపోతే 16 పాయింట్లతో కొనసాగుతుంది. ఇదే జరిగితే, ఐపీఎల్ ప్లేఆఫ్ రేసు నుంచి నిష్క్రమిస్తుంది. పంజాబ్ కింగ్స్, ముంబై ఇండియన్స్, గుజరాత్ టైటాన్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ తదుపరి దశకు చేరుకుంటాయి. అందుకే, తదుపరి మ్యాచ్‌లు ఆర్సీబీ జట్టుకు కీలకం.



### వరల్డ్ టెస్ట్ ఛాంపియన్..

# ఫైనల్‌కు కౌంట్ డౌన్


## ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా మధ్య బిగ్‌ఫైట్

**న్యూఢిల్లీ:** వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2023-25 ఫైనల్‌కు కౌంట్ డౌన్ ప్రారంభమైంది. ఇంగ్లండ్‌లోని లార్డ్స్ వేదికగా జూన్ 11 నుండి 15 వరకూ జరుగనున్న తుది పోరులో దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా జట్లు అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఈ ఫైనల్ మ్యాచ్‌లో ఎలాగైనా గెలిచి రెండో సారి టైటిల్‌ను సొంతం చేసుకోవాలని ఆస్ట్రేలియా భావిస్తుంటే, దక్షిణాఫ్రికా సైతం తొలిసారి ట్రోఫీని ముద్దాడాలని పట్టుదలతో ఉంది. ఈ క్రమంలో దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఫైనల్‌కు ముందు జింబాబ్వేతో దక్షిణాఫ్రికా నాలుగు రోజుల టెస్టు ఆడేందుకు సన్నద్ధమవుతోంది. ఈ నెలాఖరి వారంతో ఈ మ్యాచ్ జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అదేవిధంగా వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ సన్నహాకాల్లో భాగంగా ప్రొటీస్ జట్టు జూన్ 3న కూడా తలపడనుంది. ప్రస్తుతం దక్షిణాఫ్రికా ప్లేయర్లు భారత్‌లో జరుగుతున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో బిజీగా ఉన్నారు. ఈ ఐపీఎల్‌లో గ్రూప్ స్టేజి ముగిసిన తర్వాత కొంత మంది సఫారీ ఆటగాళ్లు నేరుగా ఇంగ్లండ్ పయనం కానున్నారు. మిగిలిన ప్లేయర్లు ఈ నెల 25న ఐపీఎల్ ముగిసిన తర్వాత దక్షిణాఫ్రికా జట్టులో చేరనున్నారు. కాగా దక్షిణాఫ్రికా జట్టు స్టార్ పేసర్ కగిసో రబాడ ప్రపంచ డోపింగ్ వ్యతిరేక సంస్థ (వాడా) తాత్కాలికంగా విధించిన నిషేధాన్ని ఎత్తివేసింది. అతడు తిరిగి మళ్లీ మైదానంలో అడుగుడుపెట్టనున్నాడు. తొలుత వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ మ్యాచ్‌లకు రబాడ దూరం కానున్నట్లు ప్రచారం జరిగింది. తాజాగా నిషేధం ఎత్తి వేయడంతో దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డు ఊపిరిపీల్చుకుంది.

# వాణిజ్యం

# ప్రపంచంలో 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్

**న్యూఢిల్లీ, మే 6:** ప్రపంచ ఆర్థిక శక్తిగా భారత్ వేగంగా ఎదుగుతోంది. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) విడుదల చేసిన తాజా ప్రపంచ ఆర్థిక నివేదిక ఏప్రిల్ 2025 ప్రకారం, భారత్ ఈ ఏడాది (2025) జపాన్‌ను వెనక్కి నెట్టి ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుంది. ఈ కీలక పరిణామం భారత ఆర్థిక ప్రస్థానంలో మరో మైలురాయిగా నిలవనుంది. ఐఎంఎఫ్ నివేదిక ప్రకారం, 2025 ఆర్థిక సంవత్సరానికి భారత నామమాత్ర జీడీపీ 4,187.017 బిలియన్ డాలర్లకు (సుమారు రూ. 348 లక్షల కోట్లు) చేరుతుందని అంచనా. ఇదే కాలంలో జపాన్ జీడీపీ 4,186.431 బిలియన్ డాలర్లుగా (సుమారు రూ. 347.9 లక్షల కోట్లు) ఉండొచ్చని పేర్కొంది. ఈ స్వల్ప తేడాతో భారత్, జపాన్‌ను అధిగ మించి నాలుగో స్థానానికి ఎగబాకనుంది. ప్రస్తుతం (2024 వరకు) భారత్ ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా కొనసాగు తున్న సంగతి తెలిసిందే. భారత్ ప్రస్థానం ఇక్కడితో ఆగదని, రానున్న సంవత్సరాల్లో జర్మనీని కూడా అధిగమించి ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక శక్తిగా అవతరిస్తుందని ఐఎంఎఫ్ అంచనా వేసింది. 2028 నాటికి భారత జీడీపీ 5,584.476 బిలియన్ డాలర్లకు చేరుతుందని, అదే సమయంలో జర్మనీ జీడీపీ 5,251.928 బిలియన్ డాలర్లుగా ఉంటుందని లెక్కగట్టింది. అంతకు ముందే, అంటే 2027 నాటికి, భారత ఆర్థిక వ్యవస్థ 5 ట్రిలియన్ డాలర్ల (సుమారు 5,069.47 బిలియన్ డాలర్లు) మార్కును దాటుతుందని నివేదిక స్పష్టం చేసింది. ఇక ప్రపంచంలో అగ్రగామి ఆర్థిక వ్యవస్థల విషయానికొస్తే, 2025లో కూడా అమెరికా (30.5 ట్రిలియన్ డాలర్లు), చైనాలే (19.2 ట్రిలియన్ డాలర్లు) తొలి రెండు స్థానాల్లో కొనసాగు తాయని ఐఎంఎఫ్ పేర్కొంది. ఈ దశాబ్దం చివరివరకు ఈస్థానాల్లో పెద్దగా మార్పులు ఉండకపోవచ్చ ని అంచనా.



# నిరాశపర్చిన ఏథర్ ఎనర్జీ..

**ముంబై, మే 6:** దలాల్ స్ట్రీట్‌లో మంగళవారం కొత్త కంపెనీ లిస్టయ్యింది. ప్రముఖ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ఏథర్ ఎనర్జీ మార్కెట్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. అయితే ఇష్యూ ధరతో పోలిస్తే కేవలం రెండు శాతం ప్రీమియంతో సంస్థ షేర్లు లిస్ట్ అయ్యాయి. ఏథర్ ఎనర్జీ షేర్ ఇష్యూ ధర రూ.321 కాగా, నిఫ్టీలో రూ.328, బీఎస్‌ఈలో రూ.326తో నమోదైంది. మదుపర్ల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన రాక పోవడంతో లిస్టింగ్‌లో అదరగొట్టలేక పోయింది. అనంతరం ట్రేడింగ్ ప్రారంభించిన కాసేపటికే నష్టాల్లోకి జారుకుంది. ఒక దశలో 5శాతానికి పైగా నష్టాల్లో ట్రేడ్ అయ్యాయి. ఏథర్ ఎనర్జీ సంస్థ ఈ పబ్లిక్ ఇష్యూలో తాజా షేర్ల జారీ ద్వారా రూ.2,626 కోట్లు సమీకరించు కోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఆ నిధులను మహారాష్ట్ర లోని ద్విచక్ర వాహన ఫ్యాక్టరీ ఏర్పాటుతో పాటు రుణాన్ని తగ్గించు కునేందుకు కంపెనీ వినియోగించుకోనుంది. కొంత మొత్తాన్ని రీసెర్చ్ అండ్ డెవలప్ మెంట్ సామర్థ్యాలు పెంచుకోవడానికి వినియోగించ బోతోంది. ఐపీఓకు సంబంధించి ఏప్రిల్ 28 నుంచి 30 వరకు సబ్‌స్క్రిప్షన్ అందుబాటులో ఉంది. ఈ పబ్లిక్ ఆఫర్‌లో భాగంగా 75 శాతం షేర్లను క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్లకు కంపెనీ కేటాయించింది. 15 శాతం నాన్ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లకు, 10 శాతం షేర్లను రిటైల్‌ఇన్వెస్టర్లకు రిజర్వ్ చేసింది. విద్యుత్ వాహన విభాగంలో ఐపీఓకు వచ్చిన రెండో సంస్థగా ఏథర్ ఎనర్జీ నిలిచింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మెయిన్ బోర్డు నుంచి పబ్లిక్ ఆఫర్‌కు వచ్చిన తొలి ఐపీఓ ఇదే. బెంగళూరు కేంద్రంగా 2013లో ఈ సంస్థ ప్రారంభమైంది. తరుణ్‌మెహతా, స్వప్నిల్ జైన్ వ్యవస్థాపకులు. ఈవీ బ్రాండ్స్ లో ప్రముఖ స్థానాన్ని సంపాదించుకుంది.





# జొమాటో నుంచి 19వేల రెస్టారెంట్లు తొలగింపు!

**ముంబై, మే 6:** ప్రముఖ ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ జొమాటో పలు రెస్టారెంట్లకు షాకిచ్చింది. వినియోగదారుల ఫిర్యాదు ఆధారంగా ఆహార నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలు పాటించని రెస్టారెంట్లు, ఇతర బ్రాండ్‌లను కాపీ చేసి కస్టమర్లను తప్పుదారి పట్టించిన దాదాపు 19వేల రెస్టారెంట్లను యాప్ నుంచి తొలగించింది. ఈ విషయాన్ని స్వయంగా సంస్థ సిఇఒ దీపిందర్ గోయల్ తెలిపారు. ఈ యేడాది జొమాటో ఫుడ్ డెలివరీ విభాగంలో ఊహించిన దాని కంటే చాలా తక్కువ వృద్ధి నమోదు చేసింది. గతేడాది నవంబర్‌లో కంపెనీ వార్షిక వృద్ధి 20 శాతంగా ఉండాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. కానీ వాస్తవానికి జొమాటో వృద్ధి చాలా తక్కువగా ఉందని గోయల్ పేర్కొన్నారు. వినియోగ దారులు ముఖ్యంగా రెస్టారెంట్లకు వెళ్లడం, అక్కడ నుంచి ఆహారాన్ని తెప్పించుకోవడం బాగా తగ్గించారని చెప్పారు. అలాగే ఫుడ్ డెలివరీ విభాగంలో పోటీ పెరుగుతుందని, డెలివరీ సిబ్బందికి కూడా డిమాండ్ బాగా పెరుగడంతో జొమాటో తాత్కాలి కంగా డెలివరీ పార్టనర్స్ కొరతను ఎదుర్కొంటోందన్నారు. కాగా తాజాగా జొమాటో క్విక్ డెలివరీ సేవలను మళ్లీ నిలిపేసింది. ఫలితంగా ప్రారంభించిన నాలుగు నెలలకే క్విక్ డెలివరీ సేవలు క్లోజ్ అయ్యాయి. 2022లో జొమాటో ఇన్‌స్టంట్ పేరుతో 10 నిమిషాల డెలివరీ సర్వీస్‌ను ప్రారంభించి, యేడాదిలోనే నిలిపివేసింది. తాజాగా మరోసారి క్విక్ సేవను కూడా ఆపేయడం వెనుక నిర్వహణలో ఏర్పడిన సవాళ్లు, పోటీ సంస్థల ఒత్తిడి వంటి అంశాలే ప్రధాన కారణాలుగా పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

# రెండ్రోజుల లాభాలకు బ్రేక్

**ముంబై, మే 6:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. మాక్‌డ్రిల్స్ నిర్వహించా లంటూ కేంద్రం ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో భారత్ పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తలెత్తొచ్చన్న అంచనాలతో ఇన్వెస్టర్లు అప్రమత్తత పాటించారు. దీనికి తోడు తమ దేశంలో ఔషధాల ఉత్పత్తికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉత్తర్వులు జారీ చేయడంతో ఆ ప్రభావం మన ఫార్మా స్టాక్స్‌పై పడింది. వడ్డీ రేట్లపై బుధవారం అమెరికా ఫెడరల్ రిజర్వ్ నుంచి నిర్ణయం వెలువడనుండడంతో ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరిస్తున్నారని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఈ క్రమంలో రెండ్రోజుల వరుస లాభాలకు బ్రేక్ పడింది. నిఫ్టీ 24,400 దిగువకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 80,907.24 పాయింట్ల వద్ద స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. కాసేపటికే నష్టాల్లోకి జారుకుంది. ఇంట్రాడేలో 80,481.03 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 155.77 పాయింట్ల నష్టంతో 80,641.07 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 81.55 పాయింట్ల నష్టంతో 24,379.60 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 84.43గా ఉంది. ఎటర్నల్, టాటా మోటార్స్, ఎస్‌బీఐ, అదానీ పోర్ట్స్, ఎన్టీపీసీ షేర్లు నష్టాల్లో ముగిశాయి. భారతీ ఎయిర్‌టెల్, టాటా స్టీల్, మహీంద్రా మహీంద్రా, హిందుస్థాన్ యూనిలీవర్, నెస్లే ఇండియా షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 61.88 డాలర్ల వద్ద కొనసాగగా, బంగారం ఔన్సు మళ్లీ 3,400 డాలర్లకు చేరువవుతోంది. ప్రస్తుతం 3,391 డాలర్ల వద్ద ట్రేడయింది.



# మేడ్ ఇన్ ఇండియా కార్లు అమ్మకాల్లో రికార్డ్

**ముంబై, మే 6:** భారతదేశ కార్ల మార్కెట్ ప్రపంచ వ్యాప్తంగా అతిపెద్ద వాటిలో ఒకటి. దేశంలో తమ వాహనాలను తయారు చేసి విక్రయించడానికి అనేక అగ్రబ్రాండ్‌లను ఆకర్షిస్తోంది. భారతదేశంలో ఉత్పత్తి చేసిన ఆరు కార్ మోడళ్లు ఇప్పుడు దేశీయంగా అమ్ముడవుతున్న దానికంటే ఎక్కువ సంఖ్యలో ఎగుమతి అవుతున్నాయి. ఈ మోడళ్లలో హోండా సిటీ, ఎలివేట్, నిస్సాన్‌సన్నీ, మాగ్నైట్,హ్యుందాయ్ వెర్నా, జీప్ మెరిడియన్ ఉన్నాయి. మొదట భారతీయ వినియోగదారుల కోసం రూపొందించబడిన ఈ వాహనాలు ఇప్పుడు అంతర్జాతీయ మార్కెట్లలో మంచి ఆదరణ పొందుతున్నాయి. 2025ఆర్థిక సంవ త్సరానికి సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటో మొబైల్ తయారీదారులు (ఎస్ఐఎఎం) ఇచ్చిన డేటా ప్రకారం.. ఎగుమతుల వైపు ఈ మార్పు తరచుగా దేశీయ డిమాండ్ లేకపోవ డం, ప్రపంచ మార్కెట్లకు అనుగుణంగా కార్ల తయారీదారుల సామర్థ్యం కారణంగా ఉంటుంది. దీనికి ప్రధాన ఉదాహరణ హోండా ఎలివేట్. ఇది భారతదేశంలో అభివృద్ధి చెందుతున్న మార్కెట్ నుండి అధిక అంచనాలతో సెప్టెంబర్ 2023లో ప్రారంభించింది. ఉత్పత్తి ప్రారంభంలో పెరుగుదల ఉన్నప్పటికీ, దేశీయ అమ్మకాలు తగ్గాయి. దీనితో హోండా జపాన్ వంటి అంతర్జాతీయ మార్కెట్లను లక్ష్యంగా చేసుకుంది. 2025లో హోండా భారతదేశంలో 22,321 యూనిట్ల ఎలివేట్‌ను విక్రయించింది. కానీ 45,167 యూనిట్లను ఎగుమతి చేసింది. గత సంవత్సరం స్థానిక అమ్మకాలు 33,642 యూనిట్లు, ఎగుమతి చేయబడిన 10,273 యూనిట్లతో పోలిస్తే 2025లో ఎలివేట్ ఉత్పత్తి 54% పెరిగి 67,488 యూనిట్లకు చేరుకుంది. ఉత్పత్తి స్థాయిలు, సరఫరాదారు నిబద్ధతలను నిర్వహించడానికి ఎగుమతులు కీలకంగా మారాయి. హ్యుందాయ్ వెర్నా విషయంలో కూడా ఇలాంటి పరిస్థితిని ఎదుర్కొంది. 2023 పునఃప్రారంభం భారతదేశంలో ఎస్‌యూవీల కారణంగా నష్టపోతున్న సెడాన్‌లపై ఆసక్తిని తిరిగి రేకెత్తించడం లక్ష్యంగా పెట్టుకుంది. అయితే దేశీయ డిమాండ్ అంచనాలను అందుకోలేకపోయింది. దీనితో హ్యుందాయ్ దాని స్థాపించబడిన ఎగుమతి నెట్‌వర్క్‌ను ఉపయోగించుకుంది. వెర్నామధ్యప్రాచ్యం,ఆఫ్రికా, లాటిన్ అమెరికా వంటి మార్కెట్లలో గణనీయమైన విజయాన్ని సాధించింది.




# ఉద్యోగులకు టిసిఎస్ 100% వేరియబుల్ పే

**న్యూఢిల్లీ, మే 6:** ప్రముఖ ఐటీ సేవల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) జనవరి మార్చి త్రైమాసికానికి వేరియబుల్ పే అలవెన్స్‌ను చెల్లించింది. మొత్తం ఉద్యోగుల్లో 70 శాతం మందికి నూరు శాతం చెల్లింపులు చేసినట్లు టీసీఎస్ తెలిపింది. తమ తమ వ్యాపార విభాగాల పనితీరు ఆధారంగా మిగిలిన ఉద్యోగులకు వేరియబుల్ పే చెల్లింపులు చేసినట్లు పేర్కొంది. ప్రతి త్రైమాసికంలోనూ టీసీఎస్ ఇదే విధానాన్ని అవలంబిస్తోందని ఓ ప్రకటనలో తెలిపింది. మరోవైపు ఇటీవల మార్చి నెల త్రైమాసిక ఫలితాలను ప్రకటించిన టీసీఎస్, రూ.12,224 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. మార్జిన్లు తగ్గడంతో నికర లాభం 1.7 శాతం మేర క్షీణించింది. ఆదాయం మాత్రం గతేడాదితో పోలిస్తే 5.3 శాతం వృద్ధితో రూ.64,479 కోట్లుగా నమోదైంది. అయితే, త్రైమాసిక ఫలితాల సందర్భంగా 6.07 లక్షల మంది ఉద్యోగులకు వార్షిక వేతన పెంపును వాయిదా వేసినట్లు ప్రకటించింది. సుంకాల కారణంగా నెలకొన్న అనిశ్చితిని ఇందుకు కారణంగా చూపింది. సాధారణంగా ఏప్రిల్ నెలలో వేతన పెంపు ఉంటుంది. ఈసారి ఎప్పుడు చెల్లించేదీ మాత్రం టీసీఎస్ వెల్లడించలేదు.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.